ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 265 | సోమవారం | 24-08-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

కొత్త వాణిజ్య యుద్ధంలో చిక్కుకున్న అమెరికా – కెనడా
యుద్ధ సమయంలో ఎన్నికలకు జెలెన్స్కీ తిరస్కృతి 08



## పలు జిల్లాల్లో భారీ వర్షాలు


- ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు
- మూడు రోజులపాటు రాష్ట్రంలో విస్తారంగా వానలు
- వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో పాటు ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆదివారం నుంచి సోమవారం వరకు కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, తరువాయి 12లో

పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి 03
హక్కుల కోసం ఐక్య పోరాటం అవసరం : క్రిస్టోఫర్ జౌసెరా

# రాజకీయాలే కారణం



- కేంద్రం అనుమతి నిరాకరించడంతో అమెరికా పర్యటన రద్దు
- క్లిష్ట సమయంలో మద్దతిచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కృతజ్ఞతలు
- హైదరాబాద్ చేరుకున్నాక పూర్తి వివరాలు తెలియజేస్తా
- 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం 'రాజకీయ కారణాలతో' అనుమతి నిరాకరించిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ క్లిష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు, పార్టీ నేతలకు సిఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. లండన్‌లో తన అధికారిక సమావేశాలు, కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినందున, తొలుత అనుకున్న ప్రకారం బోస్టన్‌కు వెళ్లకుండానే తన పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు సిఎం స్పష్టం చేశారు. 'గడిచిన మూడు రోజులుగా లండన్‌లో నాకు లభించిన మద్దతుకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ అంశంలో నాకు మద్దతుగా నిలిచిన పార్టీకి, నాయకులకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ధన్యవాదాలు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత తన పర్యటనకు సంబంధించిన సంబంధిత అన్ని విషయాలపై మాట్లాడతాను' అని రేవంత్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అంతకుముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరువాయి 8లో

## తెలంగాణ రైజింగ్ లక్ష్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం

లండన్‌లో తెలుగు ప్రవాసులకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన 'తెలంగాణ రైజింగ్ లక్ష్యాల'ను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లో తెలుగు ప్రవాసులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఉదయం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ తరువాయి 8లో




# చర్చలు సఫలం



- ఆటో కార్మికుల నిరవధిక బంద్ ప్రతిపాదన విరమణ
- కార్మిక సంఘాల ప్రకటన
- ఆర్‌టిసి పక్షాన ఇవి ఆటోలు కొనే ప్రసక్తే లేదు
- ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం
- 1వ తేదీన కార్మికశాఖ, రవాణాశాఖ, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం
- మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ
- ఆటో కార్మిక సంఘాలతో మంత్రి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి చర్చలు




ప్రజాపక్షం/హైదరాబాద్

ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఆటో కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఆటో జెఎసి సమ్మె విరమించినట్లు ప్రకటించింది. ముఖ్యంగా చర్చల్లో కార్మికులు వ్యక్తం చేసిన పలు డిమాండ్లకు మంత్రి స్పందిస్తూ ఆర్‌టిసి తరఫున ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని, దీనిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా దుష్ప్రచారమేనని తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. బోర్డు విధివిధానాలపై సెప్టెంబర్ 1న కార్మిక శాఖ, రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆటో జెఎసి నాయకులతో మంత్రి జరిపిన చర్చలు ఒక అవగాహనకు వచ్చారు. అలాగే 2012 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదని మంత్రి పేర్కొన్నారు. ఆటో చార్జీల పెంపునకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని, ఎంత మేర పెంచాలనే అంశంపై తగిన నివేదిక తీసుకున్న అనంతరం సంబంధిత జిఓ జారీ చేస్తామని తెలిపారు. ఓలా, ఉబర్ తరహాలో ఆటో కార్మికుల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. ఇందుకు సంబంధించి ఐటి శాఖ ద్వారా ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ద్విచక్ర వాహనాలపై ర్యాపిడో, ఓలా, ఉబర్ వంటి సేవలు అందించే వాహనాల్లో ఎల్లో ప్లేట్ ఉన్నవాటికే ప్రయాణికులను తరలించేందుకు అనుమతి ఇచ్చే తరువాయి 12లో

# జర్నలిస్టుల రక్షణకు సమష్టి పోరాటమే మార్గం




- భయంతో వచ్చే స్వీయ సెన్సార్‌షిప్ ప్రభుత్వ సెన్సార్‌షిప్ కంటే ప్రమాదకరం
- రాజ్యాంగం, చట్టాలు మాత్రమే జర్నలిస్టులను రక్షించలేవు.. ప్రజలను భాగస్వాములను చేసి ఉద్యమించాలి
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

జర్నలిస్టులపై రాష్ట్రం, అధికార వ్యవస్థల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో కేవలం న్యాయస్థానాలు, రాజ్యాంగం, చట్టాలపైనే ఆధారపడటం సరిపోదని, జర్నలిస్టులు సమష్టిగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ప్రజలను భాగస్వాములను చేసి ఎప్పటికప్పుడు ఉద్యమించాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. జర్నలిస్టులు భయానికి గురై స్వీయ సెన్సార్‌షిప్‌కు పాల్పడితే అది ప్రభుత్వ సెన్సార్‌షిప్ కంటే ప్రమాదకరంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ''జర్నలిస్టుల రక్షణ – రాజ్యం నుంచి వచ్చే ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు సమష్టి చర్యల అవసరం'' అనే అంశంపై జరిగిన సెషన్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. జర్నలిస్టుల రక్షణకు సమష్టితత్వం, సంప్రదింపులు ప్రజాస్వామ్య సంస్థల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు. 'వాస్తవాలు పవిత్రమైనవేనని, అయితే వాటి ఆధారంగా జర్నలిస్టులు ఒక నిర్దిష్టమైన అభిప్రాయానికి రావడం సహజం. ఆ అభిప్రాయం ఎవరికైనా నచ్చకపోవచ్చు, దాంతో జర్నలిస్టులపై ఒత్తిడి, బెదిరింపులు మొదలవుతాయి' అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ భయం జర్నలిస్టుల ఆలోచనల్లోకి చొరబడితే, తరువాయి 8లో

పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే లక్ష్యం
హైదరాబాద్ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ 08

# వాయిదానే... ముగింపేదీ?

- పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడి 10 రోజులు అయినా.. ప్రోరోగ్‌పై వెలువడని అధికారిక ఉత్తర్వులు
- కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యం వెనుక ఏమైనా వ్యూహం ఉందా?
- మహిళా రిజర్వేషన్ చట్టం అమలు బిల్లును మరోసారి తీసుకురానున్నారా?
- ఊపందుకున్న ఊహాగానాలు



**న్యూఢిల్లీ :** పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడి 10 రోజులు దాటినా వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించలేదు. లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడి పది రోజులు గడిచినా, ఇప్పటివరకు సమావేశాల ప్రోరోగ్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రపతి ఇంకా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇలా చేయడం వెనక కేంద్ర ప్రభుత్వ వ్యూహం ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మరోసారి ఊపందుకున్నాయి. పార్లమెంట్ సమావేశాలు నిరవధిక వాయిదా కావడం, 'ప్రోరోగ్' కావడం రెండూ వేర్వేరు. సభలను నిరవధికంగా వాయిదా వేయడాన్ని అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటారు. అయితే రాష్ట్రపతి అధికారికంగా సమావేశాన్ని ముగిస్తూ ప్రకటన జారీ చేసినప్పుడే ప్రోరోగేషన్ పూర్తవుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో పార్లమెంట్ సమావేశాలను పిలుస్తారు, ముగిస్తారు. సాధారణంగా ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రోరోగేషన్ జరగుతుంది. ఉదాహరణకు ఈ ఏడాది బడ్జెట్ తరువాయి 8లో

## 2/3 మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా?

- డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం అమిత్ షా యత్నిస్తున్నారా?
- పార్లమెంట్‌ను ప్రోరోగ్ చేయకపోవడంపై ప్రశ్నించిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను అధికారికంగా ముగించడంలో జరుగుతున్న జాప్యాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లో ప్రోరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తుచేసింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక సమావేశంలో తరువాయి 8లో



## 'కార్మిక హక్కులే మానవ హక్కులు'


'బద్లావ్ జరూరీ హై' ప్రచారోద్యమంలో అమర్‌జీత్ కౌర్ పుస్తకావిష్కరణ

**న్యూఢిల్లీ:** సిపిఐ 'బద్లావ్ జరూరీ హై' ప్రచారోద్యమం దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. పాలకుల మెడలు వంచి, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయడమే కాకుండా సమస్యలపై ప్రశ్నించేలా అన్ని రాష్ట్రాల్లో సిపిఐ శ్రేణులు అరుణ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మార్పు నినాదంతో ముందుకు సాగుతూ ప్రజాకార్మిక కర్షక వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నారు. పాలకులు అనుసరించే వినాశకర విధానాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారిని చైతన్యవంతం చేస్తున్నారు. ఇదే క్రమంలో సిపిఐ కార్యదర్శి, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ రచించిన 'వర్కర్స్ రైట్స్ ఆర్ హ్యూమన్ రైట్స్' పుస్తకాన్ని ఆదివారం ఢిల్లీలోని ఎఐటియుసి భవన్‌లో ఆవిష్కరించారు. కార్మికులు హక్కులు... మానవ హక్కులని, న్యాయమైన తరువాయి 12లో

## హోర్ముజ్ జలసంధి మాదే.. దాన్నెప్పుడో మూసేశాం




అమెరికా–ఇరాన్ మధ్య ఆగని వాగ్యుద్ధం




వాషింగ్టన్ : హోర్ముజ్ జలసంధి మా భూభాగమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం మరోసారి సోషల్ మీడియా ద్వారా ఫోటోలను షేర్ చేశారు. మరోవైపు ఇరాన్ పాలకులు దీనిపై తీవ్రంగా స్పందించారు. హోర్ముజ్ జలసంధిని నౌకల రాకపోకలు లేకుండా ఏనాడో మూసివేశామని, జలసంధి పూర్తిగా తమ అధీనంలో ఉందని వారు స్పష్టం చేశారు. మరోవైపు ట్రంప్ కూడా జలసంధి పూర్తిగా తమ అధీనంలోనే ఉందని చెబుతున్నారు. ఇరాన్ ఓడరేవులకు ఇతర దేశాల నౌకలు వాణిజ్య కార్యకలాపాల నిమిత్తం వెళ్ళకుండా అడ్డుకోవడానికి వీలుగా దిగ్బంధనాన్ని కట్టుదిట్టంగా సెంట్‌కామ్ బలగాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ఇక అనివార్యంగా ఇరాన్ చర్చలకోసం తమ దగ్గరకు రావాల్సిందేనని ఆయన బీరాలు పలుకున్నారు. అమెరికా తన వైఖరిని మార్చుకునే వరకూ జలసంధి నౌకల రాకపోకల నిమిత్తం తెరచుకునే ప్రసక్తే లేదని ఇరాన్ ఐఆర్‌జిసి ప్రకటించింది. పైగా ఇరాన్ పాలకులు అమెరికాకు విధించిన ఆరు షరతులకు కట్టుబడి ఉన్నారు. యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని, ఇస్లామాబాద్ ఒప్పందాన్ని గౌరవించి అమలు చేయాలని, బెదిరింపులను శాశ్వతంగా మానుకోవాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, పశ్చిమాసియా నుండి అమెరికా బలగాలు పూర్తిగా ఖాళీ చేసి వెళ్ళిపోవాలని అమెరికాకు ఇరాన్ షరతులు విధించింది. జలసంధిలో ఒక కొత్త ప్రధాన నౌకా మార్గాన్ని ఏర్పాటు చేస్తూ ఒమన్‌తో ఒక ఒప్పందానికి వచ్చామని, దీనిపై ఇరు దేశాలు ఒక ఉమ్మడి ప్రకటన ఇంకా చేయాల్సి ఉందని మొహ్సెన్ రెజాయి చెప్పారు. హోర్ముజ్ జలసంధిని అమెరికాలో ఒక అంతర్గత భూభాగంగా ప్రకటిస్తూ మొదటిసారి ఆగస్టు 18వ తేదీన డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఫోటోలను షేర్ చేశారు. ఇప్పుడు ఆదివారం మరోసారి అవే చిత్రాలను షేర్ చేశారు. ఆగస్టు 14వ తేదీన లాంగ్ ఐలాండ్ పోలీస్ అకాడమీలో ట్రంప్ ప్రసంగిస్తూ హోర్ముజ్ జలసంధిని త్వరలోనే తాను అమెరికా భూభాగంగా తరువాయి 12లో

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను మరింత తీవ్రం చేయాలి
పార్టీకి నష్టం కలిగించేలా ఎవరూ వ్యవహరించొద్దు
ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం కళాకారులు తమ కళలకు, గళాలకు పనిచెప్పాలి 03

# రిల్కే రచనలు.. సంక్లిష్టమైన ప్రశ్నలు

యూరోపియన్ ఆధునిక సాహిత్యంలో అత్యంత ప్రభావశీలమైన జర్మన్ భాషా కవుల్లో రైనర్ మారియా రిల్కే ఒకరు. ప్రాగ్‌లో జన్మించిన బోహీమియన్–ఆస్ట్రియన్ సాంస్కృతిక ప్రపంచానికి చెందిన రిల్కే, జర్మన్ భాషలో రాస్తూనే రష్యన్ సంస్కృతి, ఫ్రెంచ్ కళ, యూరోపియన్ క్రైస్తవ సంప్రదాయం, ప్రతీకవాదం, ఆధునిక నగర అనుభవం, శిల్పకళ, చిత్రకళ, తత్వశాస్త్రం వంటి అనేక ప్రవాహాలను తన రచనల్లో కలిపాడు. ఆయన జీవితకాలంలోనే ఆయన కవిత్వం ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించగా, మరణానంతరం ఆయన ప్రభావం జర్మన్ సాహిత్యాన్ని దాటి యూరోపియన్ మరియు ప్రపంచ కవిత్వంలో విస్తరించింది. రిల్కే సాహిత్యాన్ని చదవడం అంటే కేవలం కొన్ని అందమైన కవితలను చదవడం కాదు. అది ఒంటరితనం, ప్రేమ, మరణం, కళ, దేవుడు, భయం, ప్రకృతి, వస్తువులు, జ్ఞాపకం, కాలం, మనిషి ఉనికి వంటి ప్రశ్నలతో నిరంతరం తలపడే ఒక కవిమనస్సులోకి ప్రవేశించడం. ఆయనకు కవిత్వం భావాలను అలంకారంగా చెప్పే సాధనం కాదు. ప్రపంచాన్ని ఒక కొత్త విధంగా చూడటానికి చేసే సాధన. రిల్కే 1875 డిసెంబర్ 4న ప్రాగ్‌లో జన్మించాడు. ఆయన తండ్రి జోసెఫ్ రిల్కే రైల్వే ఉద్యోగి. తల్లి ఫియా రిల్కే. బాల్యంలోనే సైనిక పాఠశాలలో చదివాడు. ఆ అనుభవం అతని వ్యక్తిత్వంపై తీవ్ర ప్రభావం చూపింది. తరువాత అతను కళ, సాహిత్యం, తత్వశాస్త్రం వంటి రంగాల వైపు మళ్లాడు. 1894లో 'లెబెన్ అండ్ లెయిడర్' అనే తొలి కవితా సంకలనం వెలువడింది. 1897లో లవో ఆండ్రియాస్ సాలమ్‌ను కలిసిన తరువాత తన మొదటి పేరు 'రెన్'ను 'రైనర్'గా మార్చుకున్నాడు. కేవలం పేరు మార్చుకోవడంతో ఆగకుండా, తనను తాను ఒక కవిగా పునర్నిర్మించుకోవాలనే ప్రయత్నాలను రిల్కే తన జీవితాంతం కొనసాగించాడు. లౌవాతో పరిచయం అతని జీవితంలో కీలకమైన మలుపు. ఆమె ద్వారానే అతనికి 'నిశ్చే' ఆలోచనలతో పరిచయం ఏర్పడింది. తరువాత రష్యా పర్యటనలు, లియో టాల్‌స్టాయ్‌తో పరిచయం, రష్యన్ ఆధ్యాత్మికతపై ఆసక్తి అతని కవిత్వంలో దేవుడు, మానవుడు, అంతరంగం, సృష్టి వంటి ప్రశ్నలకు కొత్త రూపాన్ని ఇచ్చాయి. తరువాత పారిస్ అతని కళాత్మక పరిణామంలో అత్యంత ముఖ్యమైన ప్రదేశంగా మారిం ది. అక్కడ అగస్టే రొడిన్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలం రోడిన్‌కు కార్యదర్శిగా కూడా పనిచేశాడు. శిల్పకళను అత్యంత తీవ్రంగా పరిశీలించిన ఈ కాలం తరువాత రిల్కే కవిత్వంలో వచ్చిన గొప్ప మార్పుకు కారణమైంది. అందుకే రిల్కే సాహిత్య పరిణామాన్ని సాధారణంగా, 'ఆధ్యాత్మిక, భావోద్వేగ దశ', 'వస్తువులను కేం ద్రంగా చేసుకున్న కళాత్మక దశ', 'అస్తిత్వం, మరణం, పరివర్తన, విశ్వంతో మానవ సంబంధం వంటి ప్రశ్నలను ఎదుర్కొనే పరిపక్వత' అనే మూడు దశలుగా చూడవచ్చు. నిజానికి ఈ మూడు దశలు వేరువేరు కావు. ఒక దశలో పుట్టిన ప్రశ్న మరో దశలో మరింత లోతైన రూపాన్ని తీసుకుంటుంది.

రిల్కే తొలి రచనల్లో 'రోమాంటిసిజం', 'సింబాలిజం' ప్రభావం బలంగా కనిపిస్తుంది. ఆయనకు దేవుడు ఒక స్థిరమైన, బయట ఉన్న సర్వశక్తిమంతుడైన సత్యం కంటే, మనిషి అంతరంగంలో నిరంతరం నిర్మితమవుతున్న ఒక అనుభవం. అంటే, రిల్కే కవిత్వంలో దేవుడు అనేది చాలా సందర్భాల్లో ఒక సిద్ధాంతం కాదు. అది అన్వేషణ. అందువల్ల ఆయనను సంప్రదాయ మతకవి అని పిలవడం సరైనది కాదు. అదే సమయంలో పూర్తిగా మతవ్యతిరేక కవిగా కూడా చూడలేం. దేవుడు ఎక్కడ ఉన్నాడు? అనే దానికంటే, మనిషి తనలో దేవుడిని ఎలా అనుభవిస్తాడు? అనే ప్రశ్నకు అతని ఆలోచన దగ్గరగా ఉంటుంది. ఈ భావజాలం 'ది బుక్ ఆఫ్ అవర్స్ దాస్ స్టండెన్‌బుచ్ (1905)లో అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంకలనం మూడు భాగాలుగా ఏర్పడింది. ఇందులో దేవుడు, కళాకారుడు, ప్రేమ, ఒంటరితనం, ప్రార్థన, ఆత్మ వంటి అంశాలు పరస్పరం కలుస్తాయి. ఇక్కడ రిల్కే కవి ఒక ప్రవక్తగా కనిపిస్తాడు. కళాకారుడు ప్రపంచాన్ని మిగిలిన మనుషుల కంటే లోతుగా అనుభవించే వ్యక్తి. కానీ తరువాత రిల్కే ఈ దృక్కోణాన్ని మార్చుకుంటాడు. అదే ఆయన సాహిత్య పరిణామంలో ఒక గొప్ప మలుపు. 'వస్తుకవిత' రిల్కే సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి అత్యంత కీలకంగా మారింది. 'న్యుయే గెడిచ్' 1907లో, 'డెర్ న్యుయెన్ గెడిచె ఆండెరెర్ టెయిల్' 1908లో ప్రచురితమయ్యాయి. ఇవి రిల్కే మధ్యదశ సాహిత్యానికి కేంద్ర రచనలు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ కూడా 'న్యూ పోయెమ్స్'ను ఆయన ఖ్యాతికి ఆధారమైన నాలుగు ప్రధాన రచనా సమూహాల్లో ఒకటిగా పేర్కొంటుంది. ఇక్కడ రిల్కే తన అంతర్గత భావోద్వేగాలను నేరుగా వ్యక్తం చేయడం తగ్గిస్తాడు. అదే సమయంలో 'శిల్పం', 'పుష్పం', 'జంతువు', 'పండు', పురాతన విగ్ర హం', 'భవనం', 'ప్రకృతి'కి ప్రాధాన్యం ఇస్తాడు. అయితే, అది కేవలం వస్తువుల వర్ణనకు పరిమితం కాదు. అతను ఒక వస్తువును అంత సూక్ష్మ ంగా పరిశీలిస్తాడు, అది చివరికి మనిషి ఉనికికి అద్దంగా మారుతుంది. ఇక్కడ రోడిన్ ప్రభావం కీలకం. శిల్పాన్ని చూడటం ద్వారా రిల్కే చూడటం అనే క్రియనే కళాత్మక సాధనగా మార్చుకున్నాడు. పరిశోధకులు కూడా 'న్యుయె గెడిచ్' లో కళాకారుడి పాత్ర మారి, వస్తువుల స్వభావాన్ని చేరుకోవడానికి కళ ఒక మార్గంగా మారిందని గుర్తించారు. రిల్కే ప్రసిద్ధ కవితల్లో 'ది పాంథర్' ఒకటి. పారిస్ జంతుప్రదర్శనశాలలోని పాంథర్‌ను చూస్తూ రాసిన ఈ కవితలో జంతువు నిరంతరం తిరుగుతూ ఉంటుంది. దాని చుట్టూ ఇనుప కడ్డీలు ఉన్నాయి. పాంథర్‌కు ప్రపంచం కనిపిస్తుంది, కానీ ఆ ప్రపంచాన్ని స్వేచ్ఛగా అనుభవించలేదు. ఇది మొదట ఒక జంతువు గురించి రాసిన కవితగా కనిపిస్తుంది. కానీ కవితను లోతుగా చదివితే అది ఆధునిక మనిషి పరిస్థితిగా మారుతుంది. మనిషికి కూడా ప్రపంచం ఉంది. కానీ, సామాజిక వ్యవస్థలు, నగర జీవితం, భయం, ఒంటరితనం, వృత్తి, రాజకీయ నిర్మాణాలు, శరీరం, కాలం వంటి కనిపించని చువ్వలు అతని ఆలోచనలను, స్వేచ్ఛను బంధిస్తాయి. 'ప్రపంచాన్ని చూడటం... ఆ ప్రపంచాన్ని అనుభవించడం ఒకటేనా?' అన్నది అతని ప్రశ్న. పాంథర్ ప్రపంచాన్ని చూస్తుంది. కానీ దాని స్వేచ్ఛ దాని శరీరంలోనే బంధించబడి ఉంది. ఇది కేవలం జంతువు అనుభవించే విషాదం కాదు. ఆధునిక మనిషి యొక్క పరాయీకరణకు కూడా ఇది ఒక రూపకం.



రిల్కే గద్య రచనల్లో అత్యంత ముఖ్యమైన 'ది నోట్‌బుక్స్ ఆఫ్ మాల్టే లారిడ్స్ బ్రిగ్గె' 1910లో వెలువడింది. ఇది సాధారణ కథా నిర్మాణం కలిగిన నవల కాదు. ఇది జ్ఞాపకాలు, భయాలు, అనుభవాలు, పరిశీలనలు, ఆలోచనలు, చిన్న సంఘటనలు, కళా అనుభవాలు, మరణం గురించి ధ్యానాలు వంటి అనేక ముక్కలతో నిర్మితమైన ఒక ఆధునిక మానసిక రచన. మాల్టే పారిస్‌లో నివసించే ఒక యువకుడు. అతను నగరాన్ని చూస్తాడు. కానీ అతను చూసేది ఆధునిక నగరపు అందం కాదు.... అందులోని అనారోగ్యాన్ని, పేదరికాన్ని, ఒంటరితనాన్ని, జనసమూహంలో వ్యక్తి అదృశ్యమవడాన్ని, ఆసుపత్రులను, మరణాన్ని, భయాన్ని చూస్తాడు. ఇక్కడ రిల్కే ఆధునికత మరింత స్పష్టమవుతుంది. పూర్వపు సాహిత్యంలో నగరం నాగరికత, అభివృద్ధి, అవకాశాలకు చిహ్నంగా ఉండవచ్చు. రిల్కేకు ఆధునిక నగరం మరో రూపాన్ని చూపిస్తుంది. ఒక వ్యక్తి తన స్వంత జీవితంలోనే పరాయివాడిగా మారే ప్రదేశాన్ని కళ్లకు కడుతుంది. అందుకే మాల్టేను ఆధునిక యూరోపియన్ నవల పరిణామంలో ఒక ముఖ్యమైన రచనగా పరిగణిస్తారు. ఆధునిక గద్య నిర్మాణం, వ్యక్తి అంతరంగం,'ఎపిఫనీ' వంటి అనుభవాల విషయంలో ఈ రచనపై జేమ్స్ జాయిస్‌తో పోలికలు కూడా సాహిత్య పరిశోధనలో కనిపిస్తాయి.

రిల్కే దృష్టిలో మరణం అనేది ముగింపు కాదు, ఒక పరివర్తన. రిల్కే సాహిత్యంలో అత్యంత నిరంతరమైన అంశం మరణం. కానీ అతని మరణ భావనను సాధారణ భయంగా అర్థం చేసుకోవడం తప్పు. అతనికి మరణం అనేది జీవితానికి వ్యతిరేకం కాదు. అది జీవితంలోనే ఉన్న ఒక భాగం. రిల్కేకు మనిషి తన మరణాన్ని ఇతరుల ద్వారా అనుభవించలేడు. ప్రతి వ్యక్తి తనకు సంబంధించిన ప్రత్యేకమైన మరణాన్ని తనతోనే మోసుకుంటూ ఉంటాడు. ఇది అతని కవిత్వంలో ఒక విచిత్రమైన వ్యక్తిగతతను సృష్టిస్తుంది. జీవితం అంటే జననం, అనుభవం, ప్రేమ, బాధ, సృజన.. చివరికి మరణం అనే సరళరేఖ ఎంతమాత్రం కాదు. జీవితం, మరణం అనేవి ఒకదానితో ఒకటి... ఒకదానిలో ఒకటి కలిసిపోతాయి. అందుకే, రిల్కే కవితంలో శిశువు, వృద్ధుడు, ప్రేమికుడు, కళాకారుడు, దేవదూత, జంతువు, విగ్రహం, పువ్వు అన్నీ ఒకే అస్తిత్వ ప్రశ్నలో భాగాలవుతాయి.

రిల్కే సాహిత్య శిఖరాన్ని చేరిన రచనల్లో 'డ్యూనెసర్ ఎలెగియెన్' లేదా 'డునో ఎలిగీస్' అగ్ర స్థానంలో ఉంటుంది. ఈ పది 'ఎలిగీస్' రచన 1912లో ప్రారంభమైంది. డ్యూనో కాజిల్‌లో ప్రిన్సెస్ మేరీ వాన్ థర్న్ ఉన్డ్ టాక్సిస్ అతిథిగా ఉన్నప్పుడు రిల్కే మొదటి కవితను ప్రారంభించాడు. కానీ మొత్తం సంకలనం పూర్తవడానికి దాదాపు పది సంవత్సరాలు పట్టింది. 1922లో, స్విట్జర్లాండ్‌లోని మ్యుజోట్‌లో తీవ్రమైన సృజనాత్మక ఉద్ధృతిలో అతను దానిని పూర్తి చేశాడు. ఇది రిల్కే సాహిత్యంలోని అత్యంత సంక్లిష్టమైన రచన. 'మనిషి ఎందుకు ఇంత అస్థిరమైన, తాత్కాలికమైన, బాధతో నిండిన ప్రపంచంలో జీవించాలి?' అనేది ఇక్కడ ప్రధాన ప్రశ్న. సాధారణంగా ఈ ప్రశ్నకు అంతా తాత్విక ధోరణిలో సమాధానం ఇస్తారు. కానీ రిల్కే మాత్రం అలా చేయలేదు. అతను దేవదూతలను పిలుస్తాడు. కానీ ఆ దేవదూతలు క్రైస్తవ సంప్రదాయంలోని కరుణామయమైన దేవదూతలు కావు. అతను సృష్టించిన 'దేవత' అనేది మనిషి తట్టుకోలేనంత తీవ్రంగా ఉన్న అస్తిత్వ సంపూర్ణతకు ప్రతీక. అందుకే, 'ఎవ్రి ఏంజెల్ ఈజ్ టెర్రిఫయింగ్' (ప్రతి దేవత భయానకంగా ఉంటుంది' అనే ప్రసిద్ధ కొటేషన్ అతని కలం నుంచి వచ్చింది. ఇక్కడ భయం అంటే దెయ్యం వల్ల కలిగే భయం కాదు. అది సంపూర్ణతను ఎదుర్కొనే మనిషి యొక్క భయం. మనిషి పరిమితమైనవాడు. దేవదూత పరిమితులను దాటి ఉన్న సంపూర్ణతకు ప్రతీక. కాబట్టి దేవదూతను పూర్తిగా ఎదుర్కోవడం అంటే మన స్వంత పరిమితిని ఎదుర్కోవడం. ఈ విధమైన ఎన్నో వైవిధ్యాలను, సంక్లిష్టతల తుట్టెను కదిపిన రిల్కే ఒక రకంగా ప్రశ్నల ప్రభంజనాన్ని ఎదుర్కొన్నాడు. అయినప్పటికీ, అతని రచనలు నేటికి కూడా ప్రాధాన్యతను కోల్పోలేదు. యువ రచయితలకు అతను వేసే సూటి ప్రశ్న 'నీవు నిజంగా రాయకుండా ఉండలేని స్థితిలో ఉన్నావా?'. ఇది నిజంగానే నేటి సృజనాత్మక ప్రపంచానికి అసౌకర్యకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు రచయిత కావడానికి ముందు రచయిత తన గురించి ప్రచారం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. మనుషులు ముందుగా వ్యక్తిగత బ్రాండ్ నిర్మించుకుని, తరువాత ఏదైనా చెప్పడానికి ప్రయత్నిస్తారు. రిల్కే దీనిని చూసి ఉంటే కనీసం ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచేవాడు.

– సత్య శ్రీ

"అతని అలసిన చూపు..
అంతులేని ఇనుప కడ్డీలను
చూస్తూ... చూస్తూ..
ఇప్పుడు శూన్యమైన చూపుగా మారింది;
దేనినీ పట్టుకోని, దేనినీ అందుకోని చూపుగా.
అతనికి చుట్టూ వెయ్యి కడ్డీలున్నట్టే అనిపిస్తుంది;
ఆ కడ్డీల అవతల
ఏ ప్రపంచమూ లేదనిపిస్తుంది.
అతని వంగలిగే నడక,
బలమైన అడుగుల మృదువైన సవ్వడి,
చిన్నవవుతూ, మరింత చిన్న వలయాలుగా
నెమ్మదిగా తిరుగుతూనే..
అతని అంతరాళంలో లోతుగా
కేంద్రీకృతమైన ఒక శక్తివంతమైన
నాట్యం చేస్తున్నాయి..
ఆ శక్తి ఒక సంకల్పంలో ఉంది
మైమరచిపోయినా,
లొంగిపోని,
అణచలేని సంకల్పంలో....

అయితే కొన్నిసార్లు
అతని కనురెప్పల తెరలు కాస్త విడిపోతాయి;
కళ్ల మణులు పెద్దవవుతాయి.
గతంలో ఎదురైన దృశ్యాలు
ఒక్కొక్కటిగా అతని కళ్లలోకి ప్రవేశిస్తాయి.
అప్పుడు అతని అవయవాల గుండా
ఒక ఉద్వేగం నిశ్శబ్దంగా
బిగుసుకుంటూ సాగుతుంది..
చివరికి అది కూడా
అస్తిత్వాన్ని కోల్పోయి,
అతని హృదయంలోనే
నిశ్శబ్దంగా చనిపోతుంది." – రిల్కే

# అనుభవాలకు అక్షర రూపం

జార్జ్ లూయిస్ బోర్హెస్‌ను చదవడం అంటే ఒక కథలోకి ప్రవేశించడం కాదు. ఆ కథ అనే మన భావననే ప్రశ్నించే ఒక మేధో ప్రపంచంలోకి అడుగుపెట్టడం. అర్జెంటీనాలో, 1899 ఆగస్టు 24న జన్మించిన బోర్హెస్ ఇరవయ్యో శతాబ్దపు ప్రపంచ సాహిత్యాన్ని అత్యంత గాఢంగా ప్రభావితం చేసిన రచయితల్లో ఒకడు. ఆయన సాహిత్యంలో కథ కంటే ఆలోచన ముందుంటుంది. కాలం, అనంతం, జ్ఞాపకం, గుర్తింపు, భాష, దేవుడు, స్వేచ్ఛ, విధి వంటి మహత్తర ప్రశ్నలను ఆయన కొన్ని పేజీల కథలోనే విశ్వవ్యాప్త అనుభవాలుగా మలిచాడు. 'ఫిసియోనెస్' (1944), 'ది అలెఫ్' వంటి సంకలనాలు ఆ ప్రయోగానికి శిఖరాలు. బోర్హెస్ ప్రత్యేకత ఆయన కథ చెప్పే పద్ధతిలోనే ఉంది. సాధారణ కథలో పాత్రలు సంఘటనలను ముందుకు నడిపిస్తాయి. బోర్హెస్ దగ్గర ఒక ఆలోచన కథను నడిపిస్తుంది. ఒక కల్పిత పుస్తకం. ఉనికిలో లేని రచయిత... కనిపించని గ్రంథాలయం.. అంతులేని అద్దాల వరుస.. ప్రపంచంలోని ప్రతి పుస్తకాన్నీ కలిగి ఉన్న గ్రంథాలయం.. విశ్వంలోని ప్రతి బిందువునూ తనలో దాచుకున్న ఒక బిందువు. ఇవన్నీ కలబోసిన విత్తనాలుగా మారడంతో, కథలకు ప్రత్యేకత చేకూరుతుంది. అందుకే, ఆయన కథలు ఒకేసారి కథలుగానూ, తాత్విక ప్రయోగాలుగానూ కనిపిస్తాయి. అనంతత్వాన్ని కథా రూపంలో పరిశీలించే రచనగా 'ది అలెఫ్'ను విమర్శకులు చూస్తారు. బోర్హెస్ సాహిత్యంలో 'మెటాఫిక్షన్' అనే లక్షణం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. రచయిత కథలోకి ప్రవేశిస్తాడు. కథలోని పుస్తకం నిజమా? కల్పితమా? అన్న సందేహాన్ని పాఠకుడిలో కలిగిస్తాడు. ఒక కల్పిత రచయిత గురించి నిజమైన జీవితచరిత్ర రాస్తున్నట్టు నటిస్తాడు. ఫుట్‌నోట్లు, గ్రంథసూచికలు, చారిత్రక వివరాల్లాంటి రూపాలను ఉపయోగించి కల్పనకు వాస్తవికత ముసుగు తొడుగుతాడు. 'పియరె మెనార్డ్, ఆథర్ ఆఫ్ ది క్విక్సోట్'లో ఒకే నవలను వేరే కాలంలో, వేరే రచయిత రాస్తే దాని అర్థం మారుతుందా? అనే ప్రశ్నను ముందుకు తెచ్చాడు. ఇక్కడ రచయిత ఎవరు అన్న ప్రశ్న కంటే పఠనం ఎలా అర్థాన్ని సృష్టిస్తుంది అన్న ప్రశ్న కీలకమవుతుంది. బోర్హెస్‌కు సాహిత్యం గతాన్ని పునరావృతం చేయడం కాదు.. గతాన్ని కొత్తగా చదవడం. కాఫ్కాను చదివిన తరువాత మనం అతనికంటే ముందు వచ్చిన కొంతమంది రచయితలను కొత్త దృష్టితో చూడగలమని ఆయన ప్రతిపాదించాడు. అంటే ఒక గొప్ప రచయిత తన పూర్వీకులను కూడా మార్చేస్తాడు. సాహిత్య చరిత్రను ఒకే దిశలో ప్రవహించే నదిగా కాకుండా, పరస్పరం ప్రభావితం చేసుకునే కాలాల వలయంగా ఆయన చూశాడు. ఈ ఆలోచన తరువాతి పోస్ట్‌మోడర్న్ విమర్శలో విస్తృతంగా చర్చకు వచ్చింది. 'లాబిరింత్' బోర్హెస్‌కు కేవలం ఒక ప్రతీక మాత్రమేకాదు, ఆయన సాహిత్య నిర్మాణానికి ఒక నమూనాగా కూడా ఆవిష్కృతమవుతుంది. 'ది గార్డెన్ ఆఫ్ ఫోర్కింగ్ పాథ్', 'ది లైబ్రరీ ఆఫ్ బబెల్', 'ది సర్క్యులర్ రూయిన్స్' వంటి కథల్లో దారులు వేర్వేరు. ప్రతి దారిలో మరో అవకాశం తెరుచుకుంటుంది. ఒక నిర్ణయం మరొక ప్రపంచాన్ని సృష్టిస్తుంది. ఒక మనిషి మరొక మనిషి కలలోని పాత్ర కావచ్చు. ఒక వ్యక్తి తనకే మరో రూపంగా కనిపించవచ్చు. ఈ విధంగా బోర్హెస్ 'నేను' అనే భావనకే స్థిరత్వం లేదని సూచిస్తాడు. ఆయన కథల్లో గుర్తింపు తరచూ ప్రతిబింబంలా మారుతుంది. ' ది అలెఫ్'లోని కేంద్ర భావన మరింత విస్తృతమైనది. ఒక చిన్న బిందువులో విశ్వంలోని అన్ని బిందువులు ఏకకాలంలో కనిపిస్తాయి. కానీ మనిషి భాష మాత్రం వరుసగా మాత్రమే చెప్పగలదు. ఒకేసారి కనిపించిన అనంతాన్ని భాష ఒక్కొక్క పదంగా మాత్రమే వ్యక్తం చేయగలదు. ఇక్కడ బోర్హెస్ ఒక అద్భుతమైన సాహిత్య సమస్యను సృష్టిస్తాడు. అనంతాన్ని వర్ణించడానికి పరిమితమైన భాషను ఎలా ఉపయోగించాలి? ఈ ప్రశ్నకు సమాధానాన్ని జోడించి, అత్యుత్తమంగా తీర్చిదిద్దగలగడమే అతని కథలకు సౌందర్యాన్ని ఇస్తుంది. ఈ కథలోని విశ్వదర్శనాన్ని డాంటే రాసిన 'ప్యారడిసో'తో పోల్చిన విమర్శకులు కూడా ఉన్నారు. అదే విధంగా, కొంతమంది పేర్కొంటున్నట్టు బోర్హెస్ ప్రభావాన్ని 'మ్యాజికల్ రియలిజం' అనే ఒకే పదంతో పరిమితం చేయడం సరైంది కాదు. లాటిన్ అమెరికన్ సాహిత్య పరిణామంలో ఆయనకు కీలక స్థానం ఉన్నప్పటికీ, ఆయన ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. తరువాతి పోస్ట్‌మోడర్న్ రచయితలు, ప్రయోగాత్మక కథకులు, సైన్స్ ఫిక్షన్ రచయితలు ఆయన నుంచి కథా నిర్మాణం, కాలం, వాస్తవికత, రచయితపాఠక సంబంధాలపై కొత్త ఆలోచనలను స్వీకరించారు. 'ది లైబ్రరీ ఆఫ్ బబెల్' నేటి సమాచార విశ్వాన్ని గుర్తు చేస్తుంది. 'పియరె మెనార్డ్' పాఠ్యానికి అర్థం ఎవరు నిర్ణయిస్తారనే ప్రశ్నను ముందుకు తెస్తుంది. అయితే, బోర్హెస్ గొప్పతనం ఆయన సంక్లిష్టమైన ఆలోచనలను మరింత సంక్లిష్టమైన భాషలో చెప్పడంలో లేదు. అందుకు విరుద్ధంగా, ఆయన గద్యంలోని పొదుపే దాని బలం. కొద్ది పేజీల్లో ఒక తాత్విక గ్రంథం విస్తీర్ణాన్ని సృష్టించగలిగాడు. అందుకే బోర్హెస్ కథ పూర్తయిన తరువాత కూడా ముగియదు. కథ ముగిసిన చోట పాఠకుడి ఆలోచన మొదలవుతుంది. ఒక కథను చదివి దాని అర్థాన్ని తెలుసుకోవడం కాకుండా, ఆ కథ మనం 'వాస్తవం', 'నేను', 'కాలం', 'సాహిత్యం' అనే పదాలకు ఇచ్చిన అర్థాలనే మార్చుకోవాల్సి వస్తుంది. ప్రపంచ సాహిత్యంలో బోర్హెస్ వేసిన అసలు ముద్ర ఇదే. ఆయన అనంతాన్ని కథగా రాయలేదు. కథ అనే చిన్న రూపంలో అనంతాన్ని ఆలోచించే అవకాశాన్ని మనకు అందించాడు.



ఆగస్టు 24న బోర్హెస్ జయంతి

ఈ వారం కవితలు

## మేం దిమాగి నక్సల్స్‌మే

దిమాక్ ఉన్నోడల్లా దిమాగి నక్సలైట్ అయితే
నేను దిమాగీ నక్సల్స్‌నే
అవునిప్పుడు అర్బన్ నక్సలైట్ అరిగిపోయిన పదమా
పాత ఉత్పత్తులను కొత్త కొత్త పేర్లతో
ప్రజల్లో ప్రాపగండా చేసి కార్పొరేట్లు
అమ్మినట్లు
ఇప్పుడు దిమాగీ నక్సల్స్ పదం తెచ్చావా
కాదు కాదని నా మనసు
హెచ్చరిస్తుంది
నక్సలైట్ పదం అర్థాన్ని
నాలుగు దిక్కుల గుంజి గుంజి పెంచేసి
ఆ చట్రంలో కావాలనుకున్నోన్ని
ఇరికించే
కుట్ర కనిపిస్తుంది
ఇప్పుడు నక్సలిజాన్ని
మావోయిజం నుండి విడగొట్టేసి
సాయుధ కమ్యూనిస్టులనే కాదు
ఆలోచించే వాన్నల్లా నక్సలైట్ అనాలి
సామెత పాతదే కావచ్చు
కుక్కను చంపాలంటే పిచ్చిదని ముద్ర వేయాలి
ఇప్పుడు దిమాగీ నక్సల్స్ పేరు అందుకే
పాలన లోపాలపై
ప్రశ్నించే వాన్ని ఉద్యమించే వాన్నే కాదు
ఆ దిశగా ఆలోచించే వాన్నల్లా
దిమాగీ నక్సల్స్ పేరెట్టి
వేరుపరచాలి ఏరివేయాలి
80 ఏళ్ల స్వాతంత్ర్యం సాక్షిగా
ఎంత మంచి మాట సెలవిచ్చారు
మహా ప్రభువులు
ప్రజలెప్పుడు డూడు బసవన్నల్లా
తల ఊపుతూనే ఉండాలి
కానీ సీను నీవనుకునట్లు లేదు
ఆ తలలో దిమాక్ ఉందని
తలకు రెండు కొమ్ములున్నాయని
బసవన్నలు తెలజప్పాయి
తల ఊపం తల దించమని
జంతర్ మంతర్ వద్ద రంకె వేసాయి
దేశమంతా జంతర్ మంతర్ అయ్యేట్లుంది
దిమాక్కు పని చెప్పే టోనల్లా
దిమాగీ నక్సల్స్ అందాం
వేరు చేద్దాం ఏరి వేద్దాం
ఎవ్వరేమి వాఖ్యానిస్తే ఏముంది
ఎర్రకోటపై నీవన్నదదే దేశం
విన్నదదే
కాని ప్రభు
ఇప్పుడు కాలం నీ వెంట కాదు
నీ కంటే వేగంగా పయనిస్తుంది
రంకెలు ఇప్పటికే దేశాన్ని చుట్టేసాయి
దేశమంతా
మేం 'దిమాగీ నక్సల్స్' మే
అని నినదిస్తుంది

– నిధి
(తెలంగాణ అరసం ఉపాధ్యక్షుడు)
9701000306

## ఎందుకీ దారుణం?



ఎంత ఘోరం
ఎంత ఘోరం.!
ఎందుకింత దారుణం?
పాఠాలు జెప్పే పంతులమ్మను
పగబట్టి సంపిరి
జల్సాలు, వ్యసనాలు
వొద్దని మందలిస్తే
కనికరం లేని పోరలు కక్షగట్టి ఉసురుదీసిరి

కలంబట్టే చేతులతో కత్తివట్టి
హతమార్చిరి
ఎందుకింత కక్షరా?
మరెదుంకింతా శిక్షరా?
వొద్దు వొద్దని మందలించినందుకా?
బుద్ధి జెప్పినందుకా?
మందలిస్తే.. కక్షగట్టి మట్టువెట్టింద్రు
మనకు సదువుజెప్పే తల్లినే హతమార్చింద్రు
గురువులను హత్య చేస్తూ..
హంతకులుగా మారుతుంద్రు
నర హంతకులుగా మారుతుంద్రు
ఎటు పోతుందీ యువతా!
ఏమైపోతుందీ మానవతా?


– గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

## చదవాల్సిన పుస్తకం

చరిత్ర కథగా.. పోరాటం సాహిత్యంగా

### వికసించిన 'మోదుగుపూలు'

దాశరథి రంగాచార్య రాసిన 'మోదుగుపూలు'ను తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన ఒక చారిత్రక నవలగా చాలా మంది పేర్కొంటాయి. అయితే, ఆ వ్యాఖ్య ముమ్మాటికీ దాని సాహిత్య పరిధిని కుదించడమే. ఎందుకంటే, ఈ నవల ఒక సామాజిక పరివర్తన పాఠ్యం,. ఒక నిర్దిష్ట చారిత్రక దశలో ప్రజల చైతన్యం ఎలా రూపుదిద్దుకుందో పరిశీలించే సామాజిక పత్రం. రచయిత అనుభవ ప్రపంచం సృజనాత్మకంగా ఆవిష్కృతమైన ఆత్మకథాత్మక నవల. 1940 దశకంలో, తెలంగాణలోని జాగీర్దారీ వ్యవస్థ, వెట్టిచాకిరీ, భూస్వామ్య ఆధిపత్యం, అధికార యంత్రాంగం, నిరక్షరాస్యత, సామాజిక వివక్ష, భయం వంటి అంశాలను రంగాచార్య ఒక గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని చిత్రించిన విధానం ఈ నవలకు ప్రత్యేకమైన చారిత్రక విలువను కల్పిస్తుంది. నవల కథా కాలం 1943 నుంచి 1948 వరకు విస్తరిస్తుంది. అంటే భారతదేశ స్వాతంత్ర్యోద్యమం చివరి దశ, హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా పెరుగుతున్న రాజకీయ చైతన్యం, తెలంగాణలో రైతాంగ పోరాటం ఉధృతమవుతున్న కాలం, చివరకు 1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడం వంటి కీలక పరిణామాలు దీని చారిత్రక నేపథ్యాన్ని నిర్మిస్తాయి. అయితే రంగాచార్య చరిత్రను కాలక్రమానుసారంగా నమోదు చేయలేదు. ఆయన చరిత్రను ఒక గ్రామం జీవితంలోకి తీసుకువచ్చాడు. అందువల్ల 'మోదుగుపూలు'లో పెద్ద రాజకీయ పరిణామాల కంటే, వాటి ప్రభా వం సామాన్యుల జీవితాలపై ఎలా పడిందన్నదే ప్రధాన ప్రశ్న బలంగా వినిపిస్తుంది.




ఆగస్టు 24 దాశరథి రంగాచార్య జయంతి

కోయగూడెం అదేది నవలలోని భౌగోళిక స్థలం. కానీ అది ఒక గ్రామానికి మాత్రమే పరిమితమైన ప్రతీక కాదు. కోయగూడెంలో కనిపించే అధికార నిర్మాణం, భూస్వామ్య సంబంధాలు, కుల వ్యవస్థ, ఆర్థిక దోపిడీ, ప్రజల భయం, ఆ భయాన్ని అధిగమిస్తూ పుట్టుకొచ్చే సంఘటిత చైతన్యం 1940 దశకంలో, తెలంగాణలోని అనేక గ్రామాల సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. ఈ కారణంగానే నవలలోని గ్రామం ఒక నిర్దిష్ట స్థలంగా ఉన్నప్పటికీ దాని సామాజిక అర్థం ప్రాంతీయంగా విస్తరిస్తుంది. 'మోదుగుపూలు'ను పరిశీలించేటప్పుడు దాని వ్యవస్థ దృష్టి. రఘు పాత్ర ద్వారా రచయిత వ్యక్తిగత ప్రతీకారాన్ని, వ్యక్తిగత ద్వేషాన్ని రాజకీయ పరిష్కారంగా అంగీకరించరు. వ్యక్తిని అని ఏమీ ప్రయోజనం లేదు. వ్యవస్థ అటువంటిది అనే రఘు వ్యాఖ్య ఈ నవల ఆలోచనా నిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి కీలకం. మరో సందర్భంలో వ్యక్తిపై ద్వేషం లేదని, వ్యవస్థే వ్యక్తిని దుష్టుడిగా తయారు చేస్తుందని అతడు చెప్పడం కూడా ఇదే దృక్పథాన్ని బలపరుస్తుంది. ఈ దృక్పథం నవలను సాధారణ దోపిడీదారుడు–బాధితుడు కథగా మారకుండా కాపాడుతుంది. అమీను ఒక వ్యక్తి. తాసిల్దారు ఒక వ్యక్తి. గిర్దావరు, షావుకారు వెంకయ్య వంటి వారు కూడా వ్యక్తులే. కానీ వారి ప్రవర్తన వెనుక ఉన్న అధికార సంబంధాలను రఘు గుర్తిస్తాడు. వ్యక్తిని శిక్షించడం కంటే వ్యక్తిని అటువంటి పాత్ర పోషించేలా చేస్తున్న సామాజిక వ్యవస్థను అర్థం చేసుకోవాలని అతని ఆలోచన సూచిస్తుంది. ఈ స్థాయిలో 'మోదుగుపూలు'లోని రాజకీయ చైతన్యం నైతిక కోపాన్ని దాటి సామాజిక విశ్లేషణకు చేరుతుంది. అయితే ఇక్కడే ఒక విమర్శనాత్మక ప్రశ్న కూడా ఎదురవుతుంది. రఘు పాత్రలో రచయిత స్వీయ అనుభవాలు, ఆలోచనలు ఎంతవరకు ప్రవేశించాయో పరిశీలించాలి. రఘు కేవలం నవలానాయకుడు కాదు... రచయిత తన చారిత్రక అనుభవాన్ని, సామాజిక అవగాహనను, రాజకీయ విశ్వాసాలను అతని ద్వారా వ్యక్తం చేసినట్లు కనిపిస్తుంది. అందువల్ల రఘును పూర్తిగా స్వతంత్ర కల్పిత పాత్రగా చూడటం కష్టం. ఈ అంశం 'మోదుగుపూలు'ను చారిత్రక ఆత్మకథాత్మక నవలగా చదవడానికి అవకాశం కల్పిస్తుంది. అయితే ఆత్మకథాత్మకతను ప్రత్యక్ష జీవితచరిత్రతో సమానం చేయడం సరికాదు. రచయిత అనుభవం నవలలోకి ప్రవేశించినప్పుడు అది కల్పన, ఎంపిక, నిర్మాణం, పాత్రీకరణ అనే ప్రక్రియల ద్వారా మారుతుంది. నవలలో ప్రజా చైతన్యం ఒక్కసారిగా సంభవించదు. చిన్న చిన్న సంఘటనల ద్వారా అది పెరుగుతుంది. ఈ నిర్మాణం 'మోదుగుపూలు'లోని అత్యంత ముఖ్యమైన సాహిత్య లక్షణాలలో ఒకటి. ఉదాహరణకు మంగలి వృత్తి చేసే రావడు, ఇతర శ్రమజీవులు అధికారుల సేవలను నిరాకరించే సంఘటనను పరిశీలిస్తే, అది ఒక చిన్న ఆర్థిక వివాదంలా కనిపిస్తుంది. కానీ దాని సామాజిక అర్థం మరింత విస్తృతమైనది. శ్రమజీవులు తమ శ్రమకు విలువ నిర్ణయించే హక్కును గుర్తించిన క్షణం అది. వారి సంఘటిత నిరాకరణకు అధికార వ్యవస్థ తలవంచి కూలీ చెల్లించాల్సి వస్తుంది. ఆ అనుభవం ఇతర వర్గాలకు కూడా వ్యాపించి వడ్డెర్లు, దళిత శ్రమజీవులు కూలీ రేట్ల కోసం సంఘటితం కావడం నవలలో చైతన్యం వ్యాప్తి చెందే విధానాన్ని చూపిస్తుంది. ఇక్కడ రంగాచార్య విప్లవాన్ని ఒక మహత్తర రాజకీయ సంఘటనగా మాత్రమే చూపించరు. రోజువారీ జీవితంలోని చిన్న నిరాకరణల సమాహారంగా దానిని నిర్మిస్తారు. అధికారి ముందు తలవంచకపోవడం, శ్రమకు తగిన పారితోషికం అడగడం, పత్రిక చదవడం, పెద్దలకు చదువు నేర్పడం, గ్రామ ప్రజలను సంఘటితం చేయడం వంటి చర్యలన్నీ చివరికి రాజకీయ చైతన్యానికి దారితీస్తాయి. ఈ నిర్మాణం మార్క్సిస్టు సామాజిక దృక్పథంతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉన్నప్పటికీ, నవల దానిని సిద్ధాంత గ్రంథంలా ప్రతిపాదించదు. జీవితంలోని సంబంధాల ద్వారానే చూపిస్తుంది. చదువు విషయంలో కూడా రచయిత దృష్టి గమనించదగినది. ఆ చదువంటే బెదురు నిజాం నవాబుకు అనే భావనలో విద్యను కేవలం వ్యక్తిగత అభివృద్ధి సాధనంగా కాకుండా అధికారాన్ని ప్రశ్నించే సాధనంగా చూస్తారు. హరిజనవాడలో వయోజన విద్యా కేంద్రం ఏర్పాటు చేయడం, గ్రామంలో పత్రికలు తెప్పించడం వంటి ప్రయత్నాలకు అందువల్ల రాజకీయ ప్రాధాన్యం లభిస్తుంది. చదవడాన్ని సమాచారాన్ని పొందడంతో సరిపుచ్చడం సికాదు. ఎందుకంటే, అది అధికారికంగా నియంత్రించిన జ్ఞాన వ్యవస్థను ఛేదించడానికి కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఇదే సందర్భంలో రఘు చెప్పే కుటుంబం నుంచి గ్రామానికి, గ్రామం నుంచి రాష్ట్రానికి, రాష్ట్రం నుంచి దేశానికి, చివరికి మానవతా శ్రేయస్సు వరకు విస్తరించే త్యాగ భావనను పరిశీలించాలి. ఈ మాటలు నవల రాసిన చారిత్రక కాలాన్ని దాటి నేటికీ చర్చకు వస్తాయి.

ప్రతులకు
నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

### ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం

# కళాకారులు తమ కళలకు, గళాలకు పనిచెప్పాలి

కళాకారులు శిక్షణ ద్వారా
కళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి
సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే
చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** సకల జనుల హితం కోసం, సామాజిక కోణంలో ప్రజలను చైతన్య వంతం చేయడం కోసం కళాకారులు తమ కళలకు, గళాలకు పనిచెప్పాలని, కళాకారులు శిక్షణ ద్వారా తమ నైపుణ్యం పెంపొందించుకోవాలని సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో రెండు రోజుల పాటు జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరానికి హాజరైన కళాకారులను ఉద్దేశించి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రచయితలు, కవులు, కళాకారులు కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై, వారి జీవనవిధానాలపై నిరంతరం అధ్యయనం చేస్తూ రచనలు, పాటలు, వీధి నాటకాలు వ్రాయాలని, కళాకారులు ఎంతో మంది ఉంటారు కానీ, ప్రజా కళాకారులు కొంత మంది మాత్రమే ఉంటారని, అలాంటి కళాకారులు నిత్యం ప్రజల బాధలను చూసి వాటిని ప్రపంచానికి తెలిజేసేందుకు పాటలు పాడాలని, కళ కాసుల కోసం కాదు, ప్రజల కోసమని పాడే కళాకారులే ప్రజానాట్య మండలి కళాకారులని, అలాంటి కళాకారులు నిత్య విద్యార్థులుగా ఎన్నో విషయాలు తెలుసుకొని,పాటలు నేర్చుకొని పాడాలని అందుకు ఇలాంటి శిక్షణా శిబిరాలు ఉపయోగపడతాయని వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజల కష్ట, సుఖాలను పాటల రూపంలో బయటకు తెచ్చి ఎంతో మందిని మెప్పించే అత్యంత బలమైన ఆయుధం పాట అని, ఏ పోరాటాలు, ఉద్యమాలు, బహిరంగ సభలు విజయవంతం కావాలన్నా కళాకారులు ఉండాల్సిందేనని, కరీంనగర్ లో సెప్టెంబర్ 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల విజయవంతం కోసం కళాకారులు తమ వంతుగా కళారూపాలు ప్రదర్శించాలని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈ శిక్షణా శిబిరం కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్,పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్ద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యుడు కవ్వంపల్లి స్వామి, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కటిక రెడ్డి బుచన్న యాదవ్, సమ్మయ్య,ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, సహాయ కార్యదర్శి రేగుంట చంద్ర శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేష్, వెంకటాచారి, రోంటాల శ్యామ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుడ్డేల సమ్మయ్య, వరకోలు సదానందం, ఎజ్జ రాజయ్య, లక్ష్మీరాజం, ఆసాల రమ, ఇందిరా, లక్ష్మణ్, ఎర్రోజు శ్రీనివాస్, మోహన్, డప్పురాజు తదితరులు పాల్గొన్నారు.

### సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను..

# మరింత తీవ్రం చేయాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
ఘనంగా హనుమకొండ అయిప్సో
జిల్లా మహాసభ




**ప్రజాపక్షం/హనుమకొండ :** సామ్రాజ్య వాద వ్యతిరేక పోరాటాలను మరింత తీవ్రం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో) జిల్లా మహాసభ నేదునూరి రాజమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సామ్రాజ్యవాద శక్తులు అనుసరిస్తున్న దోపిడీ విధానాల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అన్నారు.

ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న యుద్ధ వాతావరణాన్ని, దురాక్రమణలను ప్రతి ఒక్కరూ ఖండించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.నూతన తరానికి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట చరిత్రను తెలియజేస్తూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. 1951వ సంవత్సరంలో ప్రారంభించబడి సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామ్య, ప్రపంచ శాంతిని కాంక్షించే ఒక ప్రజానీక వేదిక శాంతి సంఘం అని అన్నారు.

అణ్వస్త్రాల తగ్గింపు, దేశాల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడం,ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు మద్దతుగా నిలవడమే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. భారతదేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, మానవ హక్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం ఇది నిరంతరం కృషి గత చేస్తుందన్నారు. మతతత్వ, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా లౌకిక శక్తులను ఏకం చేయడంలో అయిప్సో ముందుండి పోరాడాలని కోరారు.

ఈ మహాసభలో ప్రధానోపాధ్యాయులు నేదునూరి శ్రీహరి ప్రధాన వక్తగా ప్రసంగించగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, బీసీ సంఘం నాయకులు బొనగాని యాదగిరి గౌడ్, న్యాయవాది సాయిని నరేందర్, విద్యుత్ శాఖ అధికారి జానయ్య, నాయకులు రామబ్రహ్మం, రాజ్ మహమ్మద్, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, బత్తిని సదానందం, రామమూర్తి, మాదాసి బాబు, ఎన్.అశోక్ స్టాలిన్, వెంకటరమణ,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికులను

# ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

హక్కుల కోసం
ఐక్య పోరాటం అవసరం
క్రిస్టోఫర్ జౌసెకా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి ప్రభుత్వ పే స్కేల్ అమలు చేయాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ పంచాయతీ ఎంప్లాయీస్(ఎఐటియుసి) జాతీయ అధ్యక్షులు క్రిస్టోఫర్ జౌసెకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ పంచాయతీ ఎంప్లాయిస్(ఎఐటియుసి) జాతీయ కౌన్సిల్ సమావేశం ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రిస్టోఫర్ జౌసెకా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ప్రజా సేవలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, ఎన్నికల విధులు, ఓటర్ల జాబితా సవరణలో ఇఎల్‌ఓలుగా పనిచేయడం వంటి అనేక కీలక బాధ్యతలను పంచాయతీ కార్మికులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

పంచాయతీ కార్మికులకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని, వారిని ఇఎస్‌ఐ, పిఎఫ్ పరిధిలోకి తీసుకురావడంతో పాటు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు కార్మిక హక్కుల పరిరక్షణకు దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు.


**కనీస వేతనాల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం..**

కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల ప్రయోజనాల కంటే యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయని మండిపడ్డారు. కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగాలను ప్రోత్సహించడం ద్వారా శాశ్వత ఉద్యోగాలు, ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. కనీస వేతనాల అమలులోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కార్పొరేట్, వ్యాపార వర్గాల ప్రయోజనాల కంటే కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్‌ఐ, కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ తదితర డిమాండ్లపై దేశ వ్యాప్తంగా పోరాటాలను విస్తరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పంచాయతీ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎల్జిబెత్, ప్రధాన కార్యదర్శి నామ్‌దేవ్ చౌహాన్, కోశాధికారి రాహుల్ జాదవ్, తెలంగాణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, ఉప ప్రధాన కార్యదర్శి మల్లయ్య, కోశాధికారి రాంచంద్రయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు ఆంజనేయులు, ఎఐటియుసి నాయకురాలు హసీనాబేగంతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

# గందరగోళంలో విద్యావ్యవస్థ..

ప్రభుత్వం మేల్కోవాలి
పెండింగ్ ఫీజు బకాయిలు
విడుదల చేయాలి
'శక్తి' స్కీమ్, జీవో 97ను రద్దు చేయాలి
విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని
కేటాయించాలి
ఎఐఎస్ఎఫ్ నేత కసిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో విద్యావ్యవస్థ గందరగోళంగా మారిందని, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలకు సంబంధించిన 'శక్తి' స్కీమ్, జిఒ నంబర్ 97ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు పొందేందుకు కళాశాలల్లో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులు ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ఎఐఎస్ఎఫ్ నేతలు ప్రశ్నించారు. విద్యార్థుల చదువులకు నిధులు కేటాయించడంలో ఇబ్బందులు చెబుతున్న ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు నిధులు ఎలా కేటాయిస్తోందని నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు. 'శక్తి' స్కీమ్, జీవో నంబర్ 97ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల వద్ద విద్యార్థులు ప్రతిరోజూ నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధంగా 'శక్తి' స్కీమ్ ఉందని వారు ఆరోపించారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ విద్యను తీసుకెళ్లిన తర్వాత భవిష్యత్తులో ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించకపోతే విద్యార్థులపై ఫీజుల భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి మార్చడం వల్ల తమ మూడేళ్ల డిప్లొమా కోర్సు విలువ తగ్గుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని ఎఐఎస్ఎఫ్ నేతలు తెలిపారు. ముఖ్యంగా బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ వంటి ఉన్నత విద్యా అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తామని ప్రకటించిన 24 రకాల కిట్లు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందలేదని వారు ఆరోపించారు. దీంతో విద్యార్థులు పాత యూనిఫామ్‌లతోనే పంద్రాగస్టు వేడుకలకు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం వల్ల విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఏఐఎస్ఎఫ్ నేతలు అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే విద్యాశాఖ ఉండటంతో విద్యార్థులు, విద్యారంగ ప్రతినిధులు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖకు వెంటనే ప్రత్యేక మంత్రిని కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఇతర విద్యారంగ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'శక్తి' స్కీమ్, జీవో నంబర్ 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే విద్యారంగంపై సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు, బకాయిలను విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి


మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
ప్రారంభోత్సవంలో నటుడు
బాబుమోహన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాన్యులకు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్య సేవలు ఖరీదైనవిగా మారుతున్న నేపథ్యంలో తక్కువ ఖర్చుతో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని సినీ నటుడు, మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్ కోరారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన చిరంజీవి వెరికోస్ వాస్కులర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆదివారం కొండాపూర్‌లో ఐజి( ప్లానింగ్ అండ్ లాజిస్టిక్స్) డాక్టర్ గజరావు భూపాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్, కాళ్లలో రక్తనాళాల సమస్యలు, ఇతర వాస్కులర్ వ్యాధులకు ఆధునిక వైద్య విధానాలతో నాణ్యమైన చికిత్స అందించేందుకు ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ వెరికోస్ వెయిన్స్ నిపుణులు డాక్టర్ కె. సంజీవరావు, డాక్టర్ శిల్ప పొన్నాడ, ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కె. వంశీకృష్ణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. రోగులకు సులభంగా, సమర్థవంతంగా వైద్య సేవలు అందించేందుకు అధునాతన వైద్య సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, సమగ్ర చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ సభ్యులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రంగస్థల దర్శకులు ఇ.సముద్ర, వీరభద్ర చౌదరి, తెలంగాణ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు అన్నంగి రాజశేఖర్, నిర్మాత మిత్తాన ఈశ్వర్, హీరోయిన్ సైనిక తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుల సమస్యలు, ఒంటరితనం, మానవ సంబంధాల

## విలువను చాటిన 'పళ్ళ బురుసు' : నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వృద్ధాప్యం, ఒంటరితనం, మానవ సంబంధాల విలువను ఆలోచింపజేసే విధంగా 'పళ్ళ బురుసు' చిత్రాన్ని నిర్మించడం అభినందనీయమని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె. నారాయణ అన్నారు. సామాజిక స్పృహ కలిగించే ఇలాంటి ప్రయోజనాత్మక చిత్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఈ నెల 22న దర్శకుడు ఉదయ్ చౌహాన్, సహనిర్మాత అధిప్ అయ్యర్ తదితర అన్నపూర్ణ స్టూడియోస్ ప్రతినిధులు 'పళ్ళ బురుసు' చిత్రాన్ని ప్రదర్శించారు. వృద్ధాశ్రమంలోని సభ్యులు చిత్రాన్ని ఆసక్తిగా వీక్షించి, సినిమాలోని పాత్రలు, పరిస్థితులను తమ జీవితాలతో అన్వయించుకుని ఆనందించారని నారాయణ తెలిపారు.వృద్ధాప్యంలో ఎదురయ్యే ఒంటరితనం, సహజమైన కోర్కెలు, స్నేహితుల ఆత్మీయ కలయిక కలిగించే ఆనందాన్ని ఈ చిత్రం చక్కగా చూపించిందన్నారు. మానవ సంబంధాలపై కార్ల్ మార్క్స్ పేర్కొన్న భావనను కూడా చిత్రం ఒక కోణంలో ప్రతిబింబిస్తోందని తెలిపారు.ఇలాంటి చిత్రాలు కేవలం వినోదాన్ని అందించడమే కాకుండా వృద్ధుల సమస్యలు, ఒంటరితనం, మానవ సంబంధాల విలువపై సమాజంలో చర్చకు దారితీస్తాయని అన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విలాసవంతమైన సినిమాలు నిర్మించి, టికెట్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపే చిత్రాలకు ప్రభుత్వ సహాయం అందించడం సమంజసం కాదన్నారు. ప్రజలకు వినోదంతో పాటు ఆలోచన, ఆనందం, సామాజిక చైతన్యం కలిగించే చిత్రాలను ప్రోత్సహించడమే ప్రభుత్వ బాధ్యత అని నారాయణ పేర్కొన్నారు.

# పార్టీకి నష్టం కలిగించేలా ఎవరూ వ్యవహరించొద్దు

మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలే అందరికంటే ముందని, పార్టీకి నష్టం కలిగించేలా ఎవరూ వ్యవహరించవద్దని కాంగ్రెస్ నేత, మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారిపైనైనా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రి కొండా సురేఖ అక్క కూతురు చేసిన వ్యాఖ్యలతో పార్టీకి డ్యామేజ్ జరిగిందని, ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సురేఖ అక్క అయినా.. వాకిటి శ్రీహరి అయినా.. ఎవరైనా ముందు పార్టీ, ఆ తర్వాతే అందరూ. ముందుగా పార్టీని కాపాడుకోవాలి. దానికి అనుగుణంగానే ముందుకు వెళ్తాం అని శ్రీహరి పేర్కొన్నారు. పార్టీకి నష్టం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఎఐసిసి,టిపిసిసి క్రమశిక్షణ కమిటీలు నిర్ణయం తీసుకుంటాయని శ్రీహరి తెలిపారు. సురేఖకు మాత్రమే నోటీసులు ఇచ్చారనే ప్రచారం సరికాదని, ఎమ్మెల్సీ చిన్నారెడ్డికి కూడా నోటీసులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.తప్పు చేస్తే ఎవరిపైనైనా చర్యలు ఉంటాయి. పార్టీ లైన్‌ను ఎవరూ దాటొద్దు. పార్టీకి డ్యామేజ్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది అని స్పష్టం చేశారు. మంత్రి కొండా సురేఖపై ఎవరైనా కుట్ర చేస్తున్నారనే ప్రచారాన్ని శ్రీహరి ఖండించారు. సురేఖ అక్కపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని అన్నారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడటం వల్ల ప్రత్యర్థి పార్టీలకు అవకాశం కల్పించినట్టవుతుందని, అలాంటి పరిస్థితులు రాకుండా అందరూ సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో అనుభవం కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో రేవంత్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని శ్రీహరి అన్నారు. ఇలాంటి అంతర్గత వివాదాలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో పార్టీకి నష్టం కలిగించే పరిణామాలు జరగడం బాధాకరం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని శ్రీహరి స్పష్టం చేశారు. పార్టీలో బిసి, అగ్ర వర్ణం అనే తేడాలు లేవని, ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యం కల్పించడమే కాంగ్రెస్ విధానమని తెలిపారు.పార్టీని బలోపేతం చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, అంతర్గత విభేదాలకు తావులేకుండా సమన్వయంతో ముందుకు సాగడమే ప్రస్తుతం అందరి బాధ్యత అని శ్రీహరి పేర్కొన్నారు.


# విద్య, నైపుణ్యాల మధ్య అంతరాన్ని పూడ్చడమే సీఎం లక్ష్యం

అభివృద్ధిని అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్‌ల
ఉమ్మడి అజెండా: ఎంపి చామల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఇంజినీరింగ్ విద్య, నైపుణ్యాలు, ఉద్యోగాల మధ్య అంతరాన్ని పూడ్చడమే సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో హార్వర్డ్, ఎంఐటి, వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్లతో సిఎం విద్యా ప్రమాణాల పెంపుపై చర్చించారని తెలిపారు. విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకే సిఎం లండన్, అమెరికా పర్యటనలు చేపట్టారని పేర్కొన్నారు. సిఎం విదేశీ పర్యటనపై బిజెపి నేతలు వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేశారని, కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణకు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు రావడంలో తప్పేముందని చామల ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ట్రిపుల్ ఆర్, మూసీ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ, విదేశీ పెట్టుబడులతో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్‌ల ఉమ్మడి అజెండాగా మారిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై ప్రతికూల ప్రచారం చేయడం మానుకోవాలని చామల హితవు పలికారు.


# జనసేన వైపు.. కొండా సుస్మిత అడుగులు?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కొండా కుటుంబం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో.. ఆమె తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తికర చర్చ మొదలైంది. తాజాగా కొండా సుస్మిత జనసేన పార్టీలోకి వెళ్లే అవకాశాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. రేపు జనసేనకు చెందిన కీలక నేతలతో ఆమె భేటీ కానున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే సుస్మిత జనసేనలో చేరుతున్నట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. జూబ్లీహిల్స్‌లోని ఓ కీలక నేత నివాసంలో భేటీ జరిగే అవకాశం ఉందన్న సమాచారం మాత్రమే ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సమాచారాన్ని జనసేన లేదా సుస్మిత వర్గాలు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. కొండా సుస్మిత ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేయడంతో కాంగ్రెస్‌లో వివాదం మొదలైంది. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తానే పోటీ చేస్తానని ఆమె బహిరంగంగా ప్రకటించడం, తనకు టికెట్ ఎవరు ఇవ్వాలనే ప్రశ్నను లేవనెత్తడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామాల మధ్యే సుస్మిత జనసేన ముఖ్య నేతలను కలవనున్నారనే ప్రచారం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవేళ భేటీ జరిగితే అది కేవలం మర్యాదపూర్వక సమావేశమా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై చర్చా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రత్యేకంగా పరకాల అసెంబ్లీ నియోజకవర్గం విషయంలో సుస్మిత ఇప్పటికే తన రాజకీయ ఆసక్తిని బహిరంగంగా ప్రకటించారు. పరకాల టికెట్ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అనుకూల సంకేతాలు రాకపోతే ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఎంచుకునే అవకాశం ఉందన్న చర్చకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. పరకాలపై సుస్మిత బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి.

# త్వరలో కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ కేంద్రం

- ప్రజలకు తీరనున్న పాస్‌పోర్ట్ కష్టాలు
- కొత్తగూడెం హెచ్ పోస్టాఫీసులో ఏర్పాటుకు చర్యలు
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని హెచ్ పోస్టాఫీసులో త్వరలోనే పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పిఓపిఎస్కే) ఏర్పాటు కానుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి సమర్పించిన లేఖలు, సంప్రదింపులపై అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి అనుమతితో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పీఎస్పీ డివిజన్ అండర్ సెక్రటరీకి పరిశీలన నిమిత్తం ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. కొత్తగూడెం ప్రధాన పారిశ్రామిక, గనుల, వాణిజ్య కేంద్రంగా విస్తరించి ఉందని, ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవల కోసం 75 కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం, మహబూబాబాద్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని గుర్తు చేశారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు సమయం, డబ్బు వృధా చేసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం కొత్తగూడెం ప్రత్యేక జిల్లా కేంద్రంగా మారినందున ఇక్కడే పూర్తిస్థాయి కేంద్రం అవసరమని స్పష్టం చేశారు. ఈ సమస్యను కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు సాధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు.

**బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక**

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. లక్ష్మీ దేవిపల్లి పరిధిలోని సింగరేణి బంగ్లోస్ గేటు సమీపంలో వెలసిన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం శ్రావణమాస బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు శ్రావణ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడే గొప్ప సంప్రదాయం మన పండుగల్లో దాగి ఉందని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో ప్రజలు అమ్మవార్లను కొలవడం మన ఆచారమన్నారు. ఇలాంటి ఉత్సవాలు సమాజంలో సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన వివరించారు. పోచమ్మ తల్లి చల్లని దీవెనలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, ఆలయ ధర్మకర్త రాజ్య తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రినగర్‌లో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీ 32వ వార్డుల పరిధిలోని సింహాద్రినగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులకు 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం శీకారం చుట్టారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ...వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఏర్పాటు చేస్తున్న సిసిరోడ్డుతో కాలనీ ప్రజలకు రాకపోకల్లో మరింత సౌకర్య కలుగుతుందన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు, భారత కమ్యూనిస్టు పార్టీ 32వ వార్డు కార్యదర్శి మామిడి సుదర్శన్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గణపారపు ఉపేందర్, ఉపాధ్యక్షుడు మామిడాల కిరణ్, యువజన సంఘం నాయకులు పొన్నం ఉమేష్, కాలనీవాసులు నిమ్మకంటి యుగంధర్, వల్లోజి సత్యనారాయణ, తదితరలు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు



**ప్రజాపక్షం/బోనకల్:** చిన్ననాటి స్నేహానికి ప్రతీకగా 1992, 93 ఎస్ఎస్‌సి బ్యాచ్ స్నేహితులు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కొట్టెదాసు వారం రోజుల క్రితం మృతి చెందగా, అతని స్నేహితులు కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు కలిసి రూ.18,300 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్ననాటి నుంచి కొనసాగుతున్న స్నేహబంధాన్ని మరణానంతరం కూడా కొనసాగిస్తూ, ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం పట్ల పులువురు అభినందిస్తున్నారు. స్నేహితులు చేపట్టిన ఈ మానవతా కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. కష్టసమయంలో తోటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చిన్ననాటి స్నేహితులు తమ మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 1992, 93 ఎస్ఎస్‌సి బ్యాచఃవకు చెందిన పలువురు స్నేహితులు పాల్గొన్నారు.

## మోతారపు లచ్చమ్మకు సిపిఐ నాయకుల నివాళి



**ప్రజాపక్షం/చింతకాని:** ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన మోతారపు లచ్చమ్మ దశదిన కర్మ ఆదివారం ప్రొద్దుటూరు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శిదండి సురేష్ హాజరై లచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున రావు, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు నాయకులు తాళ్లూరి యాదగిరి, తుపాకుల సైదులు, కొత్తపల్లి రమేష్, నంబూరి శంకరరావు కాంగ్రెస్ నాయకులు కూరపాటి కిషోర్ , మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య , టీడీపీ నాయకులు పెంట్యాల రామారావు, బారాస నాయకులు పాపినేని రంగారావు, గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటిలో గృహ ప్రవేశం.. ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ప్రజాపక్షం/ఇల్లందు:** ముత్యాలంపాడు ఎక్స్‌రోడ్డు గ్రామ పంచాయితీ పరిధిలోని గొర్యాతండాలో లబ్దిదారు అశోక్ నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బానోత్ పూలబంతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.


## 25న సర్పంచుల చైతన్య సదస్సు




**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఈనెల 25న ఖమ్మంలో జరిగే తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే తొలుత గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. గ్రామాలు శక్తివంతంగా, స్వచ్ఛంగా, పచ్చదనంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల గ్రామ పాలన రోజు రోజుకు దిగజారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.చెక్‌పవర్ గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఉండాలని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 243జి ఆర్టికల్‌లోని 11వ షెడ్యూల్‌లో పొందుపర్చిన 29 అంశాలను పంచాయతీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో 50 శాతం నిధులను గ్రామ పంచాయతీలకు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పిటిసిల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, ఎంపిపిల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడిగ వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

## ‘నేడే’ వీసంశెట్టి 50వ, వర్ధంతి

**హాజరు కానున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



**ప్రజాపక్షం/పాల్వంచ:** పాల్వంచ మండల వ్యాప్తంగా సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేసిన అమరజీవి వీసంశెట్టి వెంకటేశ్వర్లు 50వ, వర్ధంతి వేడుకలను నాగారంలోని ఆయన స్మారక స్థూపం వద్ద సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్నారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రజా నాయకుడు వీసంశెట్టి వెంకటేశ్వర్లు. ఆయన జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేశారు. సిపిఐ ఖమ్మం జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యులుగా పార్టీ విస్తరణ కోసం పాటుపడ్డారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం, పేద ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరనీయం. ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించిపేదలు, కార్మికులు, కర్షకులు, దళితులు, గిరిజనులు వారి హక్కులను సాధించటానికి ఆయన చేసిన ఉద్యమాలను ఇప్పటికీ పాల్వంచ మండల ప్రజలు గుర్తుకు చేసుకొంటారు.పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి మండలాల్లో భూమి కోసం, భుక్తి కోసం వ్యావసాయ కూలీలు, పొర్లేర్ల సమస్యలపై పోరాటాలు నిర్వహించి, భూస్వాములు, జాగిరిదారులకు, దొరల పాలనకు వ్యతిరేకంగా సమానత్వం కోసం కుల వివక్షతకు, రెండు గ్లాసుల విధానాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలను సాగించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆనాటి అజ్ఞాత దళ నాయకులు నల్లమల్ల గిరిప్రసాద్ నాయకత్వంలో సిపిపై నాయకుడిగా పని చేశారు. పువ్వాడ నాగేశ్వరరావు, మనుబోతుల కొమురయ్య, ఆళ్ళ గురుప్రసాద్‌ల నాయకత్వంలో నూతి వెంకటరావు, యాదాల కాసీం, నకిరెకంటి రాములు, చారుగొండ్ల వెంకటనారాయణ, దేవరపల్లి ముత్తయ్య తదితరులతో కలిసి తన జీవితాన్ని పార్టీకి అంకితం చేశారు. తదనంతరం ఆయన కుమారుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వీసంశెట్టి విశ్వేశ్వరరావులు పార్టీలో ఆదర్శవంతంగా నిజాయితీ, నిభద్దతతో పార్టీలో నేటికీ కొనసాగుతున్నారు. పెద్ద కుమారుడు పూర్ణచందర్‌రావు పాల్వంచ మండల కార్యదర్శిగా పార్టీకి తన సేవలను అందిస్తున్నారు. చిన్న కుమారుడు ప్రజా సంఘాలలో బాధ్యులుగా, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పాల్వంచ 44వ, డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. పార్టీకి జీవితాన్ని అంకితం చేసిన ఆమహానీయుడు వీసంశెట్టి వెంకటేశ్వర్లు సేవలను స్మరించుకొంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పిద్దాం. ఆయన ఆశయాల సాధన కోసం పునరంకితం కావాలని, నేడు నాగారం గ్రామంలో జరిగే ఆయన 50వ, వర్ధంతి వేడుకలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, ఉప్పుశెట్టి రాహుల్ తదితర నాయకులు హాజరువుతున్నారు. పార్టీలకు అతీతంగా, సబ్బండ వర్గాల ప్రజలు హాజరై వెంకటేశ్వర్లు వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ మండల నాయకత్వం కోరుచున్నది.

## 1700 టన్నుల బియ్యం నిల్వలు గల్లంతు...

## రూ.4కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం?

- మిల్లర్‌పై కేసు నమోదు
- జిల్లాలో 12 మిల్లులో తనిఖీలు



**ప్రజాపక్షం/వైరా/కొణిజర్ల:** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో సిఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వరంగల్ విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1700 టన్నుల బియ్యం నిల్వల్లో తేడా గుర్తించినట్లు తెలుస్తుంది. దీని విలువ సుమారు రూ.4కోట్ల మేర ఉంటుందని అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం సిఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లులపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు ముమ్మరం చేసిది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో ప్రత్యేక విజిలెన్స్ బృందాలు వరుసగా మిల్లులను తనిఖీ చేస్తున్నాయి. కొణిజర్ల పట్టణంలోని రైస్ మిల్లులో ప్రభుత్వం కేటాయించిన ధాన్యం దానికి అనుగుణంగా ప్రభుత్వానికి తిరిగి అందించాల్సిన బియ్యం పరిణామాల మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. సుమారు 1700 టన్నుల బియ్యం లెక్కలు తేలక పోవడంతో ప్రభుత్వానికి సుమారు రూ.4కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాధమికంగా నిర్ధారించినట్లు తెలుస్తుంది. తనిఖీల అనంతరం మిల్లు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. సిఎంఆర్ ధాన్యం నిల్వలు, బియ్యం ఉత్పత్తి, ప్రభుత్వానికి తిరిగి అందించిన పరిణామాలపై అధికారులు పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది.

**ఖమ్మం జిల్లాలో తనిఖీలు ముమ్మరం**

ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో సుమారు 12 రైస్ మిల్లులపై విజిలెన్స్, సివిల్‌సపై అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. సిఎంఆర్ ధాన్యం విషయంలో ఎక్కడైనా అక్రమాలు, నిల్వల్లో తేడాలు ఉన్నాయా అనే అంశంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. కొణిజర్లతో పాటు ఇటీవలే తల్లాడలో వెలుగుచూసిన ఈ వ్యవహారం జిల్లాలోని ఇతర మిల్లర్లలోను చర్చనీయాంశంగా మారింది. రానున్న రోఉల్లో మరిన్ని మిల్లులపై తనిఖీలు జరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతుంది.

## ముస్లింల అభివృద్ధికి మంత్రి తుమ్మల చొరవ



**ఖబరస్తాన్‌లకు నిధుల కేటాయింపుపై హర్షం**

**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం చొరవ చూపడంతో పాటు ఖబరస్తాన్‌లకు నిధుల కేటాయింపు పట్ల ముస్లిం నాయకులు, మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ రషీద్ తో పాటు జామియత్ ఉలామా ఖమ్మం జిల్లా అధ్యక్షులు మౌలానా మహ్మద్, సయ్యద్ అహ్మద్ ఖాస్మీ తదితర మత గురువులు పరిశీలించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ ఖబరస్తాన్‌ల స్థలాలు , ప్రహారీ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. తాత్కాలిక ప్రయోజనాలే కాకుండా భవిష్యత్తు తరాల కోసం శాశ్వత వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు షానవాజ్, అబ్దుల్ మజీద్, అబ్దుల్ రెహ్మాన్, మౌలానా, గనీ, ముఫ్తీ ఇమ్రాన్‌ఖాన్, ముఫ్తీ షుజావుద్దీన్, ముఫ్తీ అల్లావుద్దీన్, మౌలానా సయ్యద్ షాబీర్, హాఫీజ్, ఉస్మాన్ ఖాసీం, గౌస్, సాజీద్, రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా ఆటో డ్రైవర్ల జీవితాలు

## ఆర్థిక ఇబ్బందుల్లో ఆటో డ్రైవర్లు

**ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటియుసి డిమాండ్**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ల జీవితాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు 500 నుండి 600 రూపాయల వరకు సంపాదించడం కష్టంగా మారిందిజ ఎంతోమంది యువకులు డిగ్రీలు చదివి ఏ ఉద్యోగం దొరక్క ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేల సంఖ్యలో ప్రతిరోజు ఆటోలు నడుస్తున్నాయి. పిల్లల చదువులు, ఆసుపత్రి ఖర్చులు, పెరిగిన నిత్యవసర సరుకులు ధరలు, ఇంటి అద్దె భరిస్తూ వచ్చిన ఆదాయం సరిపోక అప్పుల్లో ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు, ఆటో విడిభాగాల రేట్లు, ఇన్సూరెన్స్ ధరలు, కొత్త ఆటోలపై పెంచిన ధరలతో ఆటో డ్రైవర్ చితికి పోతున్నాడు. గత పది సంవత్సరాల కాలంలో చూసుకుంటే ఆదాయ మాత్రం అంతే ఉంది ఖర్చు మాత్రం పదిరెట్లు పెరిగింది. చాలామంది ఆటో అద్దెకు తీసుకువచ్చి వచ్చిన 500 రూపాయలు 250 రూపాయలు ఓనర్ కి ఇచ్చి మిగిలిన 250 తో ఆటో డ్రైవర్ జీవనం సాగిస్తున్నారు. ఈ రోజుల్లో రోజంతా కష్టపడితే వచ్చే 250 కుటుంబం గడపడం చాలా కష్టంగా మారుతుంది. ఇంధనం ఇన్సూరెన్స్ ధరలు తగ్గించాలని కోరుతున్నారు, ఓలా ఉబర్ రాపిడో వంటి వాటిని రద్దు చేయాలని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయమైన సమస్యలను వెం టనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆటో డ్రైవర్లు జెఎసి ఆధ్వర్యంలో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన దృతం చేస్తామని ఏఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**నేడు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆటో బంద్‌ను జయప్రదం చేయండి: వీర్ల మల్లేష్** ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని సుజాతనగర్ ఆదివారం సుజాతనగర్ మం డల కేంద్రంలో ఆటో డ్రైవర్లుతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్ల అంతా ఐక్యంగా ఉండి బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ అన్నారు. ఆదివారం చంద్రుగొండ మండలం గుర్వాయిగూడెం, రావికంపాడు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గుర్వాయిగూడెంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రావికంపాడులో బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయం మాధవి నూతన గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న రామిశెట్టి నరసింహస్వామి, షేక్ అమీర్‌లను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాంగ్రెస్ గ్రామ సేవాదళ్ అధ్యక్షుడు రేఖం నరేష్ మాతృమూర్తి దివంగత రేఖం కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎంఎల్‌ఏ భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీ

## 7 వేలకే నోటిఫికేషనా?

**ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి : ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రాష్ట్రంలో సుమారు 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ అన్నారు. ఖాళీగా ఉన్న అన్ని కానిస్టేబుల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రము లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. వేలాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండా పరిమిత సంఖ్యలో పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్లు ఇవ్వడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 9 వేల మంది ఉద్యోగ విరమణ పొందుతున్నప్పటికీ, ఆ స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టడం లేదని విమర్శించారు. ఖాళీ పోస్టులన్నింటినీ గుర్తించి, ఒకేసారి నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం యువత లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన విమర్శించారు. కేంద్రంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. యువత, నిరుద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీనివాస్, నవీన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయికి చెక్... ముగ్గురికి పునరావాసం

**గంజాయి సేవిస్తున్న ముగ్గురు అరెస్ట్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గంజాయి సేవనం, విక్రయాలపై బూర్గంపాడు ఎ స్‌ఐ మేడ ప్రసాద్ ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో పోలీసులు తాళ్లగొమ్మూరు సమీపంలోని ఐటీసీ జామాయిల్ ప్లాంటేషన్‌లో గం జాయి సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో గం జాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని భద్రాచలం పునరావాస కేం ద్రానికి తరలించారు. ఈవిషయంపై ఎస్‌ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాల ప్ర కారం గడికొప్పుల శశికుమార్, సోము సీతారామిరెడ్డి, మహమ్మద్ అఫ్రోజ్ గం జాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకున్న అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయిందన్నారు.

**సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచుతాం....**

మండల పరిధిలో గంజాయి సేవనం, విక్రయాలు, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌ఐ మేడ ప్రసాద్ కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన లక్ష్యం



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** ఆయిల్ పామ్ రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిశ్కరించడమే ఆయిల్ పామ్ రైతు సంఘం ప్రధాన లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు పొల్నేని రాజేశ్వర్ రావు అన్నారు.ఆదివారం మండలంలోని అంబట్ పల్లి గ్రామ పరిధిలో రైతు లింగంపెల్లి శ్రీనివాస రావు ఆయిల్పామ్ తోటలో జిల్లా స్థాయి ఆయిల్ పామ్ రైతు సంఘం ఆధ్వర్యంలో 200 మంది రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పొల్నేని రాజేశ్వర్ రావు రైతులకు అవగాహన కల్పిస్తూ ఆయిల్ పామ్ రైతులు దుర్కొంటున్న సమస్యలు, ఆధునిక సాగు పద్దతులు ,నీటి నిర్వహణ, ఎరువులు, పంట సంరక్షణ, గెలల కోత రవాణా,వ్యవసాయ యంత్ర పరికరాల అవసరం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞనం,ప్రభుత్వ పథకాలు, రైతులకు ఉపయోగపడే అంశాలను వివరించారు.అనంతర ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం జిల్లాలోని ఆయిల్పామ్ రైతులందరిని ఒకే వేదికపై చేర్చి సమిష్టిగా చర్చించి సమస్యలను సరిశ్కరించడమే సంఘం ప్రధానలక్ష్యమని అన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలోని ఆయిల్పామ్ రైతులు సంఘంతో అనుసంధానం కావాలని సూచించారు.ఆయిల్ పామ్ రైతులను మండలస్థాయి కమిటీల ఏర్పాటుతో రైతులకు సమాఆరం చేరేలా సమన్వయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు నల్ల సుదర్శన్రెడ్డి,పినపాక రాజిరెడ్డి,పాల్వంచ రవిందర్, ఎర్రబెల్లి రవిందర్ రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంబాడి అనీల్ కుమార్, కార్యదర్శులు చిలకాని గోవర్ధన్, ఒడ్డాల తిరుపతి,నిందికొండ పాపిరెడ్డి, బూనా మురళి,కంకనాల జనార్ధన్, కోశాధికారి గోలి కృష్ణా రెడ్డి,మహిళా కార్యదర్శి బీరవోలు నిర్మలా దేవి, మీడియా, ప్రజాబందాల ప్రతినిధి పొల్నేని వినయ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ల వ్యవహార శైలిపై నిరంతరం నిఘా పెట్టాలి: సిపి శ్వేత



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల వ్యవహార శైలి పట్ల అధికారులు నిఘా పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత,ఐపిఎస్ అధికారులను అదేశించారు. నెల వారి నేర సమీక్షా సమావేశంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపిలు, ఏసిపిలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి పోలీస్ అధికారి నిరంతరం శ్రమించాల్సి వుంటుందని, ప్రతి పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని ప్రజలతో సత్ససంబంధాలను కోనసాగించడంతో పాటు, వారి సమస్యలపై తక్షణమే స్పందించడం ద్వారా ప్రజలు పోలీసుల పట్ల స్నేహపూర్వకమైన వాతవరణం నెలకోల్పడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి శాంతి భద్రతల సంబంధించి ఎలాంటి సమస్యలు వచ్చిన వాటిని సులభంగా పరిష్కరించగలమని అన్నారు. ప్రధానంగా నేరం జరిగిన తరువాత చేసే దర్యాప్తు కన్నా నేరం జరగకుండా తీసుకునే ముందస్తూ చర్యలే కీలకమని. ప్రస్తుతం మత్తు పదార్థాల కారణంగా ఎంతో మంది యువత వారి భవిష్యత్తు అంధకారంగా మారుతోందని, ఈ సమస్యన నివారణకు పోలీస్ అధికారులు మత్తు పదార్థాల వినియోగదారుల గుర్తించడం ద్వారా వారితో విక్రయదారులకు కట్టడి చేయడంతో యువతను డ్రగ్స్ నుండి కాపాడుకోగలమని. అనంతరం పెండింగ్లోని కేసులకు సంబంధించి నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు, ప్రస్తుతం కోర్టులో పెండింగ్లో వున్న కేసుల స్థితిగతులు, స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరుపై పోలీస్ కమిషనర్ సంబందిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషన్ సింగ్, అదనపు డిసిపిలు సురేష్కుమార్, బాలస్వామితో పాటు ఏసిపిలు ఇతర పోలీస్ అధికారులు పాల్గోన్నారు.

## విద్యా వ్యవస్థను సర్కార్ నిర్లక్ష్యం : దామెర ఉపేందర్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ధర్మ టీచర్స్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నేల 26న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర విద్యా సదస్సు కరపత్రాన్ని ఆదివారం హనుమకొండ నయీమ్ నగర్ లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ధర్మ టీచర్ యూనిట్ రాష్ట్ర కో కన్వీనర్ దామెర ఉపేందర్ మాట్లాడుతూ ఈ విద్యా సదస్సు ద్వారా దేశం, తెలంగాణ రాష్ట్రంలో సమస్త విద్యారంగం ఎదుర్కోబోతున్న సవాళ్లేమిటి, విద్యా వ్యవస్థను ప్రభుత్వాలు ఏ స్థాయిలో నిర్లక్ష్యం చేస్తున్నది, తద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎంత నష్టం కలుగుతుంది, సమాజంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై ఎంత ప్రభావం చూపబోతుంది మొదలైన అంశాలపై చర్చ ద్వారా మొత్తం సమాజానికి తెలియజేయడం జరుగుతుంది. అభివృద్ధి చెందిన దేశాలు విద్యారంగానికి తమ బడ్జెట్లో అధిక స్థాయిలో కేటాయింపులు జరుపుతుంటే, మన ప్రభుత్వాలు విద్యారంగానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల సమాజం అభివృద్ధి చెందాల్సిన అంత స్థాయిలో అభివృద్ధి జరగటం లేదు. బడ్జెట్లో చాలా తక్కువ స్థాయిలో బడ్జెట్ కేటాయింపుతో విద్యారంగాన్నే నిర్లక్ష్యం చేస్తున్నాయి, కావున ఇలాంటి విషయాలు ఈ విద్యా సదస్సులో చర్చకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కావున ఈ సదస్సులో బీసీ, ఎస్సీ,ఎస్టీ వర్గాల మేధావులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విద్యా సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

## విద్యార్థులు వ్యవసాయ క్షేత్రాల సందర్శన



**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థులచే వ్యవసాయ క్షేత్రాల సందర్శన ఆదివారం నిర్వహించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు తమ విషయోపాధ్యాయులు వరి పండించే విధానం సవివరంగా వివరించారు. తరగతి గదిలో బోధనే కాకుండా, బయటి వాతావరణం, ప్రకృతి, సమాజం ద్వారా నేర్చుకునే విధానం విద్యార్థులలో సృజనాత్మకతను అనుభవ పూర్వక అభ్యాసాన్ని,ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపకరిస్తుందన్నారు. వ్యవసాయ ప్రాముఖ్యత దానివల్ల రైతుల కష్టనష్టాలు వారి కష్టం యొక్క విలువ, ప్రజల కోసం ఆహారాన్ని అందించడానికి వారు పడే తపన, కష్టనష్టాలకు ఓర్చి తమ పిల్లలకు భావి జీవితాన్ని అందించాలనే పట్టుదల రైతులతో పాటు తమ తల్లిదండ్రుల్లో కనబడుతుందని వారు తెలిపారు. రైతే దేశానికి వెన్నెముక అనే నానుడి నిజమని ఆహారం యొక్క ప్రాధాన్యత తెలియజేయడం కొరకు అవగాహన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రవీందర్, సుకన్య, హారిక, మానస, రమేష్, ప్రశాంత్లు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం

### సేకరిస్తున్న భూముల్లో పెగ్ మార్కింగ్ చేయాలి
### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** గౌరవెల్లి కాలువ ప్రాజెక్ట్ లో భాగంగా భూసేకరణ ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గౌరవెల్లి ప్రాజెక్ట్, పరకాల నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేస్, దేవాదుల ప్రాజెక్ట్ భూసేకరణ ప్రక్రియ పురోగతి, అవార్డు చెల్లింపులపై రెవెన్యూ, సాగునీటిపారుదల, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గౌరవెల్లి కాలువ కోసం వేలేరు, భీమదేవరపల్లి, ధర్మసాగర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇప్పటి వరకు చేపట్టిన భూసేకరణ, అవార్డు చెల్లింపులు, పెగ్ మార్కింగ్, పరకాల నియోజకవర్గం పరిధిలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే కోసం చేపట్టిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ భూసేకరణలో భాగంగా సేకరించిన భూముల్లో పెగ్ మార్కింగ్ వెంటనే చేయాలన్నారు.భూముల సర్వేలో లైసెన్స్ సర్వేయర్లతో పెగ్ మార్కింగ్ ను త్వరగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణ ప్రక్రియలో సంబంధిత రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూసేకరణ ప్రక్రియను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఆర్వోబీలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.పోర్టల్ లో నమోదై ఉన్న భూభారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అన్నారు. భూభారతి దరఖాస్తులు పెండింగ్ లో ఉండకుండా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని, కొనసాగుతున్న రీసర్వేను సంబంధిత మండలాల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, టెక్నికల్ మేనేజర్ లింగన్న, జనగామ సర్కిల్ సాగునీటిపారుదల (దేవాదుల) ఎస్ఈ సీతారామ్, గౌరవెల్లి ప్రాజెక్ట్ డీఈఈలు చైతన్య, నంద,భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## 'అమ్మ నాన్న' చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ: ఎమ్మెల్యే నాయిని

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్ మాల గుట్ట పరిసర ప్రాంత పేద కుటుంబాలకు అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్థానికంగా పర్యటించి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను నిశితంగా పరిశీలించారు. సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పంపించాలని సూచించారు.పేద ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు గంజి శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు అభినందించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అమ్మ ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాలు, మతోన్మాదంపై యువత ఉద్యమించాలి: ఎఐవైఎఫ్




**ప్రజాపక్షం/కురవి:** మాదకద్రవ్యాలు, మతోన్మాదానికి వ్యతిరేంగా యువత సమరశీల ఉద్యమాలు చేయాలని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య మండల 9వ మహాసభల సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జలగం ప్రవీణ్ పతాకావిష్కరణ చేయగా, బొడ్డు ఉదయ్ అధ్యక్షతన జరిగిన సభలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకవర్గాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఆయన విమర్శించారు. యువతలో ప్రశ్నించే తత్వాన్ని చంపడం కోసం కుల మత వర్గ వైశ్యామ్యాలను రెచ్చగొడుతూ, బోగస్దేశభక్తి ముసుగులో, భక్తి, మూఢనమ్మకాలు, మాదకద్రవ్యాల వైపు యువతను నెట్టే విధంగా గత 12 ఏళ్లుగా బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, ఈ నేపథ్యంలో యువత ఉపాధి అవకాశాల కోసం, నిజమైన దేశభక్తిని ప్రకటిస్తూనే, ప్రగతిశీల భావాల వైపు సమీకరించే విధంగా ఏఐవైఎఫ్ పనిచేయాలని కోరారు. నూతన మండల కమిటీ అధ్యక్షుడుగా సంగెం జెన్ని, సాయి, ఆఫీస్ బేరర్స్ గా బొడ్డు ఉదయ్, కావటి గణేష్, బుర్ర ఉదయ్, బొల్లం అనిల్, దండ్రు వేణు, రేపాకుల ప్రశాంత్, దైద బాలు లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు తురక రమేష్, కామెళ్ళ చరణ్, జక్కుల గణేష్,రాజేష్, అరుణ్ కుమార్, సంజయ్ సుమంత్, నందు, జెస్సు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బోనస్ కోసం రైతులు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** వానాకాలం 2026వ సంవత్సరానికి సంబందించి సన్న రకం వరి సాగు చేస్తున్న రైతులు బోనస్ పొందడానికి ఆన్లైన్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అదికారి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.ఏడు రకాల సన్న వరి సాగు చేసిన రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసినడీలర్ను సంప్రదించి పట్టాపాస్ పుస్తకం,మోబైల్ నంబర్ వివరాలు అందిచి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు.సెప్టెంబర్ 1 వ తేదీలోపు రైతులు ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్



**ప్రజాపక్షం/ములుగు:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలని ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి, ములుగు జిల్లా ఇన్చార్జి నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. కార్మికులు అనేక సంవత్సరాల పాటు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జంపాల రవీందర్ అధ్యక్షతన జరిగిన ఏఐటియూసి ములుగు జిల్లా మూడవ మహాసభలో ముందుగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరాటి ప్రసాద్ మాట్లాడారు. అనేక సంవత్సరాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా కుదించిందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధానాలను కేంద్రం అవలంభిస్తుందని ఆరోపించారు. లేబర్ కోడ్ల అమలుతో కార్మికులకు కేనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర హక్కుల దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం ప్రశ్నించినప్పుడు కులం, మతం, దేవుళ్ల పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు, కర్షకులు, స్కీం వర్కర్లు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**నూతన కమిటీ ఎన్నిక...**

మహాసభలో ఏఐటియూసి ములుగు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముత్యాల రాజు, ప్రధాన కార్యదర్శిగా బండి నర్సయ్య ఎన్నికయ్యారు. మొత్తం 15 మందితో జిల్లా కౌన్సిల్ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలం కొండయ్య, పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, కుడుముల సమ్మక్క, గున్నాల రాజకుమారి, బండారి రమ, గుంజె శ్రీనివాస్, కొక్కుల రాజేందర్, యాటల పైడి, సామల దేవేందర్, నర్ర సతీష్, చాంద్ పాషా, పొన్నాల లలిత, సలువాల స్వరూప, శ్రీధర్, రాజేందర్, లావణ్య, వడి సారయ్య, వినోద్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## మహాధర్నా నోటీస్ అందచేసిన ఎంప్లాయీస్ జెఎసి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఐఏఎస్ కు తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 27 వ తేదీన కలెక్టరేట్ ముందు చేయబోయే మహాధర్నా నోటీస్ అందచేయడం జరిగింది.ఈ సందర్భంగా జాక్ నేతలు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్నాయని ముఖ్యంగా పిఆర్సి, పాత పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్లో ఉన్న ఆరు డీఎలు, పూర్తి స్థాయిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, పెండింగ్ బిల్లుల సమస్యలు ప్రభుత్వం వెంటనే తీర్చాలని అందుకొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావడం కొరకుదశల వారీగా కార్యాచరణ తీసుకోవడం జరుగుతుందని అందులో భాగంగానే రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు 27 ఆగస్టు నాడు కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో ధర్నా చేయబోతున్నామని పేర్కొన్నారు.ఈ ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొనాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్ మోహన్ రావు, జేఏసీ కార్యదర్శి, టిజి ఓస్ అధ్యక్షులు ఆకవరపు శ్రీనివాస్ కుమార్, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాస్య నాయక్, పిఆర్ టియూ అధ్యక్షులు ఎం.తిరుపతి రెడ్డి, టీ ఎన్ జి ఓస్ కార్యదర్శి బైరి సోమయ్య, టీ ఎస్ యూ టి ఎఫ్ కార్యదర్శి పెండెం రాజు, టీపిటిఎఫ్ అధ్యక్షులు శ్రీరామాంజనేయులు, రావుల రమేష్, డిటిఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేష్,మాధవ రెడ్డి, సలీం, రాజమౌళి, లక్ష్మి ప్రసాద్, శ్యాం సుందర్, బింగీ సురేష్, రాజేశ్వర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, అనూప్, ప్రణయ్, మాలకొండ రెడ్డి, నికిల్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖను వెంటనే బర్తరఫ్ చేయాలి

### కాంగ్రెస్ నాయకులు డిమాండ్



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** మంత్రి కొండా సురేఖను వెంటనే మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిపై కొండా సుస్మిత పటేల్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు. ఆదివారం మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పరమేశ్, నల్గొండ రమేష్ తదితరులు మాట్లాడారు. కొమ్మాల జాతరలో కొండా మురళి సుస్మిత పటేల్ పరకాల నుండి పోటీ చేస్తారని ప్రకటించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థిత్వాలను ప్రకటించే అధికారం వారికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. వరంగల్ తూర్పులో కార్పొరేటర్ టికెట్లను సైతం తామే ప్రకటిస్తున్నట్లు వ్యవహరించడం సరికాదన్నారు. క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ తూర్పులో మంత్రి భర్తరఫ్ వేడుకలు ఎప్పుడు నిర్వహించుకుంటామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. బిసి కార్డును ముందు పెట్టి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. బిసి నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. పార్టీ కోసం పనిచేస్తున్న తమ అనుచరులపై అక్రమ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బిసి మహిళగా ఉండి కూడా వరంగల్ తూర్పులో బిసిలను అణగదొక్కుతున్నారని మంత్రి సురేఖపై ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కురివి పరమేస్, ఎండి సలీం, జి స్వప్న, సోమలక్ష్మి, గోరంట్ల రాజు, బస్వరాజ్ కుమారస్వామి, దామెర సర్వేశం, చాగంటి శ్రీనివాస్, ఆంజనేయులు, కొమ్మాల సందీప్, హరీష్, ఏకాంబరం, సదానందం, వినోద్, లింగమూర్తి, సతీష్, బాబు, నరిగె శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కాల్కి స్పందించిన నాగరాజు

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** వర్ధన్నపేట నియోజకవర్గంలోని 65వ డివిజన్ లోని ఎల్లాపూర్, దేవన్నపేటతో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు మరమ్మత్తులు జరుగుతున్న క్రమంలో గ్రామ ప్రజలు ''డయల్ యువర్ ఎమ్మెల్యే'' నెంబర్కి కాల్ చేసిన మరుక్షణమే వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు స్పందించి సంబంధించిన అధికారులతో ఫోన్లో మాట్లాడి 65 డివిజన్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాటర్ ట్యాంకర్లు పంపారు. పైపులైన్లు మరమ్మత్తులు జరిగేవరకు ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్న ''డయల్ యువర్ ఎమ్మెల్యే'' నెంబర్కి కాల్ చేసి సమస్యను పరిష్కారమయ్యే విధంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.



# ప్రాణం పోతున్నా..ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం లేదా?

### వర్ధన్నపేట పేద రోగుల అవస్థలు
### సేవలు నాలుగు గంటలేన్నా
### అత్యవసర వేళ ఎంజిఎంకు పరుగు

**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** రక్తం ప్రాణాన్ని నిలబెట్టే జీవనాధారం. ప్రమాదం జరిగినా ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం అయినా, తీవ్ర రక్తం అందితేనే ప్రాణాపాయంలో ఉన్నా సకాలంలో రక్తం అందితేనే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. అలాంటి అత్యవసర సమయంలో వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రిలో బ్లడ్ స్టోరేజీ ఉన్నప్పటికీ సేవలు ఉదయం 9 నుంచి మద్యాహ్నం 1 గంట వరకు అందుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఒంటిగంట దాటితే రక్తం కోసం ఎంజీఎంపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితులు సమయం చూసుకుని రావు, రాత్రివేళ ప్రసవంలో రక్తస్రావం జరిగినా, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి వెంటనే రక్తం అవసరమైనా, స్థానికంగా రక్తం అందుబాటు లేకపోతే రోగి బంధువులే ఎంజీఎం వైపు పరుగులు తీయాల్సి వస్తోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రక్తాన్ని సమకూర్చిడం, తీసుకురావడం వంటి ప్రక్రియల్లో ఆలస్యం జరిగితే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

**ఎనిమిది నెలల్లో 11 యూనిట్లు**

2026లో ఇప్పటివరకు ఎనిమిది నెలల్లో 11 యూనిట్ల రక్తం అందించినట్లు సిబ్బంది తెలిపారు. ఇందులో ఓ పాజిటివ్ 5,బి పాజిటివ్ 5, ఏ నెగెటివ్ 1 యూనిట్ అందిజినట్లు తెలిపారు. బ్లడ్ స్టోరేజీ యూనిట్కు పాథాలజీ వైద్యుడితో పాటు ఇద్దరు సహాయక సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై పాథాలజీ వైద్యుడు మాట్లాడుతూ తాను సుమారుగా ఏడాది కాలంగా వర్ధన్నపేటలో విధులు నిర్వహిస్తున్నానని అన్నారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బ్లడ్ స్టోరేజీ సేవలు అందిస్తున్నామని, ఆ సమయంలో అత్యవసరంగా రక్తం అవసరమైన వారికి నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న రక్తాన్ని సరఫరా చేస్తున్నామని చెప్పారు.

ఒంటిగంట తర్వాత అత్యవసరంగా రక్తం అవసరమైతే ఎంజీఎం నుంచి సమకూర్చుకునే విధానం ఉందన్నారు. బ్లడ్ స్టోరేజీని 24 గంటలు నిర్వహించాలా లేదా అనేది తన వ్యక్తిగత నిర్ణయం కాదని,ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు, సిబ్బంది కేటాయింపు, ఆస్పత్రి పరిపాలనా నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.

**అదికారులే స్పష్టత ఇవ్వాలి**

బ్లడ్ స్టోరేజీ సదుపాయం ఉన్న ఆస్పత్రిలో అత్యవసర వేళల్లో రక్తం అందుబాటులో ఉండేలా ఎలాంటి వ్యవస్థ ఉందో అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. స్థానికంగా ఎంత మేర రక్తం నిల్వలు ఉండాలి..? ఎంజీఎం నుంచి రక్తం సమకూర్చుకునేందుకు ఎంత సమయం పడుతుంది..? అత్యవసర పరిస్థితుల్లో బాధ్యత ఎవరిది..? అనే ప్రశ్నలకు వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సమాధానం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రాణం నిలబెట్టే రక్తం. సమయం చూసి అందితే ఎలా ? అత్యవసర రోగులకు సకాలలో రక్తం అందేలా బ్లడ్ స్టోరేజీ సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాథాలజీ వైద్యుడి బాధ్యత కేవలం రక్తం అందించడం వరకు పరిమితం కాకుండా, రక్త నిల్వల పర్యవేక్షణ, నాణ్యత, రికార్డుల నిర్వహణ,సిబ్బంది పర్యవేక్షణ, అత్యవసర సమయంలో ప్రత్యామ్నాయ రక్త సరఫరా వ్యవస్థతో సమన్వయం చేయడం వరకు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నగరంలో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

## నగరమంతా కలియతిరిగిన సిపి: గౌష్ ఆలం




**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరంలో శనివారం అర్ధరాత్రి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా నగరంలో పర్యటించి శాంతిభద్రతల పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు.రాజీవ్ చౌక్, శనివారం మార్కెట్, తెలంగాణ చౌక్‌తో పాటు బైపాస్ రోడ్డులోని దాబా ప్రాంతాలను సీపీ సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో నైట్ పెట్రోలింగ్ ఎలా కొనసాగుతోంది, సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉన్నారా అనే అంశాలను పరిశీలించారు. నిర్దేశిత సమయం ముగిసిన అనంతరం కూడా కొనసాగుతున్న హోటళ్లు, దాబాలు, టీ షాపులు, పాన్ షాపుల యజమానులతో సీపీ స్వయంగా మాట్లాడి సమయపాలన పాటించాలని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులను నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అనుమతించిన సమయం దాటిన తర్వాత కూడా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న షాపుల యజమానులకు నోటీసులు జారీ చేయాలని స్థానిక పోలీసు అధికారులను సిపి ఆదేశించారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా నిరంతరం నిఘా కొనసాగించా లని సూచించారు.నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు భద్రతా భావన కల్పించడమే లక్ష్యంగా నైట్ పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేయాలని సీపీ అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల నిరంతర గస్తీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని సీపీ గౌష్ ఆలం తెలిపారు.

# ధరల పెరుగుదలతో సామాన్యుడిపై ఆర్థిక భారం

## సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తోడుపునూరి


**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గత నెల రోజులుగా మా ర్కెట్లో చక్కెర ధర విపరీతంగా పెరిగి సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందని, దీనిని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తోడుపునూరి రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. మార్కెట్లో జూలై లో కిలో రూ.48 ఉన్న చక్కెర, ఆగస్టు మూడో వారం నాటికి హోల్ సేల్ లోనే రూ. 6570 కి, రిటైల్ లో రూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దాని ప్రకారం, ఈ ఏడాది చెరుకు ఉత్పత్తి అంచనా 30.9 మిలియన్ టన్నుల కాగా, యూపీ, మహారాష్ట్రలో తెగుళ్ళు, అధిక వర్షాల కారణంగా ఉత్పత్తి 27.9 మిలియన్ టన్నుల కు పడిపోయిందని,. దేశ వ్యాప్తంగా చక్కెర వినియోగం 28.5 మిలియన్ టన్నులు ఉండటంతో కొరత ఏర్పడిందని కేంద్ర ప్రభుత్వం అంటుందని, అలాగే పండుగల సీజన్ డిమాండ్, కేంద్ర ప్రభుత్వం డీలర్లపై 400 టన్నుల స్టాక్ లిమిట్ విధించినా, క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదని, బ్లాక్ మార్కెట్ ను అరికట్టాలని, అవసరమైతే 10 లక్షల టన్నుల దిగుమతి చక్కెరను మార్కెట్లోకి తీసుకురావాలని, లేని పక్షంలో రేషన్ షాపుల ద్వారా కుటుంబానికి 5 కిలోల చొప్పున సబ్సిడీపై చక్కెరను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# నృసింహుడిని దర్శించుకున్న జస్టిస్ శరత్



**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ ఆదివారం సతీసమేతంగా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారికి దేవస్థానం పక్షాన పూర్ణకుంభం,మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు.ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు, అర్చకులు జస్టిస్ దంపతులకు ఆశీర్వచనం అందించారు.దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం,చిత్రపటాన్ని అందజేసి జస్టిస్ శరత్ దంపతులను సన్మానించారు.జగిత్యాల జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్న పద్మావతి,ఆలయ సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్,ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు,అర్చకులు సముద్రాల వంశీకృష్ణ,అభిషేకం పురోహితులు బొజ్జ రాజగోపాల్,స్థానిక సీఐ రాంనర్సింహారెడ్డి, సధాకర్,రవీందర్,అర్చకులు,దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట: సత్యం



**ప్రజాపక్షం/కొడిమ్యాల :** ఇందిరా మైనార్టీ మహిళా యోజన పథకం కింద కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన రేష్మ, షాబాన బేగం లకు వంద శాతం సబ్సిడీతో మంజూరైన యాభై వేల రూపాయల చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు ఇద్దరికి అందజేశారు మైనార్టీ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని చొప్పదండి శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్ల సర్పంచ్‌లపోరం ఉపాధ్యక్షుడు కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి ,ప్యాక్స్ చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోగురి భూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

# నవ నిర్మాణరహదారి అధ్వాన్నం!

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం ప్రధాన రోడ్డుపై ప్రయాణమంటే ప్రాణాలతో చెలగాటమే. రామగుండం ప ట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే అబాది రామగుండంలింగాపూర్‌రాయదండిపాములపేట గ్రామాలతోపాటు స్థానిక హౌసింగ్‌బోర్డుకాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గత 3 నెలలుగా దెబ్బతిని పూర్తిగా గుంతలమయంగా మారింది. రామగుండం నవ నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా, గుంతల రోడ్డును మా త్రం అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడంలేదని మాజీ కార్పొరేటర్ బద్రి రజిత రాజు పటేల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీభక్తాంజనేయస్వా మి దేవాలయం సమీపాన పాత రోడ్డు పూర్తిగా చెడింది. కొత్త రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు మరమ్మతులు చేపట్టి గుంతలు లేకుండా చూ డాలని కోరుతున్న ఏవరూ పట్టించుకోవడంలేదు. ప్రతిరోజూ ఈ రోడ్డుపై వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ద్విచక్ర, ఇతర వాహనదారులు ప్రయాణిస్తున్నారు. వర్షాలతో గుంతలలో నీరు చేరి లోతు కనిపించక అందులో పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏది గుంతో, ఏది రోడ్డో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.

# భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు..

- సామాన్యుడి బతుకు భారం
- ధరల పెరుగుదలతో కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్లు


**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్యుడి జీవనం భారంగా మారుతోంది. ఒకవైపు ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉండగా మరోవైపు వంటింటి ఖర్చులు పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్లు తారుమారవుతున్నాయి. బియ్యం, పప్పులు, వంటనూనె, పిండి, రవ్వ, చక్కెర, కూరగాయలు, పాలు వంటి నిత్యావసరాల ధరలు పెరగడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**వంటనూనె ధరలతో వంటింట్లో మంట :** నిత్యావసరాల్లో కీలకమైన వంటనూనె ధరలు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తెలంగాణలో సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర ఆగస్టు 2024లో కిలోకు రూ.110.50 ఉండగా గస్టు 2026 నాటికి రూ.192.కు చేరినట్లు ధరల గణాంకాలు సూచిస్తున్నాయి. రెండేళ్ల వ్యవధిలో ధర భారీగా పెరగడం సామాన్య కుటుంబాలపై నేరుగా ప్రభావం చూపుతోంది.నూనె ధరలు పెరగడంతో ఇంటి వంట ఖర్చులు మాత్రమే కాకుండా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిన్న ఆహార వ్యాపారాల నిర్వహణ వ్యయం కూడా పెరుగుతోంది. దీంతో ఆ భారాన్ని చివరకు వినియోగదారులపైనే మోపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**పప్పులు.. బియ్యం.. చక్కెర.. తప్పని ఖర్చులు :** ప్రతి కుటుంబానికి బియ్యం, పప్పులు, పిండి, రవ్వ, చక్కెర వంటి వస్తువులు తప్పనిసరి. వీటి ధరల్లో స్వల్ప పెరుగుదల జరిగినా నెలవారీ కుటుంబ బడ్జెట్‌పై గణనీయమైన ప్రభావం పడుతోంది.ఆగస్టు 21 నాటి ధరల వివరాల ప్రకారం సోనా మసూరి బియ్యం ధర క్వింటాల్‌కు రూ.6,000కు పైగా, కంది పప్పు ధర రూ.12.000కు పైగా, చక్కెర ధర క్వింటాల్‌కు రూ.7,000గా నమోదైనట్లు పేర్కొంటున్నారు. దీంతో నెలనెలా కిరాణా బిల్లు పెరుగుతుండటంతో సామాన్య కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.ఇప్పటికే విద్య, వైద్యం, విద్యుత్, రవాణా, ఇంటి అద్దె వంటి ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు ఆహార వస్తువుల ధరల పెరుగుదల మరింత ఆర్థిక భారాన్ని మోపుతోంది.

**వాతావరణ పరిస్థితులతో కూరగాయల ధరలకు రెక్కలు :** కూరగాయల ధరలు కూడా స్థిరంగా ఉండటం లేదు. వర్షాభావం, అధిక వర్షాలు, వరదలు, పంటల దిగుబడి తగ్గడం, రవాణా సమస్యలు, మార్కెట్లకు సరఫరా తగ్గడం వంటి కారణాలతో ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నాయి.ముఖ్యంగాపాడయ్యే కూరగాయల విషయంలో సరఫరా తగ్గినప్పుడు ధరలు వేగంగా పెరుగుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లిన వినియోగదారులకు రోజు కో ధర ఎదురవుతోంది. కూరగాయల ధరల్లో తరచూ మార్పులు చోటుచేసుకోవడంతో నెలవారీ ఇంటి ఖర్చులను ముందుగానే అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది.

**జీతం వచ్చినా.. చేతిలో మిగిలేది ఏమీ లేదు :** నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఉద్యోగులు, చిరుద్యోగులు, కార్మికులు, చిన్న వ్యాపార కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నెల ప్రారంభంలో జీతం చేతికి వచ్చినా.. ఇంటి అద్దె, పిల్లల చదువులు, విద్యుత్ బిల్లులు, రవాణా, వైద్యం, కిరాణా ఖర్చులకు సరిపోక ముందే ఆదాయం ఖర్చైపోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."ఆదాయం పెరగడం లేదు.. కానీ ప్రతి వస్తువు ధర మాత్రం పెరుగుతోంది. నెల చివరికి అప్పు చేయాల్సిన పరిస్థితి వస్తోంది" అని సామాన్య కుటుంబాలు వాపోతున్నారు.




**ధరల నియంత్రణకు చర్యలు ఏవీ?**

నిత్యావసర వస్తువుల ధరలపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయాలు వంటి వాటిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రైతు నుంచి వినియోగదారుని వరకు సరఫరా వ్యవస్థలో మధ్యవర్తుల ప్రభావాన్ని తగ్గించడం, అక్రమ నిల్వలను అరికట్టడం, మార్కెట్లకు సరుకుల సరఫరాను సక్రమంగా నిర్వహించడంతోధరలను నియంత్రించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

**సామాన్యుడి వంటింటికి ఊరట ఎప్పుడో?**

ధరలు పెరుగుతున్న వేగానికి అనుగుణంగా ఆదాయాలు పెరగకపోవడంతో సామాన్య కుటుంబాల జీవనం భారంగా మారుతోంది. నిత్యావసరాల ధరల పెరుగుదల కేవలం మార్కెట్ సమస్యగా కాకుండా ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే అంశంగా మారింది.ధరల మంటను తగ్గించి సామాన్యుడి వంటింటికి ఊరట కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. నిత్యావసరాల ధరలకు కళ్లెం వేసి పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# బిఆర్ఎస్, బిజెపి నుంచి కాంగ్రెస్‌లో పలువురి చేరికలు



**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం నుంచి పెద్దఎత్తున బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం వారిని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంఛార్జి వొడితెల ప్రణవ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు మరోవైపు అభివృద్ధి రెండింటినీ సమపాళ్ళలో అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. అనతరం హుజురాబాద్ నియోజకవర్గం ఇంఛార్జి వొడితల ప్రణవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు చేరవేస్తామని అన్నారు. నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి హుజురాబాద్ అభివృద్ధికి తోడ్పడుతామని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, డివైసీ సెక్రటరీ సజ్జు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాగర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

# జర్నలిస్టు కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- ప్రజా పాలన ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**ప్రజా పక్షం/వేములవాడ టౌన్:** జర్నలిస్టు కాలనీలో మౌలిక సదుపాయాలను త్వరలోనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆరో వార్డు కౌన్సిలర్ కాస శ్రీనివాసులతో కలిసి నాంపల్లి శివారులోని జర్నలిస్టు కాలనీని వారు సందర్శించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో, నాంపల్లి శివారులో 391 సర్వే నంబర్‌లో ప్రభుత్వం జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించిన విషయం తెలిసిందే. గత మూడేళ్లుగా పలువురు జర్నలిస్టులు కాలనీలో ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. అయితే విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు,రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి జర్నలిస్టులు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జర్నలిస్టు కాలనీని సందర్శించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్‌ను ఆదేశించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆరో వార్డు కౌన్సిలర్ కాస శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.గత ప్రభుత్వం జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించిందని, ప్రస్తుత ప్రభు త్వం కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పా టు పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కాస శ్రీనివాసులను ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాపల్లి శ్రీనివాస్ శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారుజర్నలిస్టు కాలనీకి చెందిన విలేకరులు పాల్గొన్నారు.



# జిఒ 97ను రద్దు చేయాలి.. లేదంటే పోరాటం తప్పదు!

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్


**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 97ను రద్దు చేయాల్సిందేనని.. లేదంటే పోరాటం ఉధృతం చేయక తప్పదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మోడల్ గురుకుల పాలిటెక్నిక్ మహిళా కళాశాలలోని విద్యార్థినిలతో శుక్రవారం గంగుల కమలాకర్ మాట్లాడారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులకు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అండగా నిలిచారు. జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేసి, పూర్వపు పాలిటెక్నిక్ విద్యా విధానాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ముఖ్యంగా ప్రస్తుతం మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాబోయే రోజుల్లో ఏలాంటి అవకాశాలు ఉంటాయో, పరీక్షలు ఎలా ఉంటాయో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని తమ ఆందోళనను వెల్లడించారు. విద్యార్థుల ముఖాల్లోని ఆందోళనను గమనించిన గంగుల వారికి అభయమిస్తూ, మీ భవిష్యత్తు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న అ నాలోచిత నిర్ణయాల కారణంగానే జీవో నెంబర్ 97 పుట్టుకొచ్చిందని దుయ్యబట్టారు.పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయడం ద్వారా ఆయా కళాశాలలకు చెందిన కోట్ల విలువైన విలువైన ప్రభుత్వ భూములను అదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం ఈ జీవోను ప్రకటించిందని గంగుల కమలాకర్ సంచలన ఆరోపణలు చేశారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలని చూస్తే, విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు. అదే బాటలో తెలంగాణ ప్రభుత్వం కూడా స్పందించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నెంబర్ 97ను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 97 రద్దయ్యే వరకు విద్యార్థుల పక్షాన నిలిచి ఏ క్షణంలోనైనా పోరాటం చేస్తాము. అసెంబ్లీ ఈ అంశాన్ని ప్రముఖంగా లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. పేద విద్యార్థుల నోటికాడి బుగ్గిని లాక్కునే ఈ దుర్మార్గపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు విశ్రమించే ప్రసక్తే లేదు. ఎమ్మెల్యే గంగుల వెంట మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వి ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్, నాయకులు గంగాధర చందు మొగిలోజు వెంకట్, పలువురు బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ కార్డు అందాలంటే పడి గాపులేనా

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అర్హులైన రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డు అందాలంటే పంపిణీ కేంద్రం వద్ద పడిగాపులు కాసి తీసుకునే పరిస్థితి మల్లాపూర్ మండల కేంద్రంలో తయారయింది. జిపిఓలు రేషన్ దుకాణాల నిర్వాహకుల సహకారం తో పంపిణీ చేస్తుంటే మేజర్ గ్రామపంచాయతీ అయినా మల్లాపూర్ గ్రా మంలో మాత్రం ఐదు షాపుల వినియోగదారులకు ఒకే చోట పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసి అందజేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆదివారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పంపిణీ కేంద్రం వద్ద పడికాపులు కాసి మరి స్మార్ట్ కార్డు అందుకునే దుస్థితి ఎదురయ్యిందంటూ గ్రామస్తులు అధికారులు తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి మేజర్ గ్రామపంచాయతీ మల్లాపూర్‌లో ఐదు రేషన్ దుకాణాల ద్వారా కార్డులను అందిస్తే ఇబ్బందులు తొలగుతాయని అధికారులను వినియోగదారులు కోరుతున్నారు.

# కొత్తపల్లి కిషన్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ధర్మపురి :**187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ–నిజామాబాద్ ఆధ్వర్యంలో ధర్మపురికి చెందిన శ్రీ భాను స్టూడియో నిర్వాహకుడు,ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొత్తపల్లి కిషన్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఫోటోగ్రఫీ రంగంతో పాటు తోటి ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలను అభినందించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు,సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో వృద్ధురాలి అనుమానాస్పద మృతి

## ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించాం :డిఎస్‌పి, నిందితులను కఠినంగా శిక్షించాలి :మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. గ్రామానికి చెందిన బడుగు దుబ్బరాజు (60) మృతదేహం గొల్లపల్లి రోడ్డులోని తిమ్మాపూర్ బస్‌స్టాప్ సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ చిన్న కెనాల్‌లో లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం. దుబ్బరాజు గొల్లపల్లి రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ ,తాతమ్మ గుడిలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.ప్రతిరోజూ ఉదయం సుమారు 4 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి తాతమ్మ గుడికి వెళ్లి, పని ముగించుకుని ఉదయం 7 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వస్తుంటారు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం కూడా పనికి బయలుదేరారు. అయితే ఉదయం సుమారు 4.20 గంటల సమయంలో తిమ్మాపూర్ బస్‌స్టాప్ సమీపంలోని మోతే బక్కన్న వ్యవసాయ పొలం వద్ద ఓ మహిళకు అరుపులు వినిపించాయి. భయంతో ఆమె ఇంటికి వెళ్లి గ్రామస్తులకు సమాచారం అందించింది. దీంతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని పరిసరాల్లో గాలించగా, అక్కడ పల్సర్ మోటార్‌సైకిల్ కనిపించింది. సమీపంలో ని ఎస్సారెస్పీ చిన్న కెనాల్‌లో దుబ్బరాజు మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. అక్కడ ఉన్న పల్సర్ మోటార్‌సైకిల్‌ను గుర్తు తెలియని వ్య క్తులు స్టార్ట్ చేసుకుని పరారైనట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం, జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై ఉమాసాగర్ క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి కుమార్తె బడుగు స్వప్న ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దుబ్బరాజు మృతికి గల కారణాలు, ఘటనకు పాల్పడిన వ్యక్తుల గుర్తింపు, వారి పాత్రపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు వేగంగా చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలి మాజీ మంత్రి జీవన్ రెడ్డి : జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో రామక్క అనే మహిళ అనుమాదాస్పదంగా మృతి చెందడంతో సంఘటన స్థలానికి మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి వచ్చారు. పోస్టుమార్టం అనంతరం జరిగే అంతిమ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం జీవన్ రెడ్డి అందించారు. సమాజంలో మానవత్వ విలువలు లేకుండా పోయాయి. మరణించిన రామక్క ఉదుపరి పని చేస్తు జీవనం కొనసాగిస్తుంది ఉదయం 4 గంటలకు పనికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది అని తెలుపుతున్నారు దురదృష్టకరం, శిక్ష అనే కాకుండా ఇటువంటివి భవిష్యత్ లో జరగకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు.



# గంజాయి విక్రేత అరెస్ట్

## బస్సులో వస్తుండగా పట్టుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో గంజాయి విక్రయించేందుకు 300 గ్రాముల గంజాయితో వస్తున్న బీహార్‌కు చెందిన సాగర్ కుమార్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా స్థా నిక పోలీస్ స్టేషన్లో ఆదివారం మెట్పల్లి సిఐ సురేష్ బాబు,ఎస్ ఐ నవీన్ కుమార్ తో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సాగర్ మెట్పల్లి బస్టాండ్ నుంచి ఇబ్రహీంపట్నం బస్సులో గంజాయితో వస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో ఎస్సై జి. నవీన్ కుమార్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం పట్టుకుంది. నిందితుడు గతంలో కిలో గంజాయి తీసుకొచ్చి మెట్పల్లి పరిసరాల్లో విక్రయించినట్లు తెలిపారు.చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుళ్లు చైతన్య, మహేందర్, సంతోష్ కుమార్, ప్రశాంత్ లను సీఐ అభినందించారు .మండలంలో గంజాయి విక్రయించినా,సేవించినా కఠిన చర్యలు తప్పవని సిఐ సురేష్ బాబు,ఎస్ ఐ జి. నవీన్ కుమార్ హెచ్చరించారు.



# నవకల్పనల్లో ప్రపంచస్థాయి గుర్తింపు

## ప్రైవేట్ అంతరిక్షరంగ సిఇఒలకు ప్రధాని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కెరీర్‌ను సృష్టించుకోవా లనుకుంటే భారతదేశానికి రావాలని భావించేలా, అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగానికి ఒక ప్రత్యేక వాతావరణాన్ని సృష్టించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కిచెప్పారు. 20 స్పేస్ స్టార్టప్‌ల సిఈఓలు, వ్యవస్థాపకులతో శుక్రవారం జరిపిన సమావేశంలో, అంతరిక్ష ప్రాజెక్టులను చేపట్టడంలో భారత్‌కు ఉన్న వ్యయపరమైన పోటీతత్వాన్ని ఆయన విపులీకరించారు. ఆవిధంగా విడుదలచేసిన ఇంటర్వ్యూ లిఖితరూపం ప్రకారం...దేశంలోని విస్తారమైన ప్రతిభావంతుల సమూహాన్ని, అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశం శరవేగంగా ఆధిపత్య స్థానాన్ని నెలకొల్పడానికి వీలు కల్పిస్తాయని ప్రధాని ఉద్ఘాటించారు. ప్రపంచం ఇప్పుడు తప్పకుండా భారతీయ స్టార్టప్‌ల వైపు చూస్తూ, ఈ రంగంలో ఎవరు ముందున్నారని ఆశ్చర్యపోతూ ఉండాలని ప్రధాన మంత్రి అన్నారు. ఎందుకంటే ఎప్పుడైతే ఒక పురోగతి జరు గుతూ ఉంటుందో అప్పుడే ప్రజల వైఖరి సైతం తక్షణమే మారుతూ ఉంటుందని ఆయన తెలియజేశారు. సిఈఓలలో ఒకరు ప్రధానితో మాట్లాడుతూ, భారతదేశ అంతరిక్ష పరిశ్ర మను ప్రైవేట్ సంస్థలకు అందించిన తర్వాత చాలా సానుకూల ధోరణి కన్పించిందని, అమెరికా, యూరప్‌లలో నివసిస్తున్న చాలామంది భారతీయ పౌరులు ఇప్పుడు దేశానికి తిరిగొచ్చి పనిచేయాలని అనుకుంటున్నారని చెప్పారు. ఈ విషయమై స్పందించిన ప్రధానమంత్రి మాట్లాడుతూ 'విదేశాలకు వెళ్లి ఇప్పుడు తిరిగొస్తున్న ప్రజలతో మనం అనుసంధానం కావాలి. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కారు తయారుచేయలనుకుంటే భారతదేశానికి రావాలి అని భావించే వాతావరణాన్ని మనం సృష్టించాలని నేను నమ్ముతున్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అలాంటి వ్యక్తులు భారతదేశంలోని ఒక స్టార్టప్‌తో, ఒక అంత రిక్ష యాత్రికుడితో అనుసంధానం కావాలి. మీ వల్లే మనం అయస్కాంతంలా ప్రతిభావంతులను ఆకర్షించగలమని, అది మనకు అపారమైన బలంగా మారుతుందని నేను గట్టిగా నమ్ముతున్నాను' అని మోదీ చెప్పారు. ఒక కొత్త రంగంలోకి అడుగు పెట్టేందుకు ధైర్యాన్ని ప్రదర్శిస్తున్న కొత్త స్టార్టప్‌ల సిఈ ఓలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆశావాం కలిగించే ఒక అతిపెద్ద అంశం ఏమంటే ప్రభుత్వం మాటపై వారు చూపే నమ్మకమేనన్నారు.పోటీ తత్వం విషయంలో భారతదేశం చాలా ముందుందని, ప్రతి భకు కొదవలేదని మోదీ అన్నారు. ధర విషయంలో తాము ఎంతో చాలా పోటీతత్వంతో ఉన్నామని, ప్రతిభ విషయంలో ఎలాంటి సందేహం లేదని, పైగా మా సిబ్బందికి సుశిక్షణనే అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉందని, ఈ కారణాల వల్ల చాలా వేగంగా మా స్థానాన్ని సుస్థిరం చేసుకోగలమని సిఈ ఓలు తెలిపారు. ప్రైవేట్ సంస్థల కోసం ఈ రంగాన్ని తెరిచిన దుకు వారు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకూ నెలకు ఒక రాకెట్ ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాలు నిర్మించబడ్డాయని చెప్పారు. ఇది ఆరంభం మాత్రమేనని, వారానికి ఒకటి చొప్పున చివరికి రోజుకు అనేక ప్రయోగాలు చేయాలనేదే తమ లక్ష్యమని సిఈఓలు తెలిపారు. ఈ విష యంలో పెట్టుబడిదారులకు విశ్వాసం ఉందా? అని ప్రధాని మోదీ అడిగినప్పుడు, స్కైరూట్ తొలి ప్రయోగం తర్వాత, పెట్టు బడిదారుల విశ్వాసం గణనీయంగా పెరిగిందని సిఈఓలలో ఒకరు వివరించారు. రాబోయే 18నెలల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రౌండ్ స్టేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని సిఈఓలు తెలిపారు. ఒకే ప్రయోగం తర్వాత, తమ కంపెనీకి 8 ప్రయోగ ఒప్పందాలు లభించాయని, వాటిలో చాలావరకు అంతర్జాతీయమైనవని మరొక సిఈఓ చెప్పారు.

# గృహాలు ఎల్‌పిజి నుంచి.. పిఎన్‌జికి మారే ప్రక్రియ వేగవంతం చేయాలి

## రాష్ట్రాలు, యుటిలను కోరిన కేంద్రం




**న్యూఢిల్లీ :** గృహాలు ఎల్‌పిజి నుంచి పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్ జి)కి మారే ప్రక్రియను వేగవంతం చేయడానికి జిల్లా స్థాయి పరి పాలనా యంత్రాంగం మద్దతు అందించాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (యుటి లు)ను కోరింది. అలాగే, గ్యాస్ పంపిణీదారులు, ఆయిల్ మార్కె టింగ్ కంపెనీలతో సమన్వయం చేసుకునేందుకు నోడల్ ఆఫీస ర్లను నియమించాలని కోరింది. ఆగస్టు 21న రాష్ట్ర ప్రభుత్వ ప్రధా నకార్యదర్శులకు రాసిన ఒక లేఖలో పెట్రోలియం సెక్రటరీ నీరజ్ మిట్టల్ మాట్లాడుతూ, సురక్షితమైన, స్వచ్ఛమైన, మరింత సమర్థ వంతమైన పిఎన్‌జి, ఎల్‌పిజికి సంబంధించిన లాజిస్టిక్ భారాన్ని తగ్గించడం, వినియోగదారుల సౌకర్యాన్ని మెరుగుపర్చడంతో పాటు, భారతదేశ ఇంధన పరివర్తనను ముందుకు తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని అన్నారు. 'పిఎన్‌జి సురక్షిత మైన, పరిశుభ్రమైన, మరింత సమర్థవంతమైన వంట ఇంధనాన్ని అందిస్తుంది.దేశ ఇంధన పరివర్తన లక్ష్యాలను ముందుకు తీసుకె ళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీని వేగవంతమైన వినియోగం ఎల్‌పిజి పంపిణీకి సంబంధించిన లాజిస్టిక్స్ భారాన్ని తగ్గించడం, వినియోగదారుల సౌకర్యాన్ని పెంచడానికి, గణనీయమైన ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులతో సృష్టించబడిన సిజిడి మౌలిక సదుపాయాల వినియోగాన్ని మెరుగుపరచడానికి దోహదపడు తుంది' మిట్టల్ ఆ లేఖలో పేర్కొన్నారు. పైపుల ద్వారా గ్యాస్ సర ఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాలలో, ఒకే కుటుంబం ఎల్ పిజి, పిఎన్‌జి కనెక్షన్‌లు కలిగి ఉండకుండా నిరోధించే లక్ష్యంతో ఒక నియంత్రణా చట్టాన్ని అమలు చేసేందుకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటున్నందున, జిల్లా స్థాయి జోక్యాన్ని కోరుతోంది. ఈ ఏడాది ఆరంభంలో పశ్చిమాసియా సంక్షోభం సమయంలో భారతదేశపు ఎల్‌పిజి సరఫరా గొలుసు లకు అంతరాయం కలగడంతో వంట ప్రయోజనాల కోసం గృహా లకు పైపుల ద్వార సరఫరా చేసే గ్యాస్ (పిఎన్‌జి) వినియోగాన్ని వేగవంతం చేయాలనే ఒత్తిడి పెరిగింది. ఈ సంఘర్షణ వల్ల అత్య ధికంగా ప్రభావితమైన ఇంధనాలలో ఎల్‌పిజి ఒకటి. ఎందు కంటే, భారతదేశం తన వంటగ్యాస్ అవసరాలలో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. ఈ సరఫరాలలో చాలా వరకు ఖతార్, సౌదీ అరేబియా, యుఏఇ, కువైట్ నుంచి హోర్ముజ్ జలసంధి గుండా వస్తాయి. సరఫరాలు క్రమంగా పురుద్ధరించబడటానికి ముందు వాణిజ్య పారిశ్రామిక వినియోగదారులు ఆంక్షలను ఎదుర్కొన్నారు. అప్పటి నుంచి భారతదేశం ఈ దిశగా అడుగులు వేసింది. మధ్యప్రాచ్య (మిడిల్ ఈస్ట్) సరఫరాలలో అంతరా యాల ప్రభావాన్ని తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా, అమె రికా, అల్జీరియా నుంచి అధిక కొనుగోళ్లతో సహా తన ఎల్‌పిజి సేకరణ విధానాలను వైవిధ్యీకరణ చేస్తోంది. దీనికి విరుద్ధంగా పైపుల ద్వారా సరఫరా అయ్యే సహజవాయువు, సంక్షోభ సమ యంలో ముఖ్యంగా, దేశీయ గృహ వినియోగదారులకు గణనీ యంగా ఎక్కువ స్థిరత్వాన్ని ప్రదర్శిస్తోంది. దిగుమతి చేసుకునే ఎల్‌ఎన్‌జిపై ఎక్కువగా ఆధారపడే పారిశ్రామిక, వాణిజ్యగ్యాస్ వినియోగదారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, దేశీయ పిఎన్‌జి, సిఎన్‌జి సరఫరాలు చాలా వరకు ప్రభావితం కాకుండా ఉంటాయని అంచనా వేయబడింది. పిఎన్‌జి వినియో గాన్ని వేగవంతం చేయడానికి, ప్రభుత్వం 1955నాటి నిత్యావ సర వస్తువుల చట్టంలోని సెక్షన్ 3 కింద సహజవాయువు, పెట్రో లియం ఉత్పతుల పంపిణీ (పైపులైన్‌లు, ఇతర సౌకర్యాలు, పైపు లైన్లు వేయడం, నిర్మించడం, నిర్వహించడం, విస్తరించడం ద్వారా) ఉత్తర్వులు 2026, ఎల్‌పిజి నియంత్రణ ఉత్తర్వులు జారీ చేసింది. గృహాలు ఏకకాలంలో ఎల్‌పిజి, పిఎన్‌జి కనెక్షన్‌లను కలిగిఉండటాన్ని ఈ ఉత్తర్వులు నిషేధిస్తున్నాయని, అలాగే, పిఎ న్‌జి సరఫరా అందుబాటులో ఉన్న చోట నోటీసు ఇచ్చినప్పటికీ పిఎన్‌జి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోని గృహాలకు ఎల్‌పిజి సరఫరాను నిలిపివేయడానికి కూడా ఇవి వీలు కల్పిస్తాయని మిట్టల్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రతీ భౌగోళిక ప్రాంతంలో ఒక పిఎన్‌జి సమన్వయ కమిటీ (పిసిసి)ని ఏర్పాటు చేయాలని మంత్రిత్వ శాఖ అధీకృత నగర గ్యాస్ పంపిణీ సంస్థలను (సి జిడి), ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీ(ఓఎంసి')లను ఆదేశించింది. కమిటీలు అర్హులైన హౌసింగ్ సొసైటీలు, కుటుం బాలను గుర్తించి, హౌసింగ్ సొసైటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసి యేషన్లు, వ్యక్తిగత వినియోగదారులకు చట్టబద్ధమైన నోటీసులు జారీచేసి, పిఎన్‌జి కనెక్షన్‌లను వేగవంతం చేయడానికి అవగా హనా శిబిరాలు నిర్వహిస్తాయి. పిసిసి యంత్రాంగం ఇప్పటికే పనిచేస్తోందని, నిర్దేశిత కాలపరిమితుల్లోగా ఈ మార్పులను అమ లుచేయడానికి జిల్లా స్థాయి పరిపాలనా యంత్రాంగం మద్దతు చాలా కీలకమని తమ అనుభవం చూపిస్తోందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

# సరిహద్దులపై చైనాతో రేపు 25వ విడత చర్చ

## నేడు అజిత్ దోవల్ బీజింగ్ పయనం



**బీజింగ్:** భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సోమవారం చైనా పర్యటనకు వెళు తున్నారు. చైనా–భారత్ మధ్య సరిహద్దు సమస్యపై చైనా జాతీయ భద్రతా సలహాదారు వాంగ్ యీతో ఆయన మంగళవారం సంభాషిస్తారు. భారత్–చైనా ప్రతినిధులమధ్య ఇప్పటివరకూ 24 సార్లు ఎస్‌ఆర్ స్థాయి (స్పెషల్ రిప్రజెంటేటివ్స్) సమా వేశాలు జరిగాయి. ఇప్పుడు మళ్ళీ అజిత్ దోవ ల్–వాంగ్ యీ మధ్య 25వ విడత ఎస్‌ఆర్ స్థాయి చర్చలు జరుగుతాయి. సరిహద్దుల్లో వివా దాలపై సమస్యల పరిష్కారానికి 2003లో ఈ ప్రత్యేక యంత్రాంగాన్ని ఇరు దేశాలు ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు చెప్పాయి. భారత్–చైనా మధ్య 3,488 కి.మీ నిడివిగల విస్తారమైన సరిహద్దులు ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు 12,13 తేదీలలో న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ శిఖ రాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు చైనా అధ్య క్షుడు జీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించనున్నారు. ఆ సమయానికి రెండు దేశాలమధ్యా సరిహద్దు సమస్యపై ఒక సానుకూల వాతావరణం ఏర్పడు తుందని, ఇరు దేశాల నాయకులు వచ్చేనెలలో సమావేశమై సానుకూల ప్రకటన చేస్తారని గట్టి విశ్వాసం వ్యక్తమవుతున్న తరుణంలో అజిత్ దోవల్ చైనా పర్యటనకు వెళుతున్నారు. ఐతే ఆయన చైనా పర్యటన గురించి అధికారికంగా ఎలాంటి ధృవీకరణ లేదు. ఐతే ఇరు దేశాలకు చెందిన ఉన్నతాధికారులు ఈ చర్చలు సఫలీకృత మవుతాయని ఆశాభావంతో ఉన్నారు. దీనినిబట్టే సానుకూల వాతావరణంలో మోదీ–జిన్‌పింగ్ మధ్య సంభాషణలు జరుగుతాయి. గత ఏడాది ఆగస్టులో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా తియాంజిన్‌లో మోదీ–జిన్ పింగ్ మధ్య సమావేశం జరిగింది. అజిత్ దోవల్ బీజింగ్ పర్యటన సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ శనివారం మాట్లాడుతూ, సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకుం టుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు దేశా లమధ్యా సత్సంబంధాలు ముందుకు వెళతాయని ఉద్ఘాటించారు. చైనా సైన్యాలు అరుణాచల్ ప్రదేశ్ లోని అప్పర్ సుబాన్‌సిరి ప్రాంతంలో ఇటీవలి వారంలో తిష్టవేశాయని వార్తలు వెలువడ్డాయి. సరిహద్దుల్లో చైనా సైన్యాలు క్రియాశీలంగా వ్యవ హరిస్తున్నాయన్న నివేదికపై చైనా విదేశీమంత్రి త్వశాఖ ప్రతినిధి గుయో జియాకున్ ఈనెల 12న స్పందిస్తూ, సరిహద్దుల్లో పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. దౌత్య,సైనిక మార్గాలలో రెండు దేశాలు సంబంధాలు కొనసాగించాలని ఇప్పటికే నిర్ణయించాయి. భారత విదేశీ వ్యవహా రాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈనెల 11న మాట్లాడుతూ, సరిహద్దుల్లో పరిస్థితులే ఇరు దేశాలమధ్యా ద్వైపాక్షిక సంబం ధాలను ముందుకు నడిపిస్తాయని,అందువల్ల సరి హద్దుల్లో శాంతి,భద్రతల రక్షణ అత్యంత ప్రాము ఖ్యతగల అంశమని చెప్పారు.

# ఆ సత్తా భారత్‌కు ఉంది

## ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా ఇండియా మారుతుంది : రాజ్‌నాథ్ సింగ్



**కోల్‌కతా :** ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారగల సత్తా భారత్‌కు ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. నౌకా నిర్మాణ రంగంలో ఏర్పడిన అవకాశాలను భారత్ అందిపు చ్చుకోవాలని అన్నారు. బెంగాల్‌లోని కోల్‌కతా నుంచి గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జి ఆర్‌ఎస్‌ఇ), యంత్ర ఇండియా లిమిటెడ్ విస్తర ణకు సంబంధించిన రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆదివారం ఆయన వర్చువల్‌గా శంకు స్థాపన చేశారు. ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో ప్రస్తుతం ఒక రకమైన ఖాళీ ఏర్పడుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ అవకాశాన్ని భారత్ ఉపయోగించుకో వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచ షిప్‌బిల్డింగ్ హబ్‌గా మారగలదని అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని చెప్పారు. దేశీయంగా యుద్ధ నౌకల తయారీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు విదేశాలపై ఆధార పడటాన్ని మరింత తగ్గించేందుకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. బెంగాల్‌లో పారిశ్రామిక రంగంలో కొత్త మార్పు కనిపిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో రక్షణ రంగానికి కీలక స్థానం ఉందని రాజ్ నాథ్ సింగ్ చెప్పారు. సుమారు రూ.3,500 కోట్ల విలు వైన ఐదు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని, భారత్ నిర్మాణంలో ఇవి కీలక అడుగులని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# ఒడిశా తీరానికి సమీపంలో కార్గో నౌక మునక : 22 మంది గల్లంతు



**భువనేశ్వర్ :** ఒడిశా తీరానానికి సమీ పంలో ఓ కార్గొ నౌక మునకకు గురైంది. పారాదీప్ తీరానికి సుమారు 230 నాటికల్ మైళ్ల దూరంలోని బంగాళాఖాతంలో 24 మంది సిబ్బందితో ప్రయాణిస్తున్న పనామా జెండా కలిగిన ఒక బల్క్ క్యారియర్ (నౌక) మునిగిపోయింది. దీంతో ఇండియన్ కోస్ట్ గార్డ్, ఈస్టర్న్ నావల్ కమాండ్ గాలింపు, సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు.

20 మంది చైనీయులు, ముగ్గురు మయ న్మార్ దేశస్థులు, ఒక బంగ్లాదేశ్ దేశస్థుడు ప్రయాణిస్తున్న 'ఎంవి ఓషన్ విన్నర్' అనే నౌక శనివారం మునిగిపోయిందని వారు పేర్కొన్నారు. అయితే ఇద్దరు సిబ్బందిని రక్షించారు.

సమీపంలో ఉన్న వాణిజ్య నౌక 'ఎండి ఐసో పోస్'ను గాలింపు, సహాయం కోసం మళ్లిం చినట్లు మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (ఎంఆర్‌సిసి) తెలిపింది. ఆ నౌక రాత్రి 8 గంటల సమయంలో రెండు లైఫ్‌రా ఫ్టల (రక్షణ తెప్పల) నుండి ఇద్దరు ప్రాణా లతో బయటపడిన వారిని రక్షించిందని ఐసిజి ప్రతినిధి ఒకరు తెలిపారు. మిగిలిన సిబ్బంది కోసం సముద్ర ఉపరితలంపై గాలింపు చర్యలు చేపట్టేందుకు మూడు నౌకలను మోహరించినట్లు ఐసిజి ఆది వారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఈస్టర్న్ నావల్ కమాండ్ కూడా ఎక్స్‌లో స్పందిస్తూ, నిఘా విధుల్లో ఉన్న పి8ఐ విమానాన్ని శ్రీ విజయ్ పురంలోని ఎంఆర్‌సిసి సమన్వ యంతో గాలింపు, సహాయక చర్యల కోసం తక్షణమే మళ్లించినట్లు తెలిపింది.

# జంతర్ మంతర్ వద్ద నిరసనలకు ఎలాంటి అనుమతీ లేదు

## తప్పుదోవ పట్టించే సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా సమావేశం కావద్దు : పోలీసులు హెచ్చరిక

**న్యూఢిల్లీ :** రిజర్వేషన్ సంస్కరణలపై జంతర్ మంతర్ వద్ద నిర సన లేదా సమావేశం నిర్వహించడానికి ఏ వ్యక్తికి గానీ, సంస్థకు గానీ అనుమతి ఇవ్వలేదని ఢిల్లీ పోలీసులు ఆదివారం తెలిపారు. అలాగే, తప్పుదోవ పట్టించే సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా సమావేశం కావద్దని ప్రజలను హెచ్చరించారు. ఆదివారం జంతర్ మంతర్ వద్దకు తరలి రావాలని ప్రజలకు పిలుపునిస్తూ సోషల్ మీడియాలో అనేక వీడియోలు, పోస్టులు వెలుగులోకి వచ్చిన నేప థ్యంలో ఈ ప్రకటన వెలువడింది.'సిఆర్‌పిసిలోని సెక్షన్ 144 స్థానంలో వచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్‌ఎస్ ఎస్)లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు న్యూఢిల్లీ జిల్లాలో ఇప్ప టికే అమల్లో ఉన్నాయి' అని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం, ఆ ప్రాంతంలో నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు, నిరసనలు, ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మందితో కూడిన సమావేశాలు నిషేధించబడ్డాయని వారు చెప్పారు. అలాంటి పోస్టులు లేదా వీడియోల ఆధారంగా గుమిగూడవద్దని, ధృవీకరిం చని సమాచారాన్ని ఇతరులకు చేరవేయడం, వ్యాప్తి చేయడం వంటివి చేయవద్దని పౌరులకు సూచించారు. నకిలీ లేదా తప్పు దోవ పట్టించే సమాచారాన్ని సృష్టించడం, ప్రచారం చేయడం లేదా వ్యాప్తి చేయడం వంటివి చేస్తున్నట్లు తేలితే వారిపై తగిన చట్టపర మైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ధృవీక రించబడిన సమాచారంపై మాత్రమే ఆధారపడాలని వారు ప్రజ లకు విజ్ఞప్తి చేశారు.

## ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు..

# దేశ ప్రయోజనాలకు సరి కాదు

## బిఎస్‌పి చీఫ్ మాయావతి హితవు

**లక్నో :** కుల ఆధారిత రిజర్వేషన్ల స్థానంలో ఆర్థిక ప్రాతిపదికన రిజర్లేషన్లను తీసుకురావాలన్న డిమాం డ్‌ను ఆదివారం బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బిఎ స్‌పి) అధినేత్రి మాయావతి తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి చర్య దేశ ప్రయోజనాలకు మంచిది కాదని ఆమె హితవు పలికారు.ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి అయిన మాయావతి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి,ఒబిసి వర్గాలు శతాబ్దాలుగా ఎదుర్కొంటున్న వివక్ష, అణగారిన స్థితిని పరిరక్షించడానికి ఈ వర్గా లకు రిజర్వేషన్లు కల్పించాలనేది రాజ్యాంగ నిబంధన ఉద్దేశమని స్పష్టంచేశారు. కుల ఆధారిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా డిమాండ్లను లేవనెత్తుతున్నవారు, సమా నత్వ సమాజాన్ని, అభివృద్ధి చెందిన, గౌరవప్రదమైన దేశాన్ని నిర్మించాలనే రాజ్యాంగ లక్ష్యాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలకూ దూరంగా ఉండాలని మాయావతి అన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసన తెలిపేం దుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గుమిగూడిన పలువురు నిరసనకారులను శుక్రవారం ఢిల్లీ పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ సహాయం, రిజర్వేషన్లకు అర్హత నిర్ణయించడంలో కులానికి బదు లుగా ఆర్థిక ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, నిరసనకారులను సోషల్ మీడియా ద్వారా ఈ ప్రదర్శన కోసం సమీకరించారు. ఆ డిమాం డ్‌ను ప్రస్తావిస్తూ, నిరసనకారులకు తమ వైఖరిని వివ రించేందుకు రాహుల్ గాంధీ గానీ, మరే ఇతర కాంగ్రెస్ నాయకుడు గానీ అక్కడికి వెళ్లలేదని మాయా వతి పేర్కొన్నారు. అంటే ఈ వర్గాల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న 'రిజర్వేషన్ల వ్యతిరేక మనస్తత్వాన్ని' ఇది ప్రతిబింబిస్తుందని మాయావతి ధ్వజమెత్తారు. కులత త్వంపై బిఆర్.అంబేద్కర్ అభిప్రాయాలను మాయా వతి ఉటంకిస్తూ కులతత్వాన్ని విడనాడటమే 'గొప్ప దేశభక్తి' అని ఆమె ఉటంకించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు పేదరికాన్ని నివారించే కార్యక్రమాలపై వీటి కోసం చాలినంత ప్రజా ధనాన్ని వెచ్చిస్తున్నప్పటికీ, అవినీతి, అధికారయంత్రాంగం తప్పిదాల వల్ల ఆ డబ్బు ప్రజల దరికి చేరడంలేదని, ఇది ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని మాజీ సిఎం మాయావతి ఆరోపించారు. అగ్రవర్ణాలకు చెందిన పేద కుటుం బాలు కూడా దాని పూర్తి ప్రయోజనాన్ని పొందలేక పోతున్నాయని,ఈ ఏర్పాటు చాలా వరకు సరిపోవడం లేదని ఆమె తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన దశా బ్దాల తర్వాత కూడా ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి వర్గాలు పేద రికం,కుల ఆధారిత వివక్ష, దోపిడీ, అఘాయిత్యాలు, సామాజిక పక్షపాతాలను ఎదుర్కొంటూనే ఉన్నా యని మాయావతి ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేష న్‌ను వ్యతిరేకించే వారికి ఆశ్రయం లేదా రక్షణ కల్పిం చవద్దని ఆమె ప్రభుత్వాలను కోరారు. అలాగే, ఈ సున్నితమైన అంశంపై చౌకబారు రాజకీయాలకు పాల్పడవద్దని రాజకీయపార్టీలకు మాయావతి విజ్ఞప్తి చేశారు.

# నేడు సిజెపి కార్యవర్గం భేటీ

## కేంద్ర ప్రభుత్వ హామీల అమలుపై చర్చ

## సమావేశ నిర్ణయాలకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని యువతకు పిలుపు

**న్యూఢిల్లీ :** గత నెలలో 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) నేతృ త్వంలో జరిగిన నిరసనలకు దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం పలు హామీలు ఇచ్చింది. అయితే ఆ హామీలను నెరవేర్చడానికి తీసు కుంటున్న చర్యల గురించి ప్రభుత్వం ఇంకా అధికారికంగా సమాచారం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో కేంద్రం ఇచ్చిన హామీల అమలు తీరును సమీక్షించేందుకు సిజెపి సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనుంది. ఆ హామీల అమ లును సాధించడానికి అవసరమైన అన్ని చర్యలను పరిశీలిస్తా మని, ఇందులో భాగంగా మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళనను ప్రారంభించే అవకాశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని సిజపి ఆదివారం తెలిపింది. దేశంలోని యువ తకు ప్రభుత్వం మాట ఇచ్చినందున సిజెపి తన ఆందోళనను సద్భావనతో విరమించిందని పేర్కొంది. ఆ సద్భావనను బలహీ నతగా భావించేలా అనుమతించబోమని స్పష్టం చేసింది. సోమ వారం జరగబోయే సమావేశం ఫలితాలకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని విద్యార్థులు, యువతస తమ మద్దతుదా రులు, స్వచ్ఛంద కార్యకర్తలను సిజెపి కోరింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరసనకారులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు ఆగస్టు 18న ఆదేశిం చిన కొద్ది రోజులకే ఈ ప్రకటనలు వెలువడ్డాయి. కేసులను కొట్టి వేసేందుకు ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగిం చుకునే విషయాన్ని పరిశీలించేందుకు వీలుగా, ఆ జాబితాను సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని మూడు సార్లు కోరిందని సిజెపి తెలిపింది. కోర్టు పదేపదే ఈ జాబితాను అడిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దానిని సమర్పించడానికి ముందుకు రాలేదని వెల్లడించింది. కోర్టు విచారణ ముగిసిన వెంటనే, కేంద్రంతో జరిగిన చర్చల ఆధారంగా సిజెపి తన ఆందోళనను విరమించినప్పటికీ, ప్రభుత్వం యువతను మోసం చేస్తున్నట్లు కనిపిస్తోందని తమ సహ కన్వీనర్ సౌరవ్ దాస్, న్యాయ వ్యవహారాల విభాగం అధిపతి రత్న సింగ్ ఆందోళన వ్యక్తం చేశారని ఆ సంస్థ తెలిపింది. కాగా, నిరసనల కారణంగా నమోదైన అన్ని ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకోవడం లేదా కొట్టివేయడం, భవిష్యత్తులో ఏ విద్యార్థి లేదా శాంతియుత నిరస నకారుడిపైనా శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా హామీ ఇవ్వడం, పేపర్ లీక్ కారణంగా మే నెలలో పరీక్ష రద్దయ్యాక ఆత్మహత్య చేసుకున్న నీట్ యుజి అభ్యర్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించడం వంటివి ఆ హామీలలో ఉన్నాయి. ఎఫ్‌ఐఆర్‌లు, పరి హారంతో సహా లిఖితపూర్వక హామీలను నెరవేర్చడానికి తీసు కుంటున్న చర్యల గురించి అధికారికంగా తెలియజేయడానికి, తమతో చర్చలు జరిపిన ప్రభుత్వ బృందం ఎటువంటి సంప్రదిం పులూ జరపలేదని సిజెపి పేర్కొంది. ప్రభుత్వ మాటల ఆధారం గానే ఆందోళనను విరమించుకోవాలని నిర్ణయించుకున్నామని తెలిపింది. ఇచ్చిన హామీలను నీరుగార్చడం, ఆలస్యం చేయడం, పునర్వ్యాఖ్యానించడం లేదా అగౌరవపరచడం వంటి ఏ ప్రయ త్నమైనా దేశ యువత పట్ల విశ్వాసఘాతంగా పరిగణించబడు తుందని హెచ్చరించింది.

# సిజెపి హెచ్చరికకు తలొగ్గిన రాజస్థాన్

## జైపూర్‌లో ప్రాథమిక పాఠశాల కొత్త నిర్మాణం 1వ తేదీన ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటన

## రూ. 18 లక్షలు మంజూరు

## 48 గంటల హెచ్చరికతో సహా సమస్య పరిష్కారమైంది : సిజెపి



**జైపూర్ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలను బాగుచేయండి) ప్రచారానికి రాజస్థాన్ ప్రభుత్వం తొలగ్గింది. జైపూర్‌లోని ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం కొత్త భవన నిర్మాణాన్ని సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రారంభిస్తామని ప్రకటించింది. ఈ పాఠశాల విషయం లోనే ఇటీవల సిజెపి సభ్యులకు, గ్రామస్తులకు మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. సంగనేర్ బ్లాక్‌లోని రాంపుర (కన్వ ర్‌పుర) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొత్త భవనం కోసం రూ. 18 లక్షలు మంజూరు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందులో రూ. 12 లక్షలు ఆగస్టు 13న 'జిల్లా ఖనిజ ఫౌండే షన్ ట్రస్ట్' (డిఎంఎఫ్‌టి) నుండి, మరో రూ. 6 లక్షలు ఎమ్మెల్యే నిధుల నుండి కేటాయించారు. శుక్రవారం నాడు సిజెపి బృందం తమ 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలను బాగుచేయండి) ప్రచారంలో భాగంగా ఆ గ్రామాన్ని సందర్శించినప్పుడు వారిపై బిజెపి గూండాలూ, గ్రామస్తులు దాడి చేశారు. ఈ నేప థ్యంలోనే శనివారం రాత్రి పాఠశాల నిర్మాణంపై ప్రకటన వెలు వడింది. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాల నుండి ఎఫ్‌ఐఆ ర్‌లు నమోదయ్యాయి. కాగా, ప్రభుత్వ ప్రకటనపై సిజెపి సహ వ్యవస్థాపకుడు, అధికార ప్రతినిధి అశుతోష్ రంకా మాట్లాడుతూ రాంపుర పాఠశాల విషయంలో తమ పార్టీకి ఉన్న తక్షణ డిమాండ్ నెరవేరిందని, అయితే ప్రభుత్వ పాఠశా లల పరిస్థితులపై తమ ప్రచారం కొనసాగుతుందన్నారు. 'మేము అక్కడ ఓట్లు అడగడానికి వెళ్ళలేదు. పాఠశాలను బాగు చేయడం గురించి మాట్లాడటానికి వెళ్ళాము. ఇప్పుడు ప్రభుత్వం సెప్టెంబర్ 1 నుండి పనులు ప్రారంభించడానికి ఆమోదం తెలిపింది కాబట్టి, మా 48 గంటల హెచ్చరికతో సహా ఆ సమస్య పరిష్కారమైంది' అని రంకా చెప్పారు. అయితే, ఈ పనులను అంతకు ముందే ఎందుకు ప్రారంభించ లేదని ఆయన ప్రశ్నించారు. సిజెపి బృందం పర్యటన సమ యంలో జరిగిన హింసకు ఎటువంటి సమర్థన లేదని అన్నారు. 'ప్రభుత్వానికి పిల్లల భవిష్యత్తు పట్ల నిజమైన శ్రద్ధ ఉంటే, పాఠ శాలలకు మరమ్మతులు చేయించాలి. మేము గొడవ పడటానికి ఇక్కడ లేము, కానీ మేము వెనక్కి తగ్గము లేదా భయపడి పోము' అని ఆయన అన్నారు. రాంపుర పాఠశాల విషయంలో తీసుకున్న నిర్ణయం సిజెపి ప్రచారం ప్రభావాన్ని సూచిస్తుం దని రంకా పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శిం చడం, అవసరమైన చోట శాంతియుత నిరసనలు చేపట్టడం కొనసాగించాలని పార్టీ కార్యకర్తలను కోరారు.

రాజస్థాన్ అంతటా సుమారు 3,000 పాఠశాల భవనాలు శిథి లావస్థలో ఉన్నాయని, 611 పాఠశాలలు భవనాలు లేకుం డానే నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాల మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం ప్రకటించిన రోడ్‌మ్యాప్‌ను ప్రస్తావిస్తూ, మార్చి 31న రూ.12,000 కోట్ల ప్రణాళికను ప్రకటించిందని, దాని కాలపరిమితిని ఇప్పుడు ఐదేళ్ల నుంచి మూడేళ్లకు తగ్గించారని రాంకా తెలిపారు. సిజెపి సభ్యులు తదుపరి జోధ్‌పూర్‌తో సహా పశ్చిమ రాజస్థాన్‌లోని పాఠశాల లను సందర్శించి, తమ తనిఖీ ప్రచారాన్ని కొనసాగిస్తారని రాంకా చెప్పారు.

## పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణ

# మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు

**రాంచీ :** జార్ఖండ్‌లోని గిరిడ్డి, హజారీబాగ్‌లలో పోలీసు లకు, ఉద్యోగార్థులకు మధ్య ఘర్షణలకు ఘర్షణ చెలరేగిన విషయం విదితమే. అయితే ఈ నిరసల్లో పాల్గొన్న వారిలో గుర్తించిన 28 మందిపై, గుర్తించని 900 మందిపై మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు ఆదివారం తెలి పారు. ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించడం, పోలీసు లతో ఘర్షణ పడటం వంటి ఆరోపణలపై రాంచీలోని కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో గుర్తించిన 14 మందిపై, గుర్తిం చని 200 మందిపై మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసిన మరుసటి రోజు ఈ పరిణామం చోటుచేసుకుంది. గిరిడ్డిలో శుక్ర, శనివారాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు కాగా, ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించడం, పోలీసు సిబ్బం దిపై దాడి చేయడం వంటి ఆరోపణలపై హజారీబాగ్‌లో మరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం జార్ఖండ్ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వేలాది మంది విద్యార్థులు ముఖ్య మంత్రి హేమంత్ సోరెన్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి గాంధీ మైదాన్‌కు తరలివచ్చారు. అక్కడ ఆందోళనకారు లకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. హజారీబాగ్ జిల్లాలో ఈనెల 21న సోరెన్ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నంలో ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించడం, పోలీసులపై దాడి చేయడం వంటి ఆరోపణలపై 18 మంది నిందితులుగా పేర్కొన్న వారిపై, 700 మంది గుర్తుతెలియని వ్యక్తులపై కొర్రా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి నట్లు హజారీబాగ్ సదర్ డిఎస్‌పి రూపక్ కుమార్ సింగ్ పిటి ఐకి తెలిపారు. సదర్ సిఐ అశుతోష్ కుమార్ దరఖాస్తు ఆధా రంగా తాము ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామన్నారు. గిరిడ్డిలో, ఎబివిపి కార్యకర్త అనీష్ రాయ్ దరఖాస్తు ఆధారంగా మొదటి ఎఫ్‌ఐఆర్ నమోదు కాగా, సదర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) మనోజ్ కుమార్ సింగ్ దరఖాస్తుపై రెండవది నమోదు చేయబడింది. జెఎంఎం నాయకులు, కార్యకర్తలపై మొదటి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజయ్ సింగ్‌తో సహా 11 మందిని నిందితులుగా పేర్కొన్నారని, మరో 20 మందిని గుర్తించలేదని గిరిడి టౌన్ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ఇన్‌ఛార్జ్ పిటిఐకి తెలిపారు. రెండవ ఎఫ్‌ఐఆర్‌లో సుమారు 10 మందిని నిందితులుగా పేర్కొనగా, 200 మందిని గుర్తుతెలియలేదు.

# కొత్త వాణిజ్య యుద్ధంలో చిక్కుకున్న అమెరికా – కెనడా

51వ రాష్ట్రం స్థాయికి దిగజారుస్తున్నారు: కెనడా ఆవేదన

మా చట్టాలకింద లబ్ధికోరుతున్న కార్నీ : ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా–కెనడా మధ్య వాణిజ్య సుంకాల వివాదం చర్చల బల్ల వద్ద విఫలం కావడంతో ఇరు దేశాల సంబంధాలు మును పు ఎన్నడూ చూడని కొత్త దశలోకి ప్రవేశించాయి. దశాబ్దాలుగా స్వేచ్ఛావాణిజ్యాన్ని అనుభవించిన చిరకాల మిత్రదేశాలు కెనడా–అమెరికా ఇప్పుడు ఎటూ దారిలేని స్థితిలో చిక్కుకుని తీవ్ర వాణిజ్య యుద్ధంలో చిక్కుకున్నాయి. చర్చల నుండి వైదొలగి అమెరికాను ప్రతిఘటించాలని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ తీసుకున్న నిర్ణయం ఆయనకు దేశంలో అగ్నిపరీక్ష కానున్నది.వైట్‌హౌస్‌లో జరిగిన వాణిజ్య చర్చలలో సంభాషణల బల్ల దగ్గర నుండి వైదొలగిన మెట్టుమొదటి నాయకుడు కార్నీ. ఇది ఆయనకు పెద్ద రాజకీయ పరీక్ష. శనివారం (ఆగస్టు 22) నుండి అమలులోకి వచ్చిన అమెరికా సుంకాలలో కెనడా ఎగుమతి చేసే హాకీ స్టిక్కుల నుండి వ్యవసాయ ఉత్పత్తుల వరకూ 20 బిలియన్ డాలర్ల విలువైన వివిధ రకాల వస్తువులు ఉన్నాయి.కెనడా తమ దేశంలో అంతర్భాగం కాకపోయినప్పటికీ తమ దేశ భూభాగాలకు వర్తించే చట్టాలను అనుగుణంగా ప్రయోజనాలను కావాలని అడుగుతోందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెబుతుండగా, ఆమోదయోగ్యంకాని, చాలా కఠినమైన షరతులు చర్చల్లో ట్రంప్ విధించారని కార్నీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దేశంలో ప్రతిపక్షాలు వ్యాపారులు కార్నీకి మద్దతు ఇస్తున్నారు. కెనడాను అమెరికా 51వ రాష్ట్రం స్థాయికి దిగజార్చాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నదని కెనడాలోని వ్యాపారులు,ప్రతిపక్షాలు కూడా విమర్శిస్తున్నాయి. ఒంటారియా ప్రావిన్స్ నాయకుడు డగ్ ఫోర్డ్ కార్నీకి మద్దతు ఇచ్చారు. ట్రంప్‌ను నమ్మడం సాధ్యంకాదన్నారు. కెనడా సామర్థ్యాన్ని అర్థంకోవాలనుకుంటున్న ట్రంప్ మనదేశాన్ని 51వ రాష్ట్రం స్థాయికి దిగజారుస్తున్నరని బ్రిటిష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఎబీ వ్యాఖ్యానించారు. ఇది కెనడా ప్రజలకు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ట్రంప్ కొత్త సుంకాలవల్ల దేశంలో ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చిందని క్యూబెక్ ప్రీమియర్ క్రిస్టియన్ ఫ్రెంచెట్ అన్నారు. చివరి నిమిషంలో ఘోరమైన,అన్యాయపూరితమైన మార్పులు ఒప్పందంలో చేశారని కార్నీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఒప్పందం నుండి బయటకు వచ్చామన్నారు. ట్రంప్ వ్యాఖ్యానిస్తూ, తమ భూభాగం కాకపోయినా అందుకు అనుగుణమైన ఆర్థిక ప్రయోజనాలను,సుంకాల రాయితీలను కెనడా కోరుతోందన్నారు. కెనడా నుండి అమెరికాకు దిగుమతయ్యే అనేక రకాల వస్తువులపై 50 శాతం సుంకాలు భారీ ఎత్తున ఆగస్టు 20వ తేదీ నుండి అమలులోకి వస్తాయని రెండు నెలల క్రితం ట్రంప్ ప్రకటించిన తర్వాత రెండు దేశాలమధ్య మొదలైన చర్చలు శుక్రవారం అర్థరాత్రి దాటిన తర్వాత అర్థాంతరంగా ముగిశాయి. అమెరికా వైఖరి భరించలేక చర్చల నుండి కెనడా వైదొలగింది. దీంతో భారీస్థాయి సుంకాలు ఆ దేశంపై అమలులోకి వచ్చాయి. కానీ డాలరకు డాలర చొప్పున తాము కూడా ప్రతీకార సుంకాలు అమలు చేస్తామని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రతిజ్ఞ చేశారు. ఈ పరిస్థితుల్లో ట్రంప్ కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండాలని ఇంతకుముందు చేసిన డిమాండ్‌ను పరోక్షంగా గుర్తుచేశారు. కెనడాను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి, దేశాన్ని విభజించాలని ఉద్దేశించిన సుంకాలని మార్క్ కార్నీ విమర్శించడంతో ట్రంప్ పైవిధంగా స్పందించారు. వారు చాలా ఎక్కువ అడగారు, మాకు చాలా తక్కువ ఇచ్చారు అని సుంకాల భారాలను ఉద్దేశించి మార్క్ కార్నీ విమర్శించారు. మరోవైపు ఈ భారీ సుంకాలు కెనడాకు పెనుభారంగా మారుతున్న తరుణంలో దేశంలో అంతర్గతంగా మార్క్ కార్నీ ప్రభుత్వం పెద్ద సవాలును ఎదుర్కోనున్నది.

# భద్రతా ఒప్పందంపై ఇజ్రాయెల్‌తో చర్చలు

## సిరియా విదేశాంగమంత్రి షైబానీ ఆశాభావం



**దమాస్కస్:** సిరియా నుండి ఇజ్రాయెల్ దళాలు వైదొలగి దానికి ఉద్దేశించిన ఒక భద్రతా ఒప్పందంపై త్వరలో చర్చలు మళ్ళీ ప్రారంభమవుతాయని సిరియా విదేశాంగ మంత్రి అసద్ అల్–షైబానీ ప్రకటించారు. ఒక ఒప్పందం కుదురుతుందని తాము ఎంతో ఆశాభావంతో ఉన్నామన్నారు.ఇజ్రాయెల్‌పై ప్రస్తుతం మాకు నమ్మకం లేదని, అమెరికా చర్చల ద్వారా పరిష్కారం కోరుతున్నామన్నారు. దౌత్యానికి ఇంకా మార్గాలు తెరచే ఉన్నాయన్నారు. ఇదొక చారిత్రక అవకాశమని ఆయన అన్నారు.సిరియా వైమానికస్థావరంపై ఇజ్రాయెల్ బాంబుదాడులు చేసిన కొద్ది రోజుల తర్వాత దమాస్కస్‌లో షైబానీ రాయిటర్స్ వార్తాసంస్థతో మాట్లాడుతూ,ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు నిలిపివేయడమే తమ చర్చల ప్రధాన ఉద్దేశమన్నారు.అమెరికా ప్రత్యేక రాయబారి టామ్ బారక్ గడచిన మంగళవారం ఇజ్రాయెల్–సిరియా–టర్కీ మధ్య ఘర్షణల నివారణకు ఒక యంత్రాంగం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సిరియాలోని టిఫూర్ వైమానికస్థావరంపై ఇజ్రాయెల్ ఆగస్టు 18వ తేదీన గగనతల దాడులు చేసింది. ఈ చర్యను అమెరికా తీవ్రంగా ఖండిస్తూ ఇది అవసరంలేని విధంగా యుద్ధాన్ని విస్తరించే ఘర్షణగా విమర్శించింది. రన్ వే పైన, స్ట్రాటజీ సదుపాయాలపైన ఎనిమిదిసార్లు ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఐతే సిరియా–ఇజ్రాయెల్ మధ్య ఒక భద్రతాఒప్పందం కుదిర్చేందుకు మధ్యవర్తిగా అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. కానీ సిరియావల్ల తమ భద్రతకు ప్రమాదం ఉందని పేర్కొంటూ ఐడిఎఫ్ దాడులు చేస్తూ ఉండటంతో అమెరికా ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఇరాన్‌లో యుద్ధం మొదలైనప్పటినుండి ఈ భద్రతా చర్చలు నిలిచిపోయాయని, తిరిగి మొదలవుతాయని ఆశాభావంతో ఉన్నామని షైబానీ చెప్పారు. చర్చల బల్ల వద్దకు రావాల్సిందిగా ఇజ్రాయెల్‌పై అమెరికా నిరంతరం ఒత్తిడి తెస్తోందని కూడా చెప్పారు. 2024 డిసెంబరులో సిరియా నియంత అస్సాద్ పదవీచ్యుతుడైన తర్వాత ఆగ్నేయ సిరియాలోని నిస్సైనికీకరణ మండలాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించింది. ఈ ప్రాంతం అంతకుముందు ఇజ్రాయెల్ ఆక్రమించుకున్న గోలాన్‌హైట్స్‌కు పక్కనే ఉంది. 1967లో ఆరు రోజులపాటు సిరియాతో జరిగిన యుద్ధంలో గోలాన్‌హైట్స్‌లోని మెజారిటీ భూభాగాన్ని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది.

# కజకిస్థాన్ పార్లమెంటు ఎన్నికలు పూర్తి

ఏకైక చట్టసభ ఏర్పాటుకు 87 శాతం ఓటర్లు ఒకే




**టాలిన్:** మధ్యాసియాలో అతి పెద్దదేశం కజకిస్థాన్ పార్లమెంటుకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. పార్లమెంటు ఉభయసభలను ఏకం చేసి ఒకే ఒక్క చట్టసభ "కురుల్తాయ్"ని ఏర్పాటు చేసేందుకు 87 శాతం ఓటర్లు మద్దతు తెలియజేశారు. ఈ ఏకైక చట్టసభలో 145 స్థానాలు ఉంటాయి. దేశాధ్యక్షుడు కాస్సిమ్ జోమార్ట్ టోకాయెవ్‌కు అధికారంపై మరింత పట్టు పెరుగుతుందని భావిస్తున్నారు. ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో అధ్యక్షుడికి అనుకూలంగా ఉండే అటలెట్ పార్టీ అధికారంలోకి వస్తుందని సర్వత్రా ఊహాగానాలు సాగుతున్నాయి. అధ్యక్షుడు టోకాయెవ్‌కు విధేయతగా ఉంటే పలు చిన్నపార్టీలు కూడా చట్టసభలో ప్రాతినిధ్యం పొందుతాయని భావిస్తున్నారు. దేశంలో ఏకైక చట్టసభ 'కురుల్తాయ్'' ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారి జరుగుతున్న ఎన్నికలు ఇవే. దేశాధ్యక్షుడు టోకాయెవ్ వయసు 73 సంవత్సరాలు. 1991లో స్వాతంత్ర్యం పొందిన కజకిస్థాన్ అధ్యక్షుడు టోకాయెవ్ మాజీ సోవియట్ అధికారి. గతంలో ఆయన ఐక్యరాజ్యసమితిలో కజఖ్ దౌత్యవేత్తగా పనిచేశారు.2019 నుండి ఆయన అధ్యక్ష పదవిలో ఉన్నారు.అంతకుముందు ఆయన సెనేట్ ఛైర్మన్‌గా,దేశ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు.గడచిన మార్చినెలలో టోకాయెవ్ ప్రారంభించిన రాజ్యాంగ ప్రక్షాళనకు ఈ ఎన్నికలు ఒక ముగింపు. దేశాధ్యక్షుడే కీలకమైన నియామకాలన్నీ చేస్తారనేది రాజ్యాంగ సంస్కరణలలో మార్పు. ఐతే ఈ నియామకాలకు పార్లమెంటు ఆమోదం ఉండాలి. దేశ ఉపాధ్యక్షుణ్ణి తిరిగి నియమించిన తర్వాత కూడా పార్లమెంటు ఆమోదించాలి. కాగా విదేశాంగ విధానానికి సంబంధించి ఉక్రేన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత అటు రష్యా,పశ్చిమ దేశాలమధ్య టోకాయెవ్ సమతుల్యం పాటిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో రిటైర్డ్ టీచర్ కుటుంబం హత్య



**ఢాకా:** బంగ్లాదేశ్ రంగాపూర్‌లో హిందూమతానికి చెందిన రిటైర్డ్ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. ఒకే కుటుంబంలో నలుగురు సభ్యులను దుండగులు హత్య చేశారు. కొందరు వ్యక్తులు అక్రమంగా పొరుగింటి ఇంటి మేడ నుండి గణపతి చక్రవర్తి ఇంటి పైభాగంలో ప్రవేశించి మాదక ద్రవ్యాలు సేవిస్తుండగా ఇంటి యజమాని చక్రవర్తి (65) వెళ్ళి వారిని నిలదీశాడు. దీంతో దుండగులు ఆయన భుజంపై తువాలు తీసి ఆయన మెడకు చుట్టి ఊపిరి ఆడకుండా గొంతు నులిమి ఆయనను హత్య చేశారు. ఈ అలికిడి విని భార్య ప్రీతిలత చక్రవర్తి (50) మేడ పైభాగానికి వెళ్ళిచూడగా తమను గుర్తుపట్టిందన్న భయంతో ఆమెను కూడా దుండగులు హత్య చేశారు. ఆ తర్వాత కింద ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలు ఆగమి చక్రవర్తి (23), 12 ఏళ్ళ వయసుగల ప్రియం చక్రవర్తిని కూడా వారు హత మార్చారు. గడచిన గురువారం ఈ హత్య జరిగింది. ఐతే ఈ విషయం వెలుగులోకి రాలేదు. గణపతి మృతదేహం ఇంటి పైభాగంలో పడేయగా, ప్రీతిలత మృతదేహాన్ని పోలీసులు మెట్ల మార్గంలో కనుగొన్నారు. ఈ కుటుంబ సభ్యులు ఎలాంటి వివాదాల జోలికీ వెళ్ళకుండా ప్రశాంత జీవనం గడుపుతున్నారని, దుండగులు వారిని హత్య చేశారని పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ మబుద్ చెప్పారు.

# యుద్ధ సమయంలో ఎన్నికలకు జెలెన్‌స్కీ తిరస్కృతి

రష్యా ఆధీనంలో పది చ.కి.మీ ప్రాంతమే

ఫెడోరోవ్ తప్పుదారిలో వెళుతున్నారు




**కీవ్:** మునుపు లేనివిధంగా ఉద్ధృతస్థాయిలో యుద్ధం జరుగుతున్న సమయంలో దేశంలో ఎన్నికలను ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తిరస్కరించారు. కేవలం ఆరు నెలలు మాత్రమే రక్షణమంత్రిగా పనిచేసిన యువ నాయకుడు మైఖైలో ఫెడోరోవ్ అభిప్రాయంతో జెలెన్‌స్కీ విభేదించారు.దేశంలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని పదవీచ్యుతుడైన ఫెడొరోవ్ డిమాండ్ చేశారు. ఆయనను రక్షణమంత్రి పదవీ బాధ్యతల నుండి తొలగించడానికి వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. అతి తక్కువ సమయంలోనే ఫెడోరోవ్ తన యుద్ధ రీతుల ద్వారా, ప్రజల మన్ననలు పొందారు. వార్ రూమ్ ప్రక్షాళన పేరుతో అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆయనను పదవీచ్యుతుణ్ణి చేయడంతో ఉక్రేన్‌లో ప్రజా వ్యతిరేకత పెల్లుబికింది. ఇప్పటికీ ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఎన్నికలు నిర్వహించాలని ఫెడోరోవ్ డిమాండ్ చేయగా జెలెన్‌స్కీ మొదటిసారి నోరు తెరచి ఈ విషయంపై స్పందించారు. రెండు గంటలపాటు పత్రికాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. ఫెడోరోవ్‌పట్ల తనకు ఆనాడూ ఈనాడూ ఎంతో సానుకూల దృక్పథం ఉందనీ, ఆయన తప్పుడు మార్గంలో ప్రయాణం చేస్తున్నారని విమర్శించారు. దేశ అత్యున్నత సైనిక కమాండర్‌తో విభేదాల కారణంగా ఆయనను రక్షణమంత్రి పదవి నుండి తొలగించారు. ఫెడోరోవ్ ఈ విధంగా ఎన్నికలకు పిలుపు ఇవ్వడం,సామూహిక నిరసన ప్రదర్శనలలో పాల్గొనడం ఈ యుద్ధ సమయంలో దేశాన్ని తప్పుతోవ పట్టించడమేనని విమర్శించారు. రక్షణ ఖర్చులపై ఆయన సమస్యాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారని కూడా చెప్పారు.రష్యాలో స్టార్‌లింక్ వినియోగంపై డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశంలో తనకు ఎదురైన చేదు అనుభవం,వివాదం మొత్తం రక్షణమంత్రిత్వశాఖ తనకు ఇచ్చిన అరకొర,చాలీచాలని సమాచారం కారణంగానే జరిగిందని వివరణ ఇచ్చారు. రష్యా క్షిపణి దాడులు విపరీతంగా పెరిగిపోయినప్పటికీ పాశ్చాత్యదేశాల నుండి పేట్రియాట్రిక్ క్షిపణి సరఫరాలు తగ్గుముఖం పట్టాయని, దేశంలో గడచిన మూడు సంవత్సరాలుగా పేట్రియాట్రిక్ క్షిపణి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయంటూ ఆ గణాంకాలను ఆయన వివరించారు. ఐనప్పటికీ ఉక్రేన్ పలు విజయాలు సాధించిందని, అనేక ప్రాంతాలను రష్యా నుండి తిరిగి స్వాధీనం చేసుకున్నామని, కేవలం 10 చదరపు కిలోమీటర్ల ప్రాంతం మాత్రమే రష్యా అధీనంలో ఉందని చెప్పారు. ఉక్రేన్ రక్షణమంత్రిత్వశాఖ 27 బిలియన్ డాలర్ల బడ్జెట్‌లోటులో ఉందని చెప్పారు.

# సమష్టి పోరాటమే మార్గం

(మొదటి పేజీ తరువాయి)

వారు తదుపరి కథనం రాసేటప్పుడు ముందుగానే జాగ్రత్త పడే పరిస్థితి వస్తుందని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) భావప్రకటన స్వేచ్ఛకు హామీ ఇస్తోందని, భావప్రకటనతో పాటు ఆలోచన కూడా అత్యంత కీలకమని ఆయన అన్నారు. 1950లలోని ఆర్గనైజర్, క్రాస్‌రోడ్స్ కేసుల నుంచి బెనెట్ కోల్మన్, ఎక్స్‌ప్రెస్ గ్రూప్ కేసుల వరకు పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో న్యాయస్థానాలు కీలకపాత్ర పోషించాయని ఆయన గుర్తు చేశారు. జర్నలిజం ఒక మేధోపరమైన కార్యక్రమా? లేక పారిశ్రామిక కార్యక్రకమంగా పరిగణించాలా? అనే అంశంపై గతంలో జరిగిన చర్చలను ఆయన ప్రస్తావించారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, సమిష్టి చర్చలు, ట్రేడ్ యూనియన్ల హక్కులు వంటి అంశాల నేపథ్యంలో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రూపుదిద్దుకున్న చరిత్రను వివరించారు. జర్నలిస్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారం రావాలంటే పౌర సమాజాన్ని ఏకం చేసి, చైతన్యపరచి, తమ ఉద్యమం వెనుక నిలబెట్టుకోవాలని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగ విలువలు, భావప్రకటన స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

**జర్నలిస్టులకు రక్షణ ఏది? : మీడియా అకాడమి ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆవేదన**

జర్నలిస్టులపై ఒత్తిళ్లు, కేసులు, దాడులు పెరుగుతున్న సమయంలో వారి వృత్తిపరమైన హక్కులకు, ఉద్యోగ భద్రతకు సమర్థవంతమైన రక్షణ వ్యవస్థ లేకపోవడం ఆందోళనకరమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులు తమ హక్కులు, మీడియా చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు, వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా పోరాడాలన్నారు. జర్నలిజంలో క్షేత్రస్థాయి వార్తా సేకరణ తగ్గిపోవడం, డిజిటల్ మీడియా విస్తరణ, మీడియా సంస్థలపై పెరుగుతున్న ఒత్తిళ్లు, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, యూనియన్ల పాత్ర తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. తెలంగాణలో అనేక జర్నలిస్టు సంఘాలు, యూనియన్లు ఉన్నప్పటికీ జర్నలిస్టుల అసలు వృత్తిపరమైన సమస్యలపై అవి ఎంత వరకు పోరాడుతున్నాయనే ప్రశ్న తలెత్తుతోందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కల్పించిన భావప్రకటన స్వేచ్ఛలో భాగంగా పత్రికా స్వేచ్ఛకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా పని చేసే రక్షణ వ్యవస్థ ఏది అన్నది కీలక ప్రశ్నగా ఉందన్నారు. గతంలో అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల చట్టపరమైన రక్షణలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత వ్యవస్థలో జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించే బలమైన యంత్రాంగం అవసరమన్నారు.

**జర్నలిస్టులను విడదీసే యత్నం: హర్తోష్ సింగ్ బల్**

జర్నలిస్టులపై ప్రభుత్వాల నుంచి వచ్చే ప్రత్యక్ష ఒత్తిడి కంటే, వారిని వ్యక్తిగతంగా విడదీసి సమిష్టి శక్తిని బలహీనపరిచే కాంట్రాక్ట్ ఉద్యోగ విధానం, యాజమాన్యాల ఒత్తిళ్లు, ప్రభుత్వ ప్రకటనలపై మీడియా సంస్థలు ఆధారపడటం మరింత ప్రమాదకరంగా మారాయని ది కారవాన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ హర్తోష్ సింగ్ బల్ అన్నారు. జర్నలిస్టుల రక్షణకు వ్యక్తిగత పోరాటాలు సరిపోవని, చట్టపరంగా, నైతికంగా, సంస్థాగతంగా అండగా నిలిచే సమిష్టి శక్తిని నిర్మించాలని స్పష్టం చేశారు. సరళీకరణ విధానాల తర్వాత, ముఖ్యంగా కాంట్రాక్ట్ జర్నలిజం పెరిగిన కాలంలో జర్నలిస్టులను వ్యక్తిగత స్థాయిలోకి పరిమితం చేసే వాతావరణం ఏర్పడిందని బల్ పేర్కొన్నారు. ఒక జర్నలిస్ట్ తన జీతం, ఉద్యోగ పరిస్థితుల గురించి మరో జర్నలిస్ట్‌తో మాట్లాడని పరిస్థితి ఏర్పడిందన్నారు. తన రాజకీయ అభిప్రాయాలు యాజమాన్యానికి అసౌకర్యంగా ఉన్నాయనే కారణంతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని, ఆ తర్వాత లేబర్ కోర్టులో ఐదేళ్లకుపైగా న్యాయపోరాటం చేసి విజయం సాధించానని ఆయన చెప్పారు.

**22 ప్రెస్ క్లబ్‌లను ఏకం చేసి ప్రభుత్వాన్ని ప్రశ్నించాం: సంగీతా బరుహు పిషారోటి**

'జర్నలిస్టుపై దాడి జరిగితే ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేయడం, ప్రెస్‌మీట్ పెట్టడం మాత్రమే సరిపోతుందా? ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సంగీత బరుహు పిషారోటి ప్రశ్నించారు. జర్నలిస్టులపై ఒత్తిళ్లు, కేసులు, దాడులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సమిష్టి పోరాటాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ప్రెస్ క్లబ్‌లు, జర్నలిస్టు సంఘాలు కలిసి కార్యాచరణ రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జర్నలిస్టులపై దాడి జరిగిన ప్రతిసారీ వాస్తవాలను నిర్ధారించి ప్రతికా ప్రకటన విడుదల చేయడం సాధారణంగా మారిందని, అయితే అలాంటి ప్రకటనలతోనే జర్నలిస్టులకు వాస్తవ రక్షణ లభిస్తుందా? అన్నది ఇప్పుడు ఆలోచించాల్సిన ప్రశ్న అన్నారు. జర్నలిస్టుల హక్కులకు సంబంధించిన ఒక కీలక చట్టపరమైన అంశంపై పార్లమెంటరీ స్థాయిలో మార్పులు చోటుచేసుకున్న సందర్భాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ సందర్భంగా తాము 22 ప్రెస్ క్లబ్‌లను ఒక్కతాటి పైకి తెచ్చామని తెలిపారు. అయితే ఆర్‌టిఐ వంటి కీలకమైన సాధనాలు బలహీనపడుతున్న అంశాలపై మాత్రం స్పష్టమైన సమాధానాలు రాలేదని ఆమె పేర్కొన్నారు.




# పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

విస్తృత కార్యాచరణ ప్రణాళిక

హైదరాబాద్ డిక్లరేషన్‌కు ఆమోదం

తెలిపిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛను బలోపేతం చేయడం, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడం లక్ష్యంగా 1860 సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద ఏర్పాటైన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్, ఆదివారం నగరంలో జరిగిన గ్రాండ్ లాంచ్ మీడియా కాన్ క్లేవ్‌లో 'హైదరాబాద్ డిక్లరేషన్'ను ఆమోదించింది. దేశంలోని వివిధ ప్రెస్ క్లబ్‌లతో సమన్వయం చేసుకుంటూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం పత్రికా స్వేచ్ఛను నిరాటంకంగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది ఎదుర్కొంటున్న భద్రత, మానసిక ఆరోగ్యం, ఉద్యోగ సంబంధిత సమస్యలను ప్రధానంగా ప్రస్తావించిన డిక్లరేషన్, ప్రభుత్వం లేదా కార్పొరేట్ సంస్థల వేధింపులకు గురయ్యే జర్నలిస్టులకు న్యాయ సహాయం అందించాలని, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చట్టాలపై న్యాయపరమైన జోక్యం చేసుకోవాలని స్పష్టం చేసింది. వైద్య అత్యవసర పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టులకు తక్షణ సహాయం అందించడంతో పాటు, నిధులు లేని అంశాలపై పనిచేసే జర్నలిస్టులకు రిపోర్టింగ్ ఫెలోషిప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపింది. రాష్ట్ర స్థాయి ప్రెస్ క్లబ్‌ల మధ్య నెట్‌వర్కింగ్, వనరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు, మీడియా రంగ పరిస్థితులపై నివేదికలు, పరిశోధనలు చేపట్టేందుకు, జర్నలిస్టుల వృత్తిపరమైన అభివృద్ధి కోసం శిక్షణలు, సదస్సులు నిర్వహించేందుకు ఫెడరేషన్ కృషి చేయనుంది. విద్యార్థుల్లో మీడియా అవగాహన పెంచేందుకు మీడియా లిటరసీ కోర్సులను రూపొందించి, విద్యా సంస్థల ద్వారా అందించనున్నారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది సంక్షేమం కోసం పెన్షన్ పథకాలు, బీమా సదుపాయాలు, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలను చేపట్టాలని కూడా డిక్లరేషన్‌లో నిర్ణయించారు. నైతిక జర్నలిజం, వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహిస్తూ, పత్రికా స్వేచ్ఛ కోసం పనిచేస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు ఫెడరేషన్ వెల్లడించింది. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ప్రెస్ క్లబ్ హైదరాబాద్, గౌహతి, ముంబై, చండీగఢ్, అగర్తలా, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు ప్రెస్ క్లబ్‌లతో పాటు మధ్యప్రదేశ్ స్టేట్ ప్రెస్ క్లబ్ ఈ ఫెడరేషన్‌లో భాగస్వామ్య సంస్థలుగా ఉన్నాయి. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు గౌతమ్ లాహిరి, ఉపాధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి డిక్లరేషన్‌పై సంతకాలు చేశారు.

# ముగింపేదీ?

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలు ఏప్రిల్ 18న ముగియగా, ఏప్రిల్ 20న ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ వర్షాకాల సమావేశాల విషయంలో మాత్రం పది రోజులు గడిచినా ఆ ఉత్తర్వులు జారీ కాలేదు.

**కీలక బిల్లుపై కేంద్రం వ్యూహమా?**

ఈ ఆలస్యానికి కారణం ఏంటన్న దానిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేకపోయినా, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన చట్ట సవరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకురావడానికి అవసరమైన రాజ్యాంగ సవరణను కేంద్రం ముందుకు తీసుకురావచ్చనే ప్రచారం జరుగుతోంది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ఇప్పటికే ఆమోదం పొందింది. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. దీంతో డీలిమిటేషన్ అం శం కీలకంగా మారింది. బడ్జెట్ సమావేశాల సమయంలోనే దీనిపై చర్చ జరిగినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమకూరకపోవడంతో ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయిందనే ప్రచారం జరిగింది.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం ఒక ప్రత్యామ్నాయ ఫార్ములాపై కసరత్తు చేస్తోందనే చర్చ సాగుతోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను సమాన ప్రాతిపదికన సుమారు 50 శాతం పెంచే ప్రతిపాదనపై ఆలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. అలా చేస్తే డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యం తగ్గకుండా, మొత్తం సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును ముందుకు తెచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు గతంలోనే వినిపించాయి. ఇప్పుడు వర్షాకాల సమావేశాల ప్రొరోగేషన్ ఆలస్యం కావడం ఈ చర్చలకు మరింత ఊతమిస్తోంది. అయినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమీకరించి కీలక బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**తమిళ సిఎం విజయ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ**

డీలిమిటేషన్ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఈనెల 21న మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో ఆయన ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో విజయం సాధించిన కారణంగా ఏ రాష్ట్రానికీ పార్లమెంట్‌లో ప్రాతినిధ్య శాతం తగ్గకుండా కేంద్రం స్పష్టమైన చట్టపరమైన హామీ ఇవ్వాలని విజయ్ కోరారు. మరోవైపు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మాత్రం ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543గానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కనీసం వచ్చే 25 ఏళ్లపాటు సీట్ల సంఖ్యను మార్చకూడదని కేంద్రాన్ని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్‌పై కేంద్రం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుంది? మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై ఏదైనా కొత్త ఫార్ములాను ముందుకు తెస్తుందా? ప్రత్యేక సమావేశానికి తెరలేపుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ప్రయత్నిస్తున్నారా?

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించుకునేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇంకా ఆ 'అపవిత్రమైన' మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా అని నిలదీసింది. లోక్‌సభ, రాజ్యసభలు నిరవధికంగా వాయిదా పడి పది రోజులు గడిచినా, అధికారిక ముగింపు గురించి ఇంకా ఎటువంటి సమాచారం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదరి జైరామ్ రమేశ్ ఎత్తిచూపారు. '2015లో వర్షాకాల సమావేశాల విషయంలో ఈ వ్యవధి 28 రోజులు, 2021లో 20 రోజులు ఉన్న మాట వాస్తవమే. కానీ అప్పుడు ఎటువంటి దుర్మార్గమైన ఎత్తుగడలు జరగలేదు' అని ఆదివారం ఎక్స్‌లో రమేశ్ పేర్కొన్నారు. ప్రక్రియను వివరించడానికి, ఎం.ఎన్. కౌల్, ఎస్.ఎల్. షక్ధర్ రాసిన (పార్లమెంట్ విధానాలు, కార్యకలాపాలు) పుస్తకంలోని ఒక పేజీ స్క్రీన్ షాట్‌ను కూడా ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. అయితే 'కళంకిత' పద్ధతిలో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు జరిగిన ప్రయత్నం విఫలమవ్వడం, తద్వారా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టలేకపోవడం ప్రతిపక్షం సాధించిన 'విజయం' అని కాంగ్రెస్ గతంలో పేర్కొంది. రాబోయే 25 ఏళ్లపాటు లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య ను 543 సీట్ల వద్దే స్థిరీకరించాలని, అలాగే 2029 లోక్‌సభ ఎన్నికల నుండి మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ గత వారం డిమాండ్ చేసింది. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

# చంద్రశేఖర్ మృతి పట్ల అరసం సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గండెల చంద్రశేఖర్ అకస్మిక మృతిపట్ల అరసం రాష్ట్ర కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎల్, ఉపాధ్యక్షులు బి.నాగభూషణం, కమలాదేవి, సునీత గండెల చంద్రశేఖర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# రాజకీయాలే కారణం (మొదటి పేజీ తరువాయి)

అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాలకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రులు చేసే పర్యటనలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరితో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. 'కేంద్రానికి నచ్చిన వారికి అనుమతులు ఇవ్వడం, ఇతరులకు నిరాకరించడం సరైంది కాదు. అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిని కలిసి తమ రాష్ట్రాల్లో పరిశ్రమలు పెట్టాలని, పెట్టుబడులు తీసుకురావాలని ముఖ్యమంత్రులు ఆహ్వానిస్తారు. ఈ పర్యటనల ద్వారా వచ్చే పెట్టుబడులు కేవలం రాష్ట్రానికే కాక, దేశానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. అలాంటి కీలకమైన పర్యటనను అడ్డుకోవడం ద్వారా కేంద్రం దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోంది' అని ఖర్గే తన ప్రకటనలో వ్యాఖ్యానించారు.

# ప్రపంచవ్యాప్తంగా ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రగతిపై ప్రవాసులతో వారు చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసులు కూడా భాగస్వాములు కావాలని వారు స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు కోరారు.

# శ్రీలంకతో రెండో టెస్టు.. పడిక్కల్ సెంచరీ

## భారత్ 300/5.. ముగిసిన తొలి రోజు ఆట




కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసింది. తొలి రోజు ఆట పూర్తయ్యే సమయానికి ఇండియా 300 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. భారత యువ ఆటగాడు దేవ్‌దత్ పడిక్కల్ తొలి రోజు ఆటలో సెంచరీ సాధించాడు. పడిక్కల్కు వరుసగా ఇది రెండో సెంచరీ. శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో కూడా అతడు సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. 193 బంతుల్లో అతడు 117 పరుగులు చేశాడు. కేశర నువాంత బౌలింగ్లో బౌల్ అయ్యాడు. ఆట ముగిసే సమయానికి ధ్రువ్ జరెల్ 7 పరుగులతో, సారాంశ్ జైన్ 4 పరుగులతో క్రీజులో ఉన్నారు. మ్యాచుకు ముందు టాస్ గెలిచిన ఇండియా బ్యాటింగ్ ఎంచుకుంది. యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా బరిలోకి దిగారు. 11ఓవర్లకు 37పరుగుల వద్ద ఇండియా తొలి వికెట్ కోల్పోయింది. 18 పరుగులు చేసిన రాహుల్.. లాహిరు కుమార బౌలింగ్లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం దేవ్‌దత్ పడిక్కల్ బ్యాటింగ్‌కు దిగాడు. తర్వాత యశస్వి జైశ్వాల్ 45 పరుగులకు ఔటయ్యాడు. 17వ ఓవర్లో ఇండియా 66 పరుగుల వద్ద అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో జైశ్వాల్ బౌల్డయ్యాడు. తర్వాత కెప్టెన్ శుభ్మన్ గిల్ బ్యాటింగ్‌కు దిగాడు. తర్వాత గిల్, పడిక్కల్ నెమ్మదిగా ఆడారు. గిల్ 99 బంతుల్లో అర్థసెంచరీ పూర్తిచేసుకున్నాడు. 108 బంతులకు అదే 50 పరుగులకు ఔటయ్యాడు. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో నిరోషన్ డిక్వెల్లాకు క్యాచ్ ఇచ్చి, వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ 3 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు.అనంతరం రవీంద్రజడేజా బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ సమయంలో 58 ఓవర్లు పూర్తి కాగా, ఇండియా స్కోరు 208/3గా ఉంది. క్రీజులో ఉన్న పడిక్కల్, జడేజా బాధ్యతాయుతంగా ఆడారు. పడిక్కల్ 168 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇండియా స్కోర్ 281 పరుగుల వద్ద ఉండగా నాలుగో వికెట్ కోల్పోయింది. పడిక్కల్ 117 పరుగుల వద్ద ఔటయ్యాడు. ధ్రువ్ జురెల్ బ్యాటింగ్‌కు వచ్చాడు. రవీంద్ర జడేజా 43 పరుగులు చేసి, అసిత ఫెర్నాండో బౌలింగ్లో క్లీన్ బౌల్ అయ్యాడు. సారాంశ్ జైన్ బ్యాటింగ్‌కు దిగాడు. ఆట ముగిసే సమయానికి భారత్ 85 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి, 300 పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో మూడు వికెట్లు తీయగా, లాహిరు కుమార, కేశర నువాంత్ ఒక్కో వికెట్ తీశారు.

# భారత్‌కు మళ్లీ నిరాశే

## హాకీ ప్రపంచ కప్‌లో నెదర్లాండ్స్ చేతిలో ఓటమి



పురుషుల హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు మళ్లీ నిరాశే. మెగా టోర్నీలో ఐదు దశాబ్దాల తర్వాత చాంపియన్‌గా నిలవాలని ఆశించిన జట్టు పోరాటం సెమీఫైనల్ చేరకుండానే ముగిసింది. శనివారం కచ్చితంగా నెగ్గాల్సిన రెండో రౌండ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్సీలోని టీమిండియా 1–3తో ఒలింపిక్ చాంప్ నెదర్లాండ్స్ చేతిలో పరాజయం పాలైంది. ఆఖరి 10 నిమిషాల్లో చేసిన పొరపాట్లు మన జట్టును దెబ్బతీశాయి. తొలి రెండు క్వార్టర్స్‌లో డిఫెండర్లు డచ్ దాడిని సమర్థవంతంగా అడ్డుకోవడంతో ఫస్టాఫ్ 0–0తో ముగించింది. కానీ, ద్వితీయార్థంలో డచ్ టీమ్ వరుస ఫీల్ గోల్స్తో విరుచుకుపడింది. 41వ నిమిషంలో టెల్గెన్క్యాంప్, 51వ నిమిషంలో హుడెమేకర్స్ చెరో గోల్ కొట్టగా.. తర్వాతి నిమిషంలోనే లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ డ్రాగ్ ఫ్లిక్తో గోల్ చేసి భారత శిబిరంలో ఆశలు రేపాడు. కానీ, 55వ నిమిషంలో థిజ్స్ వాన్ డామ్ సునాయాస గోల్ కొట్టి నెదర్లాండ్స్ విజయాన్ని ఖాయం చేశాడు. దాంతో, హాకీ ప్రపంచకప్ చరిత్రలో భారత్ ఒక్కసారి కూడా ఓడని రికార్డును డచ్ టీమ్ కొనసాగించింది. కాగా, మహిళల టోర్నీలో ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ పోటీ పడనుంది. ఇందులో గెలిస్తే సెమీస్ చేరుతుంది.


INDIA

## ఆసియా గేమ్స్‌కు 492 మంది

వచ్చే నెల జపాన్ ఆతిథ్యం ఇచ్చే ఆసియా గేమ్స్ కోసం కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ 492 మందితో కూడిన భారత క్రీడాకారుల బృందానికి ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో 265 మంది పురుషులు, 227 మంది మహిళా అథ్లెట్లు ఉన్నారు. అథ్లెటిక్స్‌లో అత్యధికంగా 73 మంది ఎంపికయ్యారు. వ్యక్తిగత క్రీడాంశాల్లో షూటింగ్‌లో 30, బ్యాడ్మింటన్‌లో 20, రెజ్లింగ్‌లో 16, బాక్సింగ్‌లో 11 మంది పోటీలో నిలిచారు.


# ఆరోగ్యం

## 'ఎఐ'తో వ్యాధి నిర్ధారణ పెరుగుతున్న కొత్త ట్రెండ్




ఇంటర్నెట్‌లో వ్యాధి లక్షణాలను వెతకడం, చాట్‌జిపిటి వంటి కృత్రిమ మేధ(ఎఐ) సాధనాలను అడిగి వ్యాధిని నిర్ధారించుకోవడం ఇప్పుడు సాధారణ అలవాటుగా మారుతోంది. ఈ కొత్త ధోరణి ప్రస్తుత వ్యవస్థలోని కీలక సమస్యను గుర్తుచేస్తున్నది. ఆరోగ్యం గురించి అవగాహన పెరగడం మంచిదే. కానీ ఆ అవగాహన వైద్యుడి స్థానాన్ని ఆక్రమించినప్పుడు ప్రమాదం మొదలవుతుంది. ఛాతీలో స్వల్పంగా నొప్పి వస్తే, ఇంటర్నెట్‌లో వెతికిన వ్యక్తికి గుండె జబ్బు నుంచి కేన్సర్ వరకు ఎన్నో భయంకరమైన ఫలితాలు కనిపించవచ్చు. అదే నొప్పి ఆందోళన, కండరాల సమస్య లేదా ఇతర సాధారణ కారణాల వల్ల కూడా రావచ్చు. ఎఐ కూడా అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి సంభావ్య కారణాలను చెప్పగలదు. కానీ రోగిని ప్రత్యక్షంగా పరీక్షించడం, అతని గత వైద్య చరిత్రను అర్థం చేసుకోవడం, శారీరక పరీక్ష చేయడం, అవసరమైన పరీక్షలను ఎంచుకోవడం వంటి పనులకు వైద్యనిపుణుడి నిర్ణయం అవసరం. ఇక్కడ మరో ప్రమాదం కూడా ఉంది. ఎఐ చెప్పిన సమాచారాన్ని రోగి తుది నిర్ధారణగా భావిస్తే రెండు రకాల నష్టం జరుగుతుంది. ఒకవైపు లేని వ్యాధి ఉందని భయపడవచ్చు. మరోవైపు నిజం గా ప్రమాదకరమైన లక్షణాలను సాధారణ సమస్యగా భావించి చికిత్స ఆలస్యం చేయవచ్చు. మందుల విషయంలో స్వయంగా 'ఎఐ' సలహా తీసుకుని డోసులు మార్చడం లేదా చికిత్స మొదలుపెట్టడం తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చు. ఒక్కోసారి రోగి తన అనుభూతిని వైద్యపరమైన పదజాలంలో చెప్పలేకపోవచ్చు. అలాగే 'ఎఐ' కూడా రోగి ముఖ కవళికలు, భయం, స్వరం, శారీరక స్థితి వంటి అనేక సంకేతాలను పరిమితంగానే అర్థం చేసుకుంటుంది. 'ఎఐ'ని వైద్యుడికి ప్రత్యామ్నాయంగా కాకుండా సహాయక సాధనంగా మాత్రమే చూడాలి. కానీ వ్యాధి నిర్ధారణ, మందుల ఎంపిక, చికిత్స మార్పు వంటి నిర్ణయాలను వైద్య నిపుణుడికే వదిలేయాలి. వైద్యరంగంలో 'ఎఐ' విస్తరిస్తున్న కొద్దీ రోగుల ఆరోగ్య డేటా గోప్యత, 'ఎఐ' నిర్ణయాల్లో పారదర్శకత, తప్పిదాలపై బాధ్యత, అల్గారిథమ్‌లలో పక్షపాతం నియంత్రణ కూడా అంతే ముఖ్యమవుతాయి. సాంకేతికత వైద్యుడి చూపును పదును పెట్టాలి, అంతేగానీ, వైద్యుడి స్థానాన్ని ఆక్రమించకూడదు.

## చికిత్స కంటే ముందు జాగ్రత్తే కీలకం



భారత ఆరోగ్య వ్యవస్థలో రాబోయే మార్పు కేవలం కొత్త ఆసుపత్రులు, వైద్యులు, అత్యాధునిక యంత్రాల పెరుగుదలతో పరిమితం కాదు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే విధానం నుంచి, వ్యాధి రాకముందే దాని ముప్పును గుర్తించి అడ్డుకునే విధానానికి మారాల్సిన అవసరం పెరుగుతోంది. మారుతున్న జీవనశైలి, తద్వారా సంక్రమిస్తున్న వ్యాధులు, చికిత్స ఖర్చులు, వృద్ధుల సంఖ్య ఈ మార్పును అనివార్యం చేస్తున్నాయి. మధుమేహం, అధికరక్తపోటు, గుండె జబ్బులు, కేన్సర్, మూత్రపిండాల సమస్యలు, కాలేయ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలు ఒక్కరోజులో పుట్టవు. శరీరంలో ఏళ్ల తరబడి నెమ్మదిగా మార్పులు జరుగుతాయి. రక్తంలో చక్కెర పెరగడం, కొలెస్ట్రాల్ అధికం కావడం, కొవ్వు కాలేయం, సరిహద్దు స్థాయిలో రక్తపోటు వంటి సంకేతాలు భవిష్యత్తులో పెద్ద సమస్యలకు హెచ్చరికలు కావచ్చు. వాటిని తొలిదశలో గుర్తిస్తే జీవనశైలిలో మార్పులు, ఆహారనియంత్రణ, వ్యాయామం, అవసరమైన మందులతో పరిస్థితిని అదుపులో ఉంచే అవకాశం ఉం టుంది. ఇక్కడ ఆర్థిక కోణం కూడా కీలకం. ముదిరిన వ్యాధికి చికిత్స లక్షల రూపాయలు ఖర్చు చేయించవచ్చు. అదే వ్యాధి ముప్పును ముందే గుర్తించడానికి చేసే ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్, జీవనశైలి సలహాలు తక్కువ ఖర్చుతో పూర్తవుతాయి. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటే కుటుంబాల పొదుపు కరిగిపోతుంది. ఆరోగ్య వ్యయం పెరిగితే బీమాసంస్థలు, ఉద్యోగసంస్థలు, ప్రభుత్వాలపై కూడా భారం పెరుగుతుంది. అందువల్ల నివారణ వైద్యం వ్యక్తిగత ప్రయోజనంతో ఆగిపోదు.. అది దేశ ఆర్థిక ఉత్పాదకతతో ముడిపడుతుంది. భారత జనాభా ప్రస్తుతం యువత అధికంగా ఉన్నప్పటికీ, రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. నివారణ వైద్యాన్ని ఇప్పటి నుంచే బలోపేతం చేయకపోతే భవిష్యత్తులో ఆసుపత్రులు, వైద్య సిబ్బంది, దీర్ఘకాలిక చికిత్సా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. అందుకే ఆరోగ్య విధానం 'జబ్బు వస్తే ఆసుపత్రికి వెళ్లడం' అనేదశను దాటి, ప్రమాద అంచనా, ముందస్తు పరీక్ష లు, వ్యక్తిగత ఆరోగ్య ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ వైపు సాగాలి. భవిష్యత్తు ఆరోగ్య విధానానికి అసలు ప్రశ్న 'ఎన్ని వ్యాధులను ఆసుపత్రి దాకా రాకముందే అడ్డుకోగలిగాం?' అనేదిగా మారాలి.

## కేన్సర్‌పై ఆందోళన



దేశ వ్యాప్తంగా కేన్సర్ కేసులు పెరడం ఆందోళన కలిగిస్తున్నది. చివరికి సుప్రీంకోర్టు సైతం ఈ అంశంపై స్పందించింది. కేన్సర్‌ను 'నోటిఫయబుల్ డిసీజ్'గా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని ఇంకా నోటిఫై చేయని 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ప్రస్తుతం దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 17 చోట్ల కేన్సర్‌ను ఇప్పటికే నోటిఫయబుల్ వ్యాధిగా ప్రకటించారు. దేశంలో కేన్సర్ కేసులపై సమగ్ర సమాచారం అందుబాటులో లేకపోవడమే ఈ ఆదేశం వెనుక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నిర్వహిస్తున్న నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ దేశ జనాభాలో సుమారు 10శాతానికే సమాచారం సేకరిస్తోందని, గ్రామీ ణ ప్రాంతాల్లో ఈ కవరేజీ కేవలం ఒక శాతానికి పరిమితమైందని ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం పేర్కొంది. ఒకవ్యాధిని నోటిఫయబుల్‌గా ప్రకటిస్తే, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యులు, ఇతర ఆరోగ్యసంస్థలు గుర్తించిన కేసులను సంబంధిత అధికారులకు తప్పనిసరిగా తెలియజేయాలి. దీనివల్ల కేన్సర్ కేసులపై మరింత సమగ్ర గణాంకాలు లభిస్తాయి. వ్యాధి వ్యాప్తి, వయస్సు, ప్రాంతం, కేన్సర్ రకాలు వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం లభించడంతో ముందస్తు గుర్తింపు, చికిత్సా సదుపాయాల ప్రణాళిక, ఆరోగ్య విధానాల రూపకల్పన మెరుగుపడతా యి. మన దేశంలో నోటిఫయబుల్ వ్యాధులకు ఒకే జాతీయ జాబితా లేదు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ పరిధిలోని పరిస్థితులకు అనుగుణంగా వ్యాధులను నోటిఫై చేస్తాయి. క్షయ, డెంగీ, మలేరియా, కలరా, పోలియో వంటి వ్యాధులను అనేక రాష్ట్రాలు నోటిఫై చేశాయి. 2024లో పాముకాటు, 2025లో మానవ రేబిస్‌ను కూడా కొన్ని పరిధుల్లో నోటిఫయబుల్ వ్యాధులుగా చేర్చారు.

# కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి యాజమాన్యం ఈనెల 27 వరకు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే అన్ని జాతీయ కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మె చేయడం తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనిముట్ల ఏర్పాటు చేయడంలో సింగరేణి యాజమాన్యం విఫలమయిందని ఆరోపించారు. అరిగిపోయిన పనిముట్లతో పనులు చేయలేక శరీరంపై భారం పడుతూ కార్మికులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అండర్ గ్రౌండ్‌లో గాలి అందడం లేదని, దానివల్ల భూపాలపల్లి ఏరియాలోని కేటీకే వన్ ఇంక్లైన్లో గోపి అనే కార్మికుడు మరణించాడన్నారు. సింగరేణిలో రాజకీయ కారణంతోనే ఒప్పందాలు అమలు కావడం లేదని చెప్పారు. డిస్మిస్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి యాజమాన్యం ముందుకు రావడం లేదన్నారు. డిస్మిస్ కార్మికులకు సంబంధించి ఏడుగురితో కమిటీ వేయడం జరిగిందని, మెడికల్ బోర్డు కు సంబంధించి నెలకొకసారి పాత విధానంలో కొనసాగిస్తామని ఈనెల 25, 26న మెడికల్ బోర్డు ఉండబోతుందన్నారు. మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్‌లు అండర్ గ్రౌండ్ అన్ ఫీట్ అయితే సూటబుల్ జాబు ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. క్యాడర్ స్కీం సమస్యలు ఎస్‌డివిల్ ఆపరేటర్స్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎగ్జామ్స్, జూనియర్ ఆపరేటర్ నియామకాలు ఏర్పాటు చేయాలని, ఆరోగ్యం పట్ల కార్మికులకు ప్రధాన ఆసుపత్రులకు రిఫరల్ చేస్తే ఐదు లక్షలు ఖర్చు అయితే 3 లక్షలు యాజమాన్యం రెండు లక్షలు కార్మికుడు కట్టడాన్ని వ్యతిరేకించామన్నారు. 31 డిమాండ్లతో యాజమాన్యానికి వివరించడం జరిగిందని అందులో 20 డిమాండ్లను అంగీకరించిందని, యాజమాన్యం కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే అన్నిసంఘాలను కలుపుకొని సమ్మెకు వెళ్లబోతున్నామని, యాజమాన్యంతో కొట్లాడి హక్కులను సాధించేంత వరకు పోరాడుతామని తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీలు జి.సుధాకర్‌రెడ్డి, జి.శ్రీనివాస్, ఎండి.ఆసిఫ్ పాషా, బ్రాంచి నాయకులు నూ కల చెంద్రమౌళి, తాళ్ళ పాశం, నాయకులు కృష్ణమూర్తి, గణేశ్, హైమద్, వంశీకృష్ణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త లేబర్ కోడ్‌ల రద్దుకు పోరుబాట

### ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, వీటి రద్దుకు పోరుబాట తప్పదని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పేర్కొన్నారు. సోమవారం నుంచి జరుగనున్న ఎఐటియుసి ఖమ్మం జిల్లా 17వ మహాసభల సందర్భంగా ఆదివారం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సెమినార్ నరసింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుండి మహాసభల ప్రాంగణం వరకు భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో నరసింహ మాట్లాడుతూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం అయిందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టా లు తీసుకురావడంతో శ్రామికుల శ్రమ మరింత దోపిడికి గురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనధికారికంగా రోజుకి 10నుండి 16గంటలు పని చేయించుకుంటున్నారని, ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగిస్తే కార్మికుల జీవితాలు బుగ్గిపాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వాలు కార్మికులకు ఏ చట్టాన్ని దయతోనో వారి సంక్షేమం కొరకు ఇవ్వలేదని, దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన హక్కులన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాలతో ప్రస్తుతం సంఘటిత రంగంలో కూడా అసంఘటి తరంగాన్ని తలపించేలా వేతనాలు ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యోగ భద్రత, పని గంటలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై లేబర్ కోడ్‌లు ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, బి.జి.క్లెమెంట్, జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, జిల్లాకార్యదర్శి టి.రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, వేము రాంబాబు, మహాదేవలక్ష్మి, జిల్లా కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, బికెఎంయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, ప్రజాసంఘాల నాయకులు సముద్రాల సుధాకర్, తడికమళ్ల యోబు, రంజాన్‌బీ, ఊడల కృష్ణమూర్తి, వజీర్ మియా, టి.లక్ష్మి, సత్తుపల్లి, సుధాకర్, శ్రీనివాసరావు, మల్లైకా, రామారావు తెలగారపు, కంచి శ్రీను, వల్లెపు శ్రీను, పోలేటి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి సత్యావతి, పిల్లి బుచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఓమయ్య




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వై.ఓమయ్య అన్నారు. ఆదివారం ఎఐటియుసి కార్యాలయంలో ఆటో కార్మిక జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఓమయ్య, టియుసిఐ నాయకులు డి. గంగాధర్, టిఆర్‌టియు నాయకులు బి. శ్రీనివాస్, యుటియుసి నాయకులు కటారి రాములు, బిఆర్‌టియు నాయకులు అబ్దుల్ జబ్బార్ హాజరయ్యారు. జాయింట్ యాక్షన్ కమిటీఇచ్చిన పిలుపులో భాగంగా నిజామాబాద్ నగరంలో ఆటో ప్రదర్శన నిర్వహించి ధర్నా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని, ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో చార్జీలు పెంచాలన్నారు. ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఓలా, ఉబర్, రాపిడో ద్వారా నడుస్తున్న టూ వీలర్లను నిషేదించాలన్నారు. రోజువారిగా ప్రజలకు సౌకర్యం కల్పించే ఆటో డ్రైవర్లకు ఈ చలాన్లు నుంచి మినహాయించాలని, యాక్సిడెంట్ బీమాను కొనసాగించి సాధారణ మరణాలకు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి హనుమాండ్లు, జెఎసి నాయకులు ఫెరోజ్, కిషన్, షాదుల్ భాష, అబ్దుల్ గఫార్, షేక్ నబి తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీలలో పోస్టులు భర్తీచేయాలి

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలో యూనివర్సిటీలలో సుమారు 70 శాతం టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే పరిస్థితి ఏర్పడుతోందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్ అన్నారు. తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం ద్వారా విద్యను మరింత కార్పొరేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను దూరం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ వార్షికోత్సవ ముగింపు సభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాట మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు 90 వేల పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రహమాన్ డిమాండ్ చేశారు. పల్లె నుంచి పట్టణం వరకు గంజాయి వంటి మత్తు పదార్థాల విస్తరణ ఆందోళనకరంగా మారిందన్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో హత్యలు, దోపిడీలు, మహిళలపై దాడులు వంటి నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల ప్రభావం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్ల భవనాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున వాటిని వెంటనే పరిశీలించి, అవసరమైన చోట పాత భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని, విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న ఎంఇఒ, టీచర్, డిఇఒ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణ, విద్యార్థుల హక్కులు, సామాజిక సమస్యలపై సమగ్ర చర్చ జరిగి, భవిష్యత్ విద్యార్థి ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించేందుకు హనుమకొండ వేదిక కానుందని రహమాన్ తెలిపారు. ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎఐఎస్‌ఎఫ్ 90వ వసంతాల వార్షికోత్సవ ముగింపు సభలను విజయవంతం చేయాలని విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, కేయూ ఉపాధ్యక్షులు వంశీ, యాస్మిన్, సహాయ కార్యదర్శి అబ్బరబోయిన నాగరాజు, అనూష, కందకట్ల అజయ్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలం

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దేశంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు, కార్పోరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసిందని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవనంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడెల్లి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. విద్య, వైద్యం ప్రైవేటీకరణను, కార్పోరేటీకరణను వ్యతిరేకిస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరగనున్న ఎఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయడానికి సూర్యాపేట జిల్లా నుండి యువకులు, విద్యార్థులు వందలాదిగా తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, ఉపాధ్యక్షుడు దేగ వీరన్న, బూర సైదులు, బాలెబోయిన మహేష్, గుండగాని శ్రీను, సురేందర్, కడారు మధు తదితరులు పాల్గొన్నారు.



## ఎఐటియుసి పోరాట ఫలితంగా పెరిగిన హమాలీ రేట్లు




ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; ఎఐటియుసి పోరాట ఫలితంగానే హమాలీ రేట్లు పెరిగాయని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. ఆదివారం సిమెంట్ యాజమాన్యం ఎఐటియుసి నాయకుల మధ్య జరిగిన చర్చల్లో హమాలీ రేట్లను పెంచుకోవడం జరిగింది. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ ఒప్పందంలో సిమెంట్ ఎగుమతిపై రూపాయి, ఐరన్‌పై పది రూపాయలు, ఐరన్ డైరెక్ట్ ఎగుమతి ఐదు రూపాయలు పెంచుకోవడం జరిగిందని, దూరాన్ని బట్టి హమాలీ రేట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు రామస్వామి తెలిపారు. పెరిగిన రేట్లు రెండు సంవత్సరాల పాటు అమల్లో ఉంటాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసిడివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరు వెంకట్‌రాములు, సిమెంట్ యాజమాన్యం మారుపాకల సురేష్‌గౌడ్, ఆనంద్, బాలస్వామి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మల్లయ్య, హమాలీ సంఘం గౌరవాధ్యక్షులు హర్యానాయక్, అధ్యక్షులు దస్రు, రాములు, నరేష్, శంకర్, రెడ్య తదితరులు పాల్గొన్నారు.

## రూ. 15 వేల కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన దాదాపు రూ.15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య డిమాండ్ చేశారు.ఫీజుల బకాయి.. బిజెపిలడాయి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24,25 తేదీలలో హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద బిజెపిరాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నిరసన దీక్ష చేపట్టనున్నారని తెలిపారు.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజుల బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తూ దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడుతున్న పేద,మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు తమ చదువులను కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మెట్ట పంటలకు ఊపిరి పోసిన వర్షం



ప్రజాపక్షం/నిడమనూరు: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం తెల్లవారుజామున ఓ మోస్తారుగా కురిసిన వర్షం మండలంలో సాగుచేసిన మెట్ట పంటలకు ఊపిరి పోసినట్లు అయింది,సీజన్ ప్రారంభం నుండి సరైన వర్షాలు లేక వర్షాభావ పరిస్థితులు నీటి ఎద్దడి మూలంగా అనేక మంది రైతులు ఆరుతడి మెట్ట పంటల ను సాగుచేశారు మెట్ట పంటలను సాగు చేసినప్పటికిని వర్షా బావ పరిస్థితుల మూలంగా పంటలు ఎదుగు బొదుగు లేకుండా సాగుచేసిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి,ఈ తరుణంలో ఆదివారం తెల్లవారుజామున ఈ సీజన్ మొత్తంలోనే ఓ మోస్తారుగా కురిసిన వర్షంతో అటు మెట్ట రైతులు, ఇటు వరి సాగు చేసిన రైతులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్ష భావం మూ లంగా బోరు బావులు సైతం ఇంకి పోవడంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి వందలాది ఫీట్ల లోతు బోరుబావులుతొవ్వుతున్నారు. అయినప్పటికిని ఫలితం లేకపోవడంతో బ్రతుకుతెరువు కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి భూగర్భ జలాలు వృద్ధి పెంపొందించేందుకు ఆయకట్టు,నాన్ ఆయకట్టు ప్రాంతాల్లోని చెరువులు నింపేందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని రైతులు,రైతు సంఘాల నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## 27న లక్ష గొంతుకల పొలికేక




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: బుల్లెట్ ట్రైన్ సూర్యాపేటకు సాధించుకోవాలంటూ ఈనెల 27 న నిర్వహించ తలపెట్టిన లక్ష గొంతుకల పొలికేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటి కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బుల్లెట్ ట్రైన్ దీక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో పొలికేక కరపత్రాన్ని ఆవిష్కరిం చి మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌ను అవసరం లేనిచోటకు మార్చి సూర్యాపేట జాతీయ రహదారి 65 వెంట ఉన్న పట్టణాల కు తీవ్ర నష్టం కలిగిస్తున్న పాలకులను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అ ఖిలపక్షాల నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీ నివాస్ గౌడ్, చల్లమల్ల నరసింహ, మట్టిపెల్లి సైదు లు,పేర్ల నాగయ్య,కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

**10వ రోజు దీక్షలో అడ్తి కమీషన్ వ్యాపారులు**

బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పదవ రోజు అడ్తి కమీషన్ వ్యాపారులు ఆదివారం పాల్గొన్నారు. దీక్షలో తుడి విద్యాసాగర్, కొట్టముక్కల రవి, నరసింహస్వామి, సోమేశ్వరరావు, ఇమ్మడి శ్రీనివాస్, బోనగిరి వెంకన్న, చల్ల సత్యనారాయణ,కందికొండ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## కార్యకర్తకు కోదాడ ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాపక్షం/నడిగూడెం: మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన వట్టికూటి గురవయ్యగౌడ్ గీతకార్మిక వృత్తి చేస్తూ గత కొద్ది రోజుల క్రితం తాడిచెట్టుపై నుండి కిందపడి నడుము పూర్తిగా విరిగిపోవడం వల్ల అనారోగ్యానికి గురై మంచాన పడ్డాడు. అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆదివారం వట్టికూటి గురవయ్యను పరామర్శించారు. గురవయ్యకు తగిన ఆర్థికసాయం అందజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి, వల్లాపుర సర్పంచ్ కేసగాని సరిత, శెట్టి సతీష్, దర్ర జగదీష్, పొలంపల్లి వీరయ్య పాల్గొన్నారు.

## నల్లగొండను అందమైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రూ.1,400 కోట్లతో అభివృద్ధి పనులు.* రూ.10 కోట్లతో త్వరలో లైబ్రరీ పనులకు శంకుస్థాపన
కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ: పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.ఆదివారం పట్టణంలోని నల్లగొండ క్లబ్‌లో రూ. 2 కోట్లతో నిర్మించిన అదనపు గదులు,కాన్ఫరెన్స్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ క్లబ్‌లో మంచి వాతావరణం ఉందని,పట్టణ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.పట్టణ ప్రజలకు 24 గంటల తాగునీరు అందించేందుకు రూ.125 కోట్లతో పనులు చేపట్టామని,ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం పూర్తి చేయడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నిధులు సమకూర్చుకుని పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ. 900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని,పట్టణంలో ట్రాఫిక్ ప్రమాదాలను తగ్గించడంతో పాటు నల్లగొండను అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని, సుమారు రూ. 1,400 కోట్ల విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని చెప్పారు. క్లబ్ అభివృద్ధికి పక్కనే ఉన్న ఎకరం స్థలాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,స్థానిక సంస్థల





ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,ఆర్‌డిఒ వై. అశోక్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్‌పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ ఏదుల శ్రీధర్ రెడ్డి, గుమ్మల జానకి రెడ్డి,క్లబ్ సెక్రటరీ చల్ల వెంకటరమణ,కాసర్ల వెంకటరెడ్డి, క్లబ్ మెంబర్లు డాక్టర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## నిఖార్సైన కమ్యూనిస్టు నాయకుడిని కోల్పోయాం

గోరేటి రాములు మృతి కార్మిక లోకానికి తీరని లోటు :పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/నాంపల్లి: కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అచంచల నిబద్ధతతో, ప్రజా ఉద్యమాల్లో ని కార్సైన కమ్యూనిస్టు నాయకుడిగా పనిచేసిన గో రేటి రాములు మృతి సిపిఐకి,కార్మిక లోకానికి తీరని లోటని సిపిఐ జాతీయ కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డిఅన్నారు.ఆదివారం మండలంలోని పసునూరు గ్రామంలో ఎఐటి యుసి అధ్యక్షుడు గోరేటి రాములు పార్థివదేహానికి నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికం టి సత్యం,సిపిఐ సీనియర్ నాయకుడు బుజ్జిని రత్నాకర్‌రావు,రాష్ట్ర నాయకుడు గోద శ్రీరాములు,యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డిలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఎఐఎస్ఎఫ్ నాయకుడిగా పనిచేసిన రాములు అంచెలంచెలుగా ఎదిగి నాంపల్లి మండలంలో పార్టీ నాయకుడిగా తనదైన ముద్ర వేశారని అన్నారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోఎఐటియుసి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు.పార్టీ నిబద్ధత, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగా జీవితాంతం పనిచేసిన రాములు సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ అభ్యున్నతికి,సమసమాజ నిర్మాణం కోసం గోరేటి రాములు నిరంతరం కృషి చేశారని అన్నారు.ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.రాములు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇ చ్చారు.అనంతరం ఆయన కార్యక్రమంలోసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యచారి,నలపరాజు రామలింగం,మాజీ జెడ్‌పిటిసి ఏవీ రెడ్డి,ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్ మండల కార్యదర్శి సూదనబోయిన రమేష్,సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,నాయకులు ఉజ్జిని యుగేందర్‌రావు,బి.జగన్,గిరి రమ,కలకొండ సంజీవ,స్థానిక సర్పంచ్ కాశిమల్ల గోవర్ధన్,మండల కార్యవర్గ సభ్యులు పల్లె సైదులు, కోరే సత్తయ్య,ఊరుపాక వెంకటయ్య,దండిగ వెంకటయ్య, నేరళ్ల సైదులు,ప్రజా సంఘాల నాయకులు,కుటుంబసభ్యులుపాల్గొన్నారు.


## పాలిటెక్నిక్‌లను నిర్వీర్యం చేసే కుట్ర తిప్పికొట్టాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి
జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు




ప్రజాపక్షం/మర్రిగూడ: పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయడం ద్వారా సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ విద్యను విద్యాశాఖ పరిధిలోనే కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఆదివారం మర్రిగూడ మండలం ఖుదాబక్ష్‌పల్లిలో జరిగిన ఆసంఘం గ్రామ శాఖ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.పాలిటెక్నిక్ కళాశాలల నిర్వహణను శక్తి శాఖలో విలీనం చేయడం సరైన నిర్ణయం కాదని,దీనివల్ల సాంకేతిక విద్యా రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. యువతకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంతో పాటు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశానికి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్,సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్,మండల అధ్యక్షుడు గుణముని సాయికుమార్,నాయకుడు ఏరజాల జగన్నాథం ,శ్రీకాంత్, పవన్,నాగరాజు,ఐ.కార్తీక్,గోపాలకృష్ణ,జయంత్,ఆర్.దినేష్,కే. రమేష్,పి.శివ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడిగా పవన్,కార్యదర్శిగా గోల్కొండ నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించిన గ్రామ దేవతల బోనాల మహోత్సవంలో ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మన ప్రాచీన సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత సమాజ ంపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రజాప్రతినిధు లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలుతదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వెంచర్ల పాత్ర కీలకం

ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రజాపక్షం/నకిరేకల్ : ప్రాంతీయ అభివృద్ధిలో రియల్ ఎస్టేట్ వెంచర్ల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నోముల గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటైన హరిహర అవెన్యూ లేఅవుట్ వెంచర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన హరిహర అవెన్యూ కొనుగోలుదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వేగంగా అభివృద్ధి చెందాలనిఆకాంక్షించారు.అలాగే వెంచర్ నిర్వాహకులకు నోముల గ్రామ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందజేయాలని సూచించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోట్ట బత్తుల జయమ్మ వెంకటేశం, పిఏసిఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాధగోని కొండయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పంతంగిలో దారుణ హత్య

అక్రమ సంబంధమే కారణామా?
మృతుడి భార్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రజాపక్షం/చౌటుప్పల్:చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ పరిధిలోని శెనగల గుట్ట వద్ద ఓ వ్యక్తి దారుణ హత్యకు గురెయ్యాడు. స్థానికులు ,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాపోలు దానయ్య(38) కౌలు రైతుగా వ్యవసాయం చేస్తున్నాడు.గత నెల రోజుల క్రితం భార్య శారద తీరుపై అనుమానం రావడంతో నిలదీశాడు. అప్ప టి నుండి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. కులం పెద్దమనుషులు ఇద్దరికి సర్ధిచెప్పారు. ఆదివారం ఉదయం భార్యభర్తలు ఇద్దరు కలిసి బైక్‌పై పంతంగి శివారులోని శెనిగల గుట్ట వద్ద ఉన్న కౌలుకు తీసుకున్న పొలం వద్దకు వెళ్ళారు.అక్కడ ఏంజరిగిందో కానీ దానయ్య హత్యకు గురైయ్యా డు.భర్త కనిపించడం లేదని మృతుడి తమ్ముడికి భార్య ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో గుట్ట ప్రా ంతానికి వచ్చి చూడగా హత్యకు గురై అక్కడికక్క డే దానయ్య మరణించాడు.వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చౌటుప్పల్ సిఐ జి.మన్మథకుమార్ పోలీస్ సిబ్బందితో హూటాహుటిన సంఘటన స్థలానికి చెరుకున్నారు.డాగ్ స్క్వాడ్ తో పాటు క్లూస్ టీం రంగంలోకి దింపి ఆధారాలను సేకరించారు.ఇదిలా ఉండగా భార్యకు ఉన్న అక్రమ సంబంధాన్ని భర్త దానయ్య నిలదీయడం తో భార్య ఈ ఘాతుకానికి పాల్పడిందని మృతుడి బంధువులు ఆరోపించారు.మృతుడి భార్య శారదను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సిఐ మన్మధకుమార్ తెలిపారు. మృతుడికి ఒక కొడుకు,ఇద్దరు కూతుర్లు ఉన్నారు.తన పని తాను చేసుకొని గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే దానయ్య హత్యకు గురికావడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మన్మథకుమార్ తెలిపారు.

## కోహెన్స్ కెమికల్ కంపెనీ తరలించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలో ఉన్న కోహెన్స్ కెమికల్ కంపెనీని తక్షణమే దూర ప్రాంతాలకు తరలించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కాలుష్య ప్రభావిత ప్రాంతాల జెఏసి నాయకులు శివరాం నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోహెన్ కంపెనీ నాలుగు దశాబ్ధాల క్రితం జనావాసాలు లేని ప్రదేశంలో ఏర్పాటు చేశారన్నారు. పట్టణం దినదినాభివృద్ధి చెందడంతో పాటు ఇక్కడ ఎన్నో ఏండ్లుగా నివసిస్తున్న ప్రజలు నేల, నీరు, గాలి విషతుల్యం కావడంతో ప్రజలు జీవించే పరిస్థితి లేదన్నారు. పక్కనున్న తండాలలో అనేక రకాల జబ్బులతో మనుషులు మరణిస్తున్నారని ఇదే విషయంపై కంపెనీ మూసివేయాలని అనేకసార్లు పోరాటం చేసిన కంపెనీ యాజమాన్యం కొంతమంది వ్యక్తులను అమ్యామ్యాలను ఆశ చూపుతూ ఉద్యమాన్ని నీరుగారుస్తూ వచ్చారన్నారు. కంపెనీ తీసేంత వరకు ఉద్యమం చేస్తామని, అన్ని రకాలుగా లీగల్ ఒపినియన్ తీసుకుంటూ ముందుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జెఏసి నాయకులు చిలుముల సునీల్ రెడ్డి, మద్దబోయిన శ్రీనివాస్, జాటోత్ నగేష్, ధరావత్ బిక్షం, రేఖ సతోష్ గౌడ్, జ్యోతి నాయక్, హాథిరామ్ నాయక్, కుంభం నాగరాజు, లింగా నాయక్, మకట్‌లాల్, వాజిద్‌మియా పాల్గొన్నారు.

## సహకార సంఘాల పటిష్టతకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తూ ప్రాథమిక క వ్యవసాయ సహకార సంఘాల పటిష్టతకు కృషి చేయాలని నూతనంగా నియమితులైన చైర్మన్, పాలకవర్గాలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన పోచంపల్లి, జూలూరు నూతన పిఏసిఎస్ చైర్మన్ లు పాక మల్లేష్ యాదవ్ కళ్లెం రాఘవరెడ్డి వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులకు ఆయన శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సహకార సంఘాల పాలకవర్గాలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అవసరమైన సేవలు అందించడంలో పిఏసిఎస్ లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతుల సంక్షేమం కోసం సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. సహకార సంఘాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ లు కొట్టం కరుణాకర్ రెడ్డి, రమేష్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంగూరి పాండు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, జూలూరు పిఏసిఎస్ సభ్యులు, అందెల విజయ, జడల అంజయ్య, పల్ల విష్ణువర్ధన్ రెడ్డి, బొబ్బల సుభాష్ రెడ్డి, దుర్గం శ్రీశైలం, రమావత్ కిషన్,పాలకవర్గసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయాలు... రసాయన పరిశ్రమలు

నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న పలు ప్రభుత్వ శాఖల అధికారులు

ప్రజాపక్షం/చౌటుప్పల్: కెమికల్ కంపెనీలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.యాజమాన్యాలు సరైన రక్షణ చర్యలు తీసుకోకపోడంతో ప్రమాదాలకు నిలయంగా కెమికల్ కంపెనీలు మారాయి.చౌటుప్పల్ రెవిన్యూ డివిజన్ పరిధిలో సుమారు 80కెమికల్ కంపెనీలు ఉన్నాయి. కెమికల్ కంపెనీల్లో చాలా వరకు యాజమాన్యాలు లాభాపేక్ష ధ్యేయంగా పరిశ్రమలను నడుపుతున్నారు.పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు మరణిస్తున్న కూడా కనీసం భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.నిత్యం తనిఖీలు చేయాల్సిన అధికారులు ముడుపులకు అలవాటు పడి నామమాత్రపు తనిఖీలో సరిపెట్టడంతో కార్మికుల ప్రాణాలను పోవడానికి పరోక్ష కారణమవుతున్నారు.

### నిత్యం ప్రమాదాలే....పట్టించుకోని ప్రభుత్వ అధికారులు...

చౌటుప్పల్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో ప్రతి వారానికి ఏదో ఒక కంపెనీలో ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి.గతేడాది చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామంలో ఓ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో కార్మికులు గాయపడ్డారు.పేలిన శబ్దానికి గ్రామస్తులు భయాందోళనకు గురెయ్యారు.అదేవిధంగా కొయ్యలగూడెం గ్రామ పరిధిలోని ఓ పరిశ్రమలో రియాక్టర్ పేలి కార్మికుడు మృతి చెందగా అతని కుటుంబానికి నామమాత్రపు పరిహారం ఇచ్చి యాజమాన్యం చేతులు దులుపుకుంది.ఫిబ్రవరిలో అర్ధరాత్రి ఎల్లగిరి గ్రామ పరిధిలో రసాయన పరిశ్రమలో భారీగా పేలుడులు సంభవించాయి.పది మంది కార్మికులు గాయపడ్డారు.ఇదే నెలలో భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ పరిధిలోని విజె సాయి కంపెనీలో రియాక్టర్ పేలింది.భవనం కూలింది.గత నెలలో ఇదే గ్రామపరిధిలోని హేజోలా కంపెనీలో రియాక్టర్ పేలి ఒక కార్మికుడు మృతి చెందాడు.తిరిగి ఈ నెల 21వ తేదిన రాత్రి రియాక్టర్ పేలి ముగ్గురు కార్మికుల ప్రాణాలు బలిన్నారు.ఇంత పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్న కూడా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయకపోవడం విమర్శలకు తావిస్తుంది.



### భద్రతా ప్రమాణాలు గాలికొదిలిన యాజమాన్యాలు

కెమికల్ కంపెనీలో పని చేసే కార్మికులకు కనీస భద్రత చర్యలు కూడా యాజమాన్యాలు కల్పించడం లేదు. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం,డి.నాగారం,దండుమల్కాపురం,ఎల్లగిరి,ధర్మాజీగూడెం,మందోళ్ళగూడెం,ఎస్.లింగోటం,భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం, నారాయణగిరి గ్రామాల్లో ఉన్న రసాయన పరిశ్రమలు కార్మికులు సెఫ్టీ పరికారాలు ఇవ్వని దుస్థితి ఉంది.ఫ్యాక్టరీలను నిత్యం ఆకస్మిక తనిఖీలు చేయాల్సిన కాలుష్యనియంత్రణ బోర్డు అధికారులు,ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్లు తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.అయితే కాలుష్య నియంత్రణ బోర్డు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇఇ కాకుండా కేవలం ఇద్దరే ఏఇలు ఉండడం గమనార్హం.

### ప్రమాదాలు జరుగుతున్న కంపెనీలపై కఠిన చర్యలు

నిత్యం కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాల వల్ల కార్మికులు మృతి చెందడం,రియాక్టర్ల పేలుడు శబ్దాలకు భయాందోళనకు గురైతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.రెవిన్యూ,పోల్యూషన్ బోర్డు,కంపెనీల ఇన్స్‌పెక్టర్లు నిత్యం పర్యవేక్షణ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.గ్రామాలకు సమీపంగా ఉన్న కెమికల్ పరిశ్రమలుశాశ్వతంగామూసివేయాలనిడిమాండ్‌చేస్తున్నారు.

## నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



**ప్రజాపక్షం/తానూర్ :** తానూర్ మండలంలోని హిప్నెల్లీ గ్రామ శివారు బాలాజీ గుట్ట వద్ద ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మ ర్‌ను ఆదివారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేసి అధికారికంగా ప్రారం భించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా సమ స్యలు తీరి,స్థానికులకు నాణ్యమైన విద్యుత్ అందనుంది,ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపాలిటీ చైర్మన్ దత్తు, స్థానిక సర్పంచ్ గంగాసాగర శి వరాం,విద్యుత్ శాఖ సిబ్బంది,మండల నాయకులు,వివిధ గ్రామాల సర్పం చ్‌లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మేకల అశ్విని ఏ వర్గంలోనూ చేరలేదు

### సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ స్పష్టం

**ప్రజాపక్షం / మంచిర్యాల:** మంచిర్యాలలో కాంగ్రెస్ లొల్లి అంటూ ఓ దిన పత్రికలో ప్రచురించిన కథనంలో 6వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఒక వర్గంలో చేరినట్లు రాయడం పూర్తిగా అవాస్తవమని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ కథనాన్ని తీవ్రంగా ఖండి స్తున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం అభ్యర్థిపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మేకల అశ్విని ఎలాంటి రాజకీయ వర్గ మార్పులకు పాల్పడలేదని, కమ్యూనిస్టు పార్టీ పట్ల పూర్తి నిబద్ధతతో, సిద్ధాంతపరమైన విలువలతో పనిచేస్తున్నారని తెలిపారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా వ్యక్తుల పేర్లను రాజకీయ వర్గాలతో ముడిపెట్టడం సరికాదని, బూర్జువా సంస్కృతిని కమ్యూనిస్టులకు అంటగట్టవద్దని హెచ్చరించారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయ కులు పదవులు, స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ విధానాలను మార్చుకునే వారు కాదని, ప్రజా సమస్యలపై నిరంతరం సిద్ధాంతపరంగా పోరాటం చేస్తారని స్పష్టం చేశారు. ఇలాంటి అసత్య ప్రచారాలతో కమ్యూ నిస్టుల నిబద్ధతను దెబ్బతీయలేరని తేల్చిచెప్పారు. సంబంధిత కథనంలోని తప్పుడు సమాచారాన్ని వెంటనే సరిదిద్ది, వాస్తవాలను ప్రజలకు వెల్లడించా లని ఆయన డిమాండ్ చేశారు.

## స్పెల్ బి జాతీయస్థాయి పోటీల్లో ‘శ్రీవిద్య’ పాఠశాల విద్యార్థులు




**ప్రజాపక్షం/పాపన్నపేట:** స్పెల్ బి జాతీయ స్థాయి పరీక్షలు శ్రీవిద్య పాఠ శాల విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచి తృతీయ స్థాయి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఆదివారం హైదరాబాదులో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వ ర్యంలో జాతీయ స్థాయి స్పెల్ బి పోటీ పరీక్షలు నిర్వహించారు. గత సంవ త్సరం రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు. తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఈ.అక్షిత్, శ్రేష్ట క్షర, మనోహర్ లు పాల్గొన్నారు. వీరిలో మూడు రౌండ్ లలో ప్రతిభ కన బరిచి శ్రేష్టక్షర తృతీయ బహుమతి సాధించింది. మిగతా ఇద్దరు రెండు రౌండ్ లలో ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయిలో తృతీయ బహుమతి సాధించడంతో పాఠశాల కరస్పాండెంట్ లు నిటలాక్షప్ప, సుమన్, ప్రిన్సి పల్ రవీందర్ గుప్తా, ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు.

## దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కార్డియాలజీ సేవలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** స్థానిక డాక్టర్ దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషా లిటీ ఆసుపత్రిలో ప్రజలకు మరింత నాణ్యమైన, అత్యవసర వైద్య సేవ లను అందించే లక్ష్యంతో కార్డియా లజీ (గుండె వైద్య) విభాగాన్ని అం దుబాటులోకి తీసుకువచ్చారు. నేటి నుంచి ఆసుపత్రిలో ఒపి సేవలను అధికారికంగా ప్రారంభించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు,ప్రముఖ వైద్యులు డాక్టర్ దేవేందర్ రెడ్డి వెల్లడించారు.ఈ సందర్భంగా డాక్టర్ దేవేం దర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలకు గుండె సంబంధిత వైద్య సేవలను చెంతకే చేర్చాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై గుండెపోటు,ఇతర తీవ్రమైన గుండె సంబంధిత సమస్యల కోసం హైదరా బాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నిర్మల్ లోనే అత్యాధునిక వైద్యం అందుతుందని పేర్కొన్నారు.ఆసుపత్రిలో 24 గంటల పాటు నిరంతరాయంగా అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటా యని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలతో రోగులకు మెరుగైన చికిత్స అందిస్తామని స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా ప్రజలతో పాటు చుట్టుప క్కల ప్రాంతాల ప్రజలు ఈ కార్డియాలజిస్ట్ సేవలను సద్వినియోగం చేసు కోవాలని ఆయన కోరారు.

## ఉపాధ్యాయుడికి సన్మానం



**ప్రజాపక్షం / వాంకిడి :** తెలం గాణ ప్రభుత్వం చేపట్టిన ఎద్యు కేషన్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా సింగపూర్ పర్యట నకు ఎంపికైన ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్‌ను వాంకిడి మండల కేంద్రంలో పలువురు ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం జనకా పూర్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజేష్ సింగ పూర్ పర్యటనకు ఎంపిక కావడం మండల ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు తన సొంత నిధులు రూ.50 వేలతో జీవశాస్త్ర ప్రయోగశాలను ఏర్పాటు చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. సింగపూర్ విద్యా విధానాలు, బోధనా పద్ధతులను పరిశీలించి స్థానిక విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో మాజీ జెడ్‌పిటిసి డాక్టర్ అజయ్ కుమార్, వాంకిడి మాజీ సర్పంచ్ బండే తుకారాం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై ఇంటింటా అవగాహన

**ప్రజాపక్షం/తాండూర్ :** కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఓటరు జాబితా సవరణకు సంబంధించిన నోటీసులను ఇంటింటికీ అందజేశారు. బూత్ స్థాయి అధికారి ఉమామహేశ్వరి ఆదివారం ప్రతి ఇంటికి వెళ్లి నోటీ సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబి తాలో వివరాలను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు ఉంటే సంబం ధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ మొమిన్ అలీ, సేవాదళ్ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందారి గట్టయ్య పాల్గొన్నారు.

# యువతకు శాశ్వత ఉపాధి కల్పించాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ప్రజాపక్షం / మంచిర్యాల :** దేశ యువతను యువశక్తి అంటూ ప్రసంగాల్లో పొగడటం కాకుండా వారికి శాశ్వత ఉపాధి, నాణ్యమైన విద్య, సామాజిక భద్రత, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు కల్పించే విధానాలను కేంద్ర ప్ర భుత్వం అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాల యంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రా జేష్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా 3వ మహాస భలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ముందుగా మాజీ యువజన నాయకుడు మిట్ట పల్లి శ్రీనివాస్ సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కల్లూరు ధర్మేంద్ర మాట్లా డుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు తగ్గిం చడం, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణను పెం చడం ద్వారా యువత భవిష్యత్తును అనిశ్చితి లోకి నెట్టడం ఆపాలని స్పష్టం చేశారు. బొగ్గు, విద్యుత్, పరిశ్రమలు ఉన్న మంచిర్యాల జిల్లాలో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, కొత్త పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాస భలను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ యువత శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని అర్థం చేసు కొని ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యుడు కరకూరి నరేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ మొగిలి లక్ష్మణ్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు మహేష్, ఆంథోని దినేష్, రామడుగు వంశీ, దుర్గారావు, హచ్చే హరీష్, రాకేష్, ఉప్పులేటి తిరుపతి, లవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం

**ప్రజాపక్షం/మెదక్ :** ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహా రాల కమిటీ (పిఎసి) సమావేశం నేడు సోమవారం మెదక్ పట్టణంలోని వినా యక ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మెదక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మందుగుల గంగాధర్ తెలిపారు. ఈ సమావేశానికి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, ఎంపి సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి సంజీవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ తదితర ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. సమావేశానికి ముందు మెదక్ పట్టణం లోని అవుసులపల్లి చౌరస్తా నుంచి వినాయక ఫంక్షన్ హాల్ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొ నాలని పిలుపునిచ్చారు. మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ , కౌన్సిలర్లు, మాజీ వైస్ చైర్మన్‌లు, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, యువజన, మహిళా విభాగా లతో పాటు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సీని యర్ నాయకులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని పట్టణ అధ్యక్షుడు గంగాధర్ కోరారు.

## శిథిలావస్థకు చేరిన వంతెన.. కొత్తది కట్టేది ఎప్పుడు?



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకే శ్వరం మండలంలోని అవర్గా అర్లి వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరు కుంది. శిథిలావస్థకు చేరుకోవడంతో వంతెన యొక్క పెచ్చులు అక్కడక్కడ ఊడి పడిపోతున్నాయి.ప్రయాణి కులు భయాందోళనలలో ప్రయాణం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి కూలకముందే ప్రజల భద్రత ఆలోచించి ఇబ్బందులు కలగకుండా నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. పంచ గుడి వంతెన నిర్మాణంతో ప్రయాణికులు ముధోల్, నిజామాబాద్ వరకు ప్రయాణికులు వెళ్లడం జరుగుతుందని, రవాణా పెరిగిందని, నూతన వంతెన నిర్మించి ప్రజల భద్రతను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## ‘సర్’ రెండో విడత ప్రక్రియలో అందరూ భాగస్వాములు

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజా పక్షం/భైంసా:** ‘సర్’ రెండో విడత ప్రక్రియలో ప్రతీ ఒక్కరూ భాగస్వా ములు అవ్వాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ బిజెపి నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం బైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీలో బిజెపి బిఎల్ఎ 2 కార్యకర్తలచే సర్‌పై రెండో విడత అసెంబ్లీ కార్యా శాల నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియతో బోగస్ ఓట్లకు ఇక తావుండదని, రెండో విడతలో ఏమైనా అనుమానాలు ఉంటే అధి కారులకు తెలియజేయాలన్నారు. ఒకరికి ఒకచోట మాత్రమే ఓటు హక్కు కల్పించాలన్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ చేపట్టడం జరిగింద న్నారు. వలసదారులకు అడ్డుకట్ట వేసేందుకు, విదేశీయులు చొరబడి ఇక్కడ ఉండకుండా చూడడానికి సర్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం సర్ స్టేట్ కో కన్వీనర్ సంజర్ల శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్,సర్ జిల్లా ఇన్‌చార్జి రావుల రామ్ నాథ్, ముధోల్ సర్ ఇన్‌చార్జి పైడిపల్లి గంగా ధర్, సర్ రెండో విడత లో చేపట్టాల్సిన అంశాలను వివరించారు.ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి రవి పాండే,అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ తో పాటు మండల బిజెపి అధ్యక్షుడు, సర్పం చ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో రేపు గవర్నర్ పర్యటన

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిజామాబాద్‌కు గవర్నర్ శివప్ర తాప్ శుక్లా 25న రానున్నారు. పసుపు రైతులతో ముఖాముఖి, యాంటీ డ్రగ్ అవగాహనలో పాల్గొననున్నారు. ఈ మేరకు గవ ర్నర్ హౌస్ నుంచి అధికారిక టూర్ ప్రోగ్రాం విడుదల చేశారు. గవర్నర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా నిజామాబా ద్‌కు చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 25న ఉదయం 9.15 గంటలకు లోక్‌భవన్ నుంచి బయల్దేరి 9.30కు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో ని జామాబాద్‌కు చేరుకుంటారు. 10.20కు ఐడిఒసి హెలిప్యాడ్ కు చేరుకుని అక్కడి నుంచి సుభాష్‌నగర్‌లోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌కు అనంతరం ఎల్లమ్మగుట్టలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో 11 గంటల12 గంటల వరకు నిర్వహించే యాంటి డ్రగ్ అవ గాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ రానున్నారు. కార్యక్రమం అనంతరం డిచ్‌పల్లి రోడ్డులోని నేషనల్ పసుపు బోర్డు కార్యాలయానికి చేరుకుంటారు. 12.15 నుంచి 1 గంటల వరకు పసుపు రైతులతో ముఖాముకి, మార్కెట్ లింకే జీలో పాల్గొంటారు. 1.40 కి నేషనల్ పసుపు బోర్డు నుంచి బర్ది పూర్ ధర్మారం సమీపంలోని పీఎన్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు బయల్దేరి 1.50 కి అక్కడికి చేరుకుంటారు. 1.50నుంచి 2.50 వరకు అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయంలో పాల్గొం టారు. గవర్నర్‌తో పాటు లోక్‌భవన్‌కు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎడీసీ సీఎస్‌వి, పిఎస్ తదితర అధికారులు హెలికా ప్టర్‌లో పర్యటించనున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పోలీసు శాఖ హెలిప్యాడ్లు, కార్యక్రమ వేది కల వద్ద భద్రతా ఏర్పాట్లు, వాహనాల రాకపోకలు, వైద్య సదు పాయాలు తదితర అంశాలపై విస్తృత ఏర్పాటు చేస్తున్నారు.

## మద్యం మత్తులో యువకుడి బలవన్మరణం



**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొరల బంగ్లా ప్రాంతంలో గట్టు సాయికిరణ్ (25) అనే యువ కుడు మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘ టన స్థానికంగా విషాదం నింపింది. పోలీసుల వి వరాల ప్రకారం.. దొరల బంగ్లా ప్రాంతానికి చెం దిన కుమారి కుమారుడు సాయికిరణ్ డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం మద్యం సేవించి తాను ఆత్మహత్య చేసు కుంటానని బెదిరిస్తున్నట్లు సోదరి గాయత్రి తల్లికి సమాచారం ఇచ్చింది. ఆందోళనతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి కిటికీ అద్దాలు పగలగొట్టి చూడగా సాయికిరణ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కని పించాడు. వెంటనే తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లినప్పటికీ అప్పటికే అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలా నికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి గట్టు కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

### బీటలు వారిన గోడలు-పెచ్చులూడుతున్న పైకప్పు

### భయాందోళనలో విద్యార్థుల చదువు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** చదువుల తల్లి సరస్వతీ నిలయంగా ఉండాల్సిన పాఠశాల, నేడు శిథిలాలయంగా మారి విద్యార్థుల పాలిట భయంగా మారింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని ప్రభుత్వం గొప్పగా చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి దారుణంగా ఉంది. దీనికి ప్రత్యక్ష నిదర్శ నమే మెదక్ జిల్లా, అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ గ్రామ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల గోడలపై భారతరత్న డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, స్వామి వివేకానంద, భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ చిత్రాలు దర్శనమిస్తున్నాయి. విద్య యొక్క గొప్పతనాన్ని చాటే ఆ మహనీ యుల చిత్రాల వెనుక ఉన్న గోడలు మాత్రం పెచ్చులు ఊడిపోయి, నాచు పట్టి, పగుళ్లు వచ్చి ఎప్పుడు కూలిపోతుందో తెలియని దయనీయ స్థితిలో ఉంది. భవనం పైకప్పు, గోడల సందుల్లో చెట్లు మొలిచి వేర్లు గోడల్లోకి చొచ్చుకుపోయాయి. కిటికీలు తుప్పు పట్టి, తలుపులు విరిగిపోయి ఉన్నాయి. వర్షం కురిస్తే తరగతి గదుల్లోకి నీరు వచ్చి చేరుతుందని, విద్యా ర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాత భవనానికి ఇప్పటివరకు సరైన మరమ్మతులు కూడా చేపట్టలేదని గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు. మా పిల్లలను రోజూ భయం భయంగా బడికి పంపుతున్నాం. వర్షాకాలంలో బడి భవనం కూలిపోతుందేమోనని భయం. ప్రభుత్వం మా బడిని పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమం ఈ పాఠశాలకు ఎందుకు వర్తించలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ హంగులతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెబుతున్న అధి కారులు, ఈ పాఠశాలను ఎందుకు విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికా రులు వెంటనే స్పందించి, గడిపెద్దాపూర్ పాఠశాలను సందర్శించి, శిథిల మైన పాత భవనం స్థానంలో నూతన భవనాన్ని మంజూరు చేయాలని, విద్యార్థులకు సురక్షితమైన విద్యను అందించాలని గ్రామస్తులు, విద్యా ర్థులు, తల్లిదండ్రులు కోరారు.

## రెండో పిఆర్‌సిని ప్రకటించాలి

### టిజిఇజెఎసి డిమాండ్



**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** రెండో పిఆర్‌సిని వెంటనే ప్రకటించి అమలు చేయా లని తెలంగాణ ఎంప్లా యీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇజెఎసి) స్టీరింగ్ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపా ధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ 27న కలెక్టరేట్ల ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవ నంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 6 డిఎలను తక్షణమే విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్ బిల్లుల బకాయిలను చెల్లించడంతో పాటు అసంబద్ధ వర్క్ అడ్జస్ట్‌మెంట్ జిఓ 25ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ అధికారుల నియామకా నికి సర్వీస్ రూల్స్ రూపొందించాలని, హెల్త్ కార్డులను సక్రమంగా అమలు చేస్తూ 64 సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. 27న జరిగే ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిజిఇజెఎసి నాయకులు మేడి చరణ్‌దాస్, ఏటుకూరి శ్రీనివా సరావు, శాంతికుమారి, జయదేవ్ అబ్రహం, శివప్రసాద్, ప్రభాకర్, డి ఇస్తారి, జె కేశవ్, ప్రకాశ్, దేవాజీ, బిక్షపతి, మహిపాల్, మహేష్, రాజకమలాకర్ రెడ్డి, ఆరిఫ్ అహ్మద్, అన్వర్ అహ్మద్ పాల్గొన్నారు.

## డిబిఎల్ సంస్థ నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోతున్నాయి

### సిపిఐ జిల్లా నాయకుడు బోయిరే ప్రకాష్ ఆరోపణ



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ రూరల్ :** జా తీయ రహదారి మరమ్మతుల పేరిట రోడ్డును తవ్వి వదిలేయడం వల్ల జరుగు తున్న ఘటనలు ప్రమాదాలు కాదని, డిబిఎల్ సంస్థ నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న హత్యలేనని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోయిరే ప్రకాష్ ఆరోపించారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై సుమారు రెండు నెలల క్రితం డిబిఎల్ సంస్థ రోడ్డును తవ్వి ఇప్పటివరకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమన్నారు. రోడ్డును ప్రమాదకరంగా వదిలేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, పలు వురు వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నా రని పేర్కొన్నారు. బంబార గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన ప్రమాదంలో మంచిర్యాల జిల్లాకు చెందిన వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. తవ్విన ప్రాంతాల్లో హెచ్చ రిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రాత్రి వేళల్లో లైటింగ్ ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదాలు పెరు గుతున్నాయని విమర్శించారు. నిన్నటి ప్రమా దంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, ఘటనపై సమగ్ర విచా రణ జరిపి బాధ్యులైన డిబిఎల్ సంస్థపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. తక్షణమే శాశ్వత మ రమ్మతులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు




**ప్రజాపక్షం/బోథ్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదు వుతున్న పేద విద్యార్థులు, పదవ తరగతి ఫలి తాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహించేం దుకు వినాయకరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ప్రతి సంవత్సరం 8000 రూపాయలు స్కాలర్‌షిప్‌లు అందజేయడం జరుగు తోంది.గత 26 సంవత్సరాలుగా నిరంతరంగా ఈ స్కాలర్‌షిప్‌లను అందిస్తూ, ఆర్థికంగా వెను కబడిన విద్యార్థులకు అండగా నిలుస్తూ వారి విద్యాభివృద్ధికి ట్రస్ట్ తన వంతు సహకారం అంది స్తోందని తెలిపారు.గత 26 సంవత్సరాలుగా కొన సాగుతున్న ఈ సేవా కా ర్యక్రమం ద్వారా అనేక మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ప్రయో జనం పొందారు. విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ వినాయకరావు మెమోరి యల్ ట్రస్ట్ వారి ఆకాంక్ష. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చెర్మన్ శామ్ మోహన్ రావు (రిటైర్డ్ జిల్లా జడ్జి) ట్రస్ట్ వైస్ చెర్మన్ వామన్ రావు దేశ్‌పాండే (బోథ్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్) సెక్రటరీ నందయ్య, పోశెట్టి, ఉపాధ్యాయులు, న్యాయవా దులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**ప్రజాపక్షం/తలమడుగు:** పిడి ఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 300 కిలోల బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆది లాబాద్ రూరల్ సిఐ రహీం పాషా తెలిపారు. సుంకిడి చౌరస్తా వద్ద తలమడుగు ఎస్ హెచ్ఓ డి. రాధిక ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ ఇమ్రాన్ ఖాన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడు. తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో తెలిసింది. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ తరలిం పునకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# మంత్రి, ఎమ్మెల్యే మధ్య భగ్గుమన్న విభేదాలు

### ఎవరి వైపు నిలవాలో తెలియక శ్రేణుల్లో అయోమయం

**ప్రజాపక్షం/లక్షెట్టిపేట :** చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు అధికార పార్టీ కింది స్థాయి శ్రేణులను అయోమయంలోకి నెట్టినట్లు తెలుస్తోంది. ఇద్దరు నేతల మధ్య సమన్వయం కొరవడటంతో ఎవరి వైపు నిల వాలో తెలియక నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకవైపు మంత్రి వర్గంతో, మరోవైపు ఎ మ్మెల్యే వర్గంతో సన్నిహితంగా ఉండే నాయకుల మధ్య దూరం పెరుగుతు న్నట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ కోసం పనిచేస్తున్న కింది స్థాయి నాయకులు ఇరువర్గాలతో సంబంధాలు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఇదిలా ఉండగా పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ తన సొంత పార్ల మెంట్ పరిధిలో పర్యటిస్తున్న సమయంలోనూ వర్గ విభేదాల ప్రభావం కనిపిం చిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపి పర్యటనలో పాల్గొనేందుకు వ చ్చిన పిఎస్ఆర్ వర్గీయులను కొందరు అడ్డుకున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో అధికార పార్టీలోని అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయనే చర్చ మొదలైంది. ముఖ్య నేతల మధ్య సమన్వయం లేకపోవడం కింది స్థాయి నా యకుల్లో అసంతృప్తికి కారణమవుతోందని పార్టీ శ్రేణులు అంటున్నాయి. పార్టీలో వర్గపోరు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివృ ద్ధిపై ప్రభావం పడే అవకాశం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులను ముందుకు తీసు కెళ్లాల్సిన నాయకులే వర్గాలుగా విడిపోతే ప్రజా సమస్యల పరిష్కారం వెనుక బడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం జో క్యం చేసుకుని మంత్రి, ఎమ్మెల్యే మధ్య నెలకొన్న విభేదాలకు పరిష్కారం చూపి కింది స్థాయి శ్రేణుల్లో నెలకొన్న అయోమయానికి తెరదించాలని పార్టీ నాయకులు కోరుతున్నారు.

మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియో-ఫాంటసీ 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

రీల్

# 'విశ్వంభర'లో చిరంజీవి ఫెరోషియస్ లుక్



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియో ఫాంటసీ 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రముఖ స్టూడియోలు వీఎఫ్ఎక్స్ పనులను పూర్తి చేస్తున్నాయి.'విశ్వంభర' నుంచి స్పెషల్ పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్‌ట్రాక్ ను విడుదల చేశారు.పోస్టర్‌లో చిరంజీవి ఫెరోషియస్ లుక్ ఆకట్టుకుంటోంది. ఆయన ఇంటెన్స్ లుక్, స్క్రీన్ ప్రెజెన్స్‌కు మెటాలిక్ త్రిశూలం మరింత పవర్‌ను తీసుకొచ్చింది. ఈ లుక్ సినిమాలోని దైవత్వం, వీరత్వంతో కూడిన ప్రపంచాన్ని ప్రజెంట్ చేస్తోంది. దర్శకుడు వశిష్ఠ 'విశ్వంభర'ను భారీ విజువల్ స్కేల్, రిచ్ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్ రూపొందిస్తున్నారు.ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తుండగా, మౌనీ రాయ్ ప్రత్యేక గీతంలో కనిపించనున్నారు. ఛోటా కె. నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి పాటలకు సంగీతం అందిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఓ డ్యాన్స్ నంబర్కు సంగీతం సమకూర్చారు. గౌర హరి నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 'విశ్వంభర' థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, భీమ్స్ సిసిరోలియో, నేపథ్య సంగీతం: గౌర హరి, ఛాయాగ్రహణం: ఛోటా కె. నాయుడు.



# 'వాట్ ఏ లాజిక్ సర్ జీ' సాంగ్ లాంచ్

సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మహేంద్రగిరి నేపథ్యంగా, వారాహి మాత డివైన్ పవర్ చుట్టూ సాగే కథతో రూపొందుతోంది. . ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'వాట్ ఏ లాజిక్ సర్ జీ' పాటను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ సెప్టెంబర్ 11న మా 'మహేంద్రగిరి వారాహి' సినిమాతో అంత సౌండ్ చేయాలని కోరుకుంటున్నాం. అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ.. సుమంత్ ఈ సినిమాలో పెర్ఫార్మెన్స్ అదరగొట్టారు. ఇందులో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. సంతోష్ చాలా పేషెంట్‌గా ఈ సినిమా తీశాడు. మా నిర్మాతలు చాలా అద్భుతంగా ఈ సినిమాను నిర్మించారు. ఇలాంటి సినిమా చేయాలంటే చాలా గట్స్ కావాలి. సెప్టెంబర్ 11న తప్పకుండా అందరూ థియేటర్స్‌లో సినిమా చూడండి.డైరెక్టర్ సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ సినిమా సెప్టెంబర్ 11న రిలీజ్ అవుతుంది. అందరూ ఈ సినిమాని సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను.. సుమంత్ తో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది.ప్రొడ్యూసర్ మధు మాట్లాడుతూ..ఇది మీ అందరూ ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా అని అన్నారు.

# 'జాంబీ రెడ్డి 2'గా హీరో తేజ సజ్జ



హనుమాన్', 'మిరాయ్' వంటి రెండు సంచలనాత్మక బ్లాక్‌బస్టర్లను అందించిన సూపర్ హీరో తేజ సజ్జ మరోసారి జాంబీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. 'జాంబీ రెడ్డి' ఫ్రాంచైజీలో రెండో భాగాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'జాంబీ రెడ్డి'తో తెలుగు సినిమాకు జాంబీ జానర్‌ను పరిచయం చేసిన దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్కు క్రియేటర్‌గా వ్యవహరిస్తుండగా, సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహిస్తున్నారు.'హక్', 'రానా నాయుడు', 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వంటి ఒటిటి ప్రాజెక్టులతో గుర్తింపు తెచ్చుకున్న సుపర్ణ్ ఎస్. వర్మ.. ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తేజ సజ్జా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో 'మిరాయ్' తర్వాత వస్తున్న చిత్రమిది. రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ నటి షనాయా కపూర్ ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు.గౌరహరి సంగీతం అందిస్తున్నారు. అభినందన్ రామానుజం సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, బంగ్లాన్ ప్రొడక్షన్ డిజైన్, విజయ్ వెలుకుట్టి ఎడిటింగ్. హుస్సేన్ దలాల్, అబ్బాస్ దలాల్, ప్రశాంత్ వర్మ, సుపర్ణ్ ఎస్. వర్మ స్క్రీన్‌ప్లే అందించగా, సుబ్బు కె. డైలాగ్స్ రాశారు.'జాంబీ రెడ్డి 2 నెక్స్ట్ లెవెల్' 2027లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, నేపాలీ, జపనీస్ భాషల్లో విడుదల కానుంది.



# 'ప్రేమ బానిస' పోస్టర్ విడుదల

హనీ క్రియేషన్స్ సమర్పణలో హీరోలు శ్రీ, రాజువర, హీరోయిన్ శృతి శంకర్, నటులు అప్పారావు, రైజింగ్ రాజు ముఖ్యపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ప్రేమబానిస'. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే దర్శకత్వం సలీం భాషా. నిర్మాతలు ఎస్. మహబూబ్ భాషా, కె. ప్రభాకర్. ఈ చిత్రానికి సంబంధించి ఫిలిం ఛాంబర్ లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ హీరోయిన్ లయ చేతుల మీదుగా పూజా కార్యక్రమం, పోస్టర్ లాంచ్ ఘనంగా జరిగింది. ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ శివ నిర్వహిస్తుండగా, అశోక్ ఎడిటింగ్ బాధ్యతలను సమకూరుస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సలీం భాషా మాట్లాడుతూ హీరోయిన్ లయ చేతుల మీదుగా 'ప్రేమబానిస' పోస్టర్ విడుదల కావడం చాలా ఆనందంగా ఉంది. మా చిత్ర కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా వచ్చిన లయకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రేమబానిస' అందర్నీ అలరించే కథాంశంతో రూపుదిద్దుకుంటోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా ఆకట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. సెప్టెంబర్ నుండి కర్నూల్‌లో ఈ చిత్రం శరవేగంగా రెగ్యులర్ షూటింగ్ జరగనుంది అని తెలిపారు. నిర్మాతలు ఎస్. మహబూబ్ భాషా, కె. ప్రభాకర్ లు మాట్లాడుతూ ప్రస్తుతం టాలీవుడ్ లో వస్తోన్న ప్రేమకథలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించనున్నాం అని తెలిపారు. హీరోలు శ్రీ, రాజువర మాట్లాడుతూ యువతరం మెచ్చే కథాంశంతో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. మాకు ఈ సినిమాలో అవకాశం కల్పించిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ శృతి శంకర్ మాట్లాడుతూ చక్కటి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన కథానాయిక పాత్రకు పూర్తి న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

# కర్ణాటకలో కూడా తెలుగు సినిమాలను ఇష్టపడతాం

'టాక్సిక్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో యశ్
యశ్‌తో సినిమా చేయడానికి వెయిటింగ్: దిల్ రాజు



రాకింగ్ స్టార్ యశ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్'. గీతు మోహన్దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం లో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించారు. ఇంగ్లిష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో డబ్బింగ్ వెర్షన్స్‌లో రిలీజ్ కానుంది. ఆగస్టు 26 ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ సినిమాకు సరిహద్దులు లేవు. భాషను, సరిహద్దులను మించి మానవత్వం ఉంది, ప్రేమ ఉంది, నిజాయితీ ఉంది అని మీరు చూపించారు. అలాగే కర్ణాటకలో కూడా మేము తెలుగు ప్రజలను సినిమాలని ఎంతగానో ఇష్టపడతాం. మన ఇండియన్ సినిమా ప్రపంచ స్థాయిలో నిలబడాలి. మనందరం కలిసి ఇండియన్ సినిమాను గ్లోబల్ సినిమాలో ఒక ప్రత్యేక స్థానంలో నిలబెట్టాలి అన్నారు. నిర్మాత కేవీఎన్ మాట్లాడుతూ: ఈ సినిమాను చాలా పెద్ద విజన్‌తో, బోల్ డ్రీమ్‌తో, చాలా బ్యూటిఫుల్‌గా నిర్మించాం. కియారా అద్వానీ మాట్లాడుతూ మహేశ్ బాబు తో కలిసి 'భరత్ అనే నేను' నా తొలి తెలుగు సినిమా. అప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న అభిమానం, ప్రేమను మాటల్లో చెప్పలేను. ఇక్కడికి ఎప్పుడు వచ్చినా ఇంటికి వచ్చినట్టే అనిపిస్తుంది. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ఈరోజు దేశంలోని అన్ని భాషల్లో సినిమాలు నిర్మిస్తున్న ప్రొడ్యూసర్ కేవీఎన్ . తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళం, హిందీ.. ఇలా అన్ని భాషల్లో సినిమాలు చేస్తున్నారు. రామానాయుడు తర్వాత ఇండియాలో అన్ని భాషల్లో సినిమాలు చేస్తున్న ప్రొడ్యూసర్‌గా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు అభినందనలు. 'కేజీఎఫ్' సినిమాతో యశ్ తో నాకు పరిచయం అయింది. 'కెజిఎఫ్' తర్వాత ఎవరైనా ఇంకా పెద్దగా ఆలోచిస్తారు. కానీ యశ్ మాత్రం ఒక కొత్త దర్శకురాలిని పరిచయం చేస్తూ, కథలో ఉన్న బలాన్ని నమ్మి 'టాక్సిక్' సినిమా చేశారు. ఇండియన్ సినిమాను పాన్ వరల్ సినిమాగా మార్చాలనే ఆయన విజన్కు హ్యాట్సాఫ్. రాజమౌళి తర్వాత ఇలాంటి ఫిల్మ్‌మేకర్లు ఇండియన్ సినిమాను పాన్ వరల్ స్థాయికి తీసుకెళ్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. విజన్, నమ్మకం ఉంటేనే ఇలాంటి సినిమా సాధ్యమవుతుంది. ఈ సినిమా విజువల్స్ చూస్తే మతి పోయింది. నిర్మాతలు ఎంత చెబితే అంత ఇచ్చి ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నాం. కంపోజర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్లు కలెక్ట్ చేస్తుందని చెప్పారు. అది ఈ యూనిట్ మొత్తానికి ఈ సినిమాపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. యశ్ తో సినిమా చేయడానికి నేను కూడా వెయిటింగ్. ఆయన అనౌన్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తుంటాను అని చెప్పారు. మల్లారెడ్డి , హుమా ఖురేషి , రుక్మిణి వసంత్ .మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ , లిరిక్ రైటర్ రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి నాగేశ్వరరావు అరెస్ట్

ఎపి మద్యం రవాణా టెండర్ల కేసులో ఇడి కీలక చర్యలు..
కొండాపూర్ నుంచి బషీర్‌బాగ్ కార్యాలయానికి తరలింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లో గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కీలక చర్యలు చేపట్టింది. మాజీ మంత్రి,వైసిపి సీనియర్ నేత కారుమూరి నాగేశ్వరరావును ఆదివారం హైదరాబాద్‌లో ఇడి అధికారులు అరెస్ట్ చేశారు. కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు అనంతరం బషీర్‌బాగ్‌లోని ఇడి ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. ఈ కేసు ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన మద్యం రవాణా టెండర్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగం. టెండర్ నిబంధనలను కొందరికి అనుకూలంగా మార్చడం, కాంట్రాక్టులను సబ్‌కాంట్రాక్టులకు అప్పగించడం, ఆర్థిక లావాదేవీలను దారి మళ్లించడం వంటి అంశాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మనీలాండరింగ్ కోణాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195.33 కోట్ల మేర నష్టం లేదా అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ గుర్తించిందని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. మద్యం రవాణా కాంట్రాక్టుల ద్వారా వచ్చిన నిధుల ప్రవాహం, సబ్‌కాంట్రాక్టుల వ్యవస్థ, సంబంధిత వ్యక్తులు–సంస్థల మధ్య జరిగిన లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇడి దర్యాప్తు ఆంధ్రప్రదేశ్ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, విజిలెన్స్ నివేదిక ఆధారంగా ముందుకు సాగుతోంది. కేసు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద దర్యాప్తులో ఉంది. ఈ కేసులో భాగంగా జూన్‌లో ఈడీ అధికారులు కారుమూరి నాగేశ్వరరావుకు, ఆయన కుటుంబ సభ్యులకు, ఇతర అనుమానితులకు సంబంధించిన హైదరాబాద్‌లోని ఆస్తులపై సోదాలు నిర్వహించారు. అదే దర్యాప్తులో ఆయన కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్‌ను జూన్ 18న ఇడి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. కారుమూరి నాగేశ్వరరావు అరెస్టు నుంచి రక్షణ కోసం ముందస్తు బెయిల్ కోరగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ ఆయనకు ఊరట లభించలేదు.ఈ పరిణామాల అనంతరం ఇడి అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

# రోడ్డెక్కిన రైలు

రోడ్డెక్కిన రైలు ఇంజన్. ఇదేంటి రైలు ఇంజన్ రోడ్డెక్కడం అనుకుంటున్నారా? బెంగుళూరు నుంచి ఛత్తీస్‌గడ్‌కు భారీ లారీలో రైలు ఇంజన్ తరలిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వద్ద కాసేపు ఆపినప్పుడు ప్రజాపక్షం ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించిన ఫొటో.

– ప్రజాపక్షం/నిజామాబాద్



# తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలే లక్ష్యం

మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతకు జపాన్‌లో నైపుణ్య ఆధారిత అంతర్జాతీయ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి జపాన్‌లో పలు రోజులపాటు పర్యటించనున్నారు. జపాన్ ఉద్యోగ విపణిలో భారతీయ యువతకు, ముఖ్యంగా నైపుణ్యాలు కలిగిన వారికి అందుబాటులో ఉన్న ఉపాధి, కెరీర్ అవకాశాలను మంత్రి పరిశీలించనున్నారు. ఒసాకా విమానాశ్రయానికి చేరుకున్న మంత్రికి కెరీర్ కన్సల్ట్జ సిఇఓ



మెనేని రోహిత్ రావు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. పర్యటనలో భాగంగా జపాన్‌లోని వివిధ నగరాల్లో సంబంధిత సంస్థలు, పరిశ్రమలు, ఉద్యోగదాతలు, ఇతర కీలక భాగస్వాములతో మంత్రి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాలను రోహిత్ రావు సమన్వయం చేయనున్నారు. జపాన్‌లోని సంస్థలు, ఉద్యోగదాతలతో సహకార అవకాశాలను అన్వేషించడంతోపాటు తెలంగాణ, భారతీయ యువతకు నైపుణ్య ఆధారిత ఉపాధి, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు, మెరుగైన కెరీర్ మార్గాలను అందుబాటులోకి తీసుకురావడమే పర్యటన ప్రధాన ఉద్దేశమని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## దాన్నెప్పుడో మూసేశాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటిస్తానని మొట్టమొదటిసారి వెల్లడించారు. ఆనాడే ఇరాన్ సుప్రీం సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయిూ స్పందిస్తూ, ఎంఓయుకు కట్టుబడి తన బాధ్యతలను అమెరికా నెరవేర్చేవరకు, షరతులు అమలు చేసేవరకూ హోర్ముజ్ జలసంధిని తెరిచే ఉద్దేశం లేదని ప్రకటించారు. అమెరికా తన వైఖరిని మార్చుకునేవరకూ ఆయన వల్ల యావత్ ప్రపంచం సమస్యలు ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. ఐతే వాషింగ్టన్ పోస్ట్ ప్రకటించిన బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ డేటా ప్రకారం, గడచిన వారంలో 200 నౌకలు జలసంధిలో ప్రయాణం చేశాయి. దానికి ముందువారం 150 నౌకలు ప్రయాణం చేయగా, రెండు వారాల క్రితం 40 నౌకలు మాత్రమే ప్రయాణం చేశాయి. యుద్ధానికి ముందు రోజుకు 140 నౌకలు జలసంధిలో ప్రయాణం చేస్తూ ఉండేవి.మారిటైమ్ ఇంటిలిజన్స్ ఫర్మ్ కెప్లర్ చెప్పిన సమాచారం ప్రకారం, గడచిన రెండు వారాలలో జలసంధిలో ప్రయాణం చేసిన 80 శాతం నౌకలు ద్రవీకృత పదార్థాలను తీసుకువెళ్ళాయి.

**శత్రువును నిరాశ పరచిన ఇరాన్ ప్రజలు**

ఇరాన్ ప్రజలు శత్రువులను నిరాశకు గురిచేశారని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. ఆదివారం టెహ్రాన్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, యుద్ధ సమయంలో ఇరాన్ ప్రజలు అసాధారణమైన సమైక్యతను, సైన్యాలకు సంఘీభావాన్ని ప్రదర్శించారని, ఇది యావత్ ప్రపంచదేశాలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసిందని చెప్పారు. ముఖ్యంగా ఇరాన్ శత్రువులు తమ దేశ ప్రజల ఐక్యతను చూసి తీవ్ర నిరాశకు గురయ్యారని విమర్శించారు. శత్రుదేశాలు ఆర్థికంగా ఇరాన్‌ను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నప్పటికీ, ప్రజలు ఆర్థిక,సైనికపరమైన ఒత్తిళ్ళకు గురికాకుండా దేశానికి అండగా నిలబడ్డారని ప్రశంసించారు.దేశం కుప్పకూలిపోతుందని పరిపాలన అస్తవ్యస్తమవుతుందని అంచనాలు వేశారని, కానీ ఇరాన్ ప్రజలు అసాధారణమైన ఐక్యతను, సంఘీభావాన్ని ప్రదర్శించి దేశాన్ని కాపాడుకున్నారన్నారు.

## మానవ హక్కులు

(మొదటి పేజీ తరువాయి)

సమ సమాజ నిర్మాణానికి వీటిని పరిరక్షించడం/సమర్థించడం కీలకమని ఈ సందర్భంగా నాయకులు సందేశమిచ్చారు. ఈ పుస్తకం తొలి ప్రతులను కార్మికులు విభా, రిహానా ఖాతూన్, దశరత్ పాశ్వాన్‌కు అమర్‌జిత్ కౌర్‌తో కలిసి సిపిఐ కార్యదర్శి పి.సందోశ్ కుమార్, ఢిల్లీ కార్యదర్శి దినేశ్ వర్ష్నే అందజేశారు. నాయకులు, వైద్యులు, మేధావులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశముందన్నారు. సోమ, మంగళవారాల్లో కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. మంగళ. బుధవారాల్లో ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు. బుధవారం నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని, ఈ కాలానికి ప్రత్యేక హెచ్చరికలు జారీ చేయలేదన్నారు.

## చర్చలు సఫలం

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలో పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను రెట్రో ఫిట్‌మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకునేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందించనున్నట్లు తెలిపారు. కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందన్నారు. హైదరాబాద్‌లోని కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఎలక్ట్రిక్ ఆటోలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి వివరించారు.

**డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది: బి.వెంకటేశం(ఆటో జెఎసి అధ్యక్షులు)**

ఆటో కార్మికులు చేపట్టిన సమ్మె సఫలమైందని ఆటో జెఎసి అధ్యక్షులు బి.వెంకటేశం తెలిపారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చల్లో పలు అంశాలపై స్పష్టమైన హామీలు లభించాయని వెల్లడించారు. ఆటో కార్మికుల ఐక్య పోరాటం ఫలితంగానే ప్రభుత్వం చర్చలకు వచ్చిందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించడం తమ పోరాటానికి లభించిన విజయమని చెప్పారు. 2012 తర్వాత ఆటో చార్జీలు పెరగలేదని, చార్జీల పెంపునకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించడం కూడా కీలక పరిణామమని తెలిపారు. చార్జీల పెంపుపై నివేదిక తీసుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com